www.bharathasakthi.com

# భారత శక్తి

VOICE OF INDIAN

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి : 21 | సంచిక : 29 | హైదరాబాద్ | శుక్రవారం,జులై 3 , 2026 | పేజీలు : 12 | వెల : 1.00

## వాయవ్య బంగాళాఖాతంలో అల్పపీడనం... ఉత్తరాంధ్రకు వర్షసూచన

**అమరావతి (భారత శక్తి)** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో రానున్న మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ప్రకటించింది. ముఖ్యంగా ఉత్తరాంధ్రలోని ఒకటి రెండు ప్రాంతాల్లో భారీ వర్షాలు పడొచ్చని హెచ్చరించింది.వాయవ్య బంగాళాఖాతం, దానిని ఆనుకుని ఉన్న ఒడిశా-బెంగాల్ తీర ప్రాంతాల్లో ఈ అల్పపీడనం కేంద్రీకృతమై ఉంది.

ఇది రానున్న రెండు, మూడు రోజుల్లో మరింత బలపడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. దీని ప్రభావంతో రాష్ట్ర తీరం వెంబడి గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీస్తాయని పేర్కొన్నారు.రేపు (జూలై 3) శ్రీకాకుళం, పోలవరం, కోనసీమ, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని అంచనా వేశారు. ఈ నేపథ్యంలో తీర ప్రాంత ప్రజలు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. అల్పపీడన కదలికలను నిరంతరం గమనిస్తున్నామని, ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తామని తెలిపారు.

## క్రాంతి కుమార్ కుటుంబానికి అండగా ఉంటాం: జగన్



**అమరావతి (భారత శక్తి)** విజయవాడలో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న దళిత యువకుడు క్రాంతి కుమార్ కుటుంబాన్ని వైసీపీ అధినేత జగన్ గురువారం పరామర్శించారు. క్రాంతి కుమార్ భార్య, పిల్లలు, తండ్రిని ఓదార్చిన జగన్, వారికి న్యాయం జరిగే వరకు తమ పార్టీ అండగా నిలిచి పోరాడుతుందని భరోసా ఇచ్చారు.అనంతరం మీడియాతో మాట్లాడిన జగన్.. రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థ పూర్తిగా కుప్పకూలిందనడానికి క్రాంతి కుమార్ ఆత్మహత్యే నిదర్శనమని అన్నారు. "ఆత్మహత్య చేసుకునే ముందు క్రాంతి కుమార్ స్వయంగా సెల్ఫీ వీడియో తీసి, సీఐ నాగరాజు, ఇతర పోలీసుల వేధింపుల గురించి వివరించారు. అయినా ఇంతవరకు బాధ్యులపై చర్యలు తీసుకోలేదు" అని జగన్ ఆవేదన

2లో..

## టీఎంసీలో చీలిక.. ఇరు పక్షాలకు ఈసీ నోటీసులు



మాజీ సీఎం మమతా బెనర్జీపై రితబ్రత బెనర్జీ తిరుగుబాటు బావుటా ఎగరేసిన నేపథ్యంలో ఈసీ ఇరు వర్గాలకు నోటీసులు జారీ చేసింది. తామే అసలైన టీఎంసీ అని ఇరు వర్గాలు చెబుతున్న నేపథ్యంలో వారి వివరణ కోరుతూ నోటీసులు ఇచ్చింది. ఇంటర్నెట్ డెస్క్: టీఎంసీ నేత రితబ్రత బెనర్జీ పార్టీ అధినేత్రి మమతా బెనర్జీపై తిరుగుబాటు బావుటా ఎగరేసిన నేపథ్యంలో ఎన్నికల సంఘం స్పందించింది. ఇరు వర్గాలకు నోటీసులు జారీ చేసింది. పార్టీ ఎన్నికల గుర్తుతో పాటు టీఎంసీ నాయకత్వం తమదే అంటూ ఇరు వర్గాలు ప్రకటించుకున్న నేపథ్యంలో ఈసీ గురువారం ఈ నోటీసులు జారీ చేసింది. పార్టీ గుర్తు, బ్యాంక్ అకౌంట్లు, పార్టీ కార్యవర్గం, ఇతర వ్యవస్థల విషయంలో జులై 6 లోపు పూర్తిస్థాయి వివరాలు ఇవ్వాలని కోరింది. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో టీఎంసీ ఓటమి తరువాత రితబ్రత సారథ్యంలో ఒక వర్గం తిరుగుబాటు బావుటా ఎగరవేసిన విషయం తెలిసిందే. మమత మేనల్లుడు అభిషేక్ బెనర్జీ నాయత్వాన్ని అంగీకరించేది లేదని రితబ్రత తేల్చి చెప్పారు. అంతేకాకుండా, పార్టీకి ఉన్న 80 మంది ఎమ్మెల్యేల్లో 65 మంది తనకు మద్దతుగా ఉన్నారని అన్నారు. అసెంబ్లీలో ఇప్పటికే టీఎంసీ ఎమ్మెల్యేలు రితబ్రతను తమ

2లో..

# మూసీ ప్రక్షాళనకు రూ. 7,345 కోట్లు!



- తెలంగాణ కేబినెట్ చారిత్రాత్మక నిర్ణయాలు.. ఉపాధ్యాయులకూ ఉచిత అల్పాహారం, మధ్యాహ్న భోజనం!
- 'టిమ్స్' ఆసుపత్రుల్లో 6,278 పోస్టుల భర్తీకి గ్రీన్‌సిగ్నల్.. కేంద్ర చట్టంపై సుప్రీంకోర్టుకు వెళ్లాలని తీర్మానం!

**హైదరాబాద్, జూన్ 2 భారత శక్తి:** ముఖ్యమంత్రి అధ్యక్షతన గురువారం జరిగిన తెలంగాణ రాష్ట్ర మంత్రిమండలి సమావేశం పలు సంచలన, ప్రజాకర్షక నిర్ణయాలకు వేదికైంది. రాష్ట్ర సమగ్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా నదీ పరివాహక ప్రాంతాల పునరుజ్జీవనం, వైద్యారోగ్యం, విద్యా రంగాల బలోపేతానికి కేబినెట్ భారీ నిధులను, కొత్త ఉద్యోగాలను మంజూరు చేసింది.

### రూ. 7,345 కోట్లతో 'మూసీ' సుందరీకరణ!

రాజధాని నగరానికి మణిహారంగా నిలిచే మూసీ నదీతీర అభివృద్ధి (రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్) ప్రాజెక్టుకు మంత్రిమండలి భారీ ఊతమిచ్చింది. తొలి విడత పనుల కోసం ఏకంగా రూ. 7,345.12 కోట్ల వ్యయ ప్రణాళికకు కేబినెట్ ఆమోదముద్ర వేసింది.మొదటి దశలో 21 కిలోమీటర్ల మేర నదీ పరివాహక ప్రాంతాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో అద్భుతంగా తీర్చిదిద్దనున్నారు.ఈ ప్రాజెక్టు పర్యవేక్షణ, నిర్వహణ కోసం కొత్తగా 147 పోస్టుల సృష్టికి ప్రభుత్వం అనుమతినిచ్చింది.

### 'నవ శకం': గురువులకూ ఉచిత భోజన వసతి!

రాష్ట్ర చరిత్రలోనే ముందెన్నడూ లేని విధంగా ప్రభుత్వ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయ లోకానికి కేబినెట్ తీపి కబురు అందించింది. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులతో



పాటు ఇకపై ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఇతర సిబ్బందికి కూడా ఉచితంగా అల్పాహారం, పాలు, మధ్యాహ్న భోజన సదుపాయం కల్పించాలని నిర్ణయించింది. ఈ చారిత్రాత్మక నిర్ణయం వల్ల రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.5 లక్షల మంది' విద్యాశాఖ సిబ్బందికి నేరుగా ప్రయోజనం చేకూరనుంది.

### వైద్య రంగంలో కొలువుల జాతర: 6,278 పోస్టుల భర్తీ

రాష్ట్రంలో వైద్య సేవలను మరింత చేరువ చేసేందుకు వీలుగా 'టిమ్స్' (తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్) ఆసుపత్రుల బలోపేతానికి కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. సనత్‌నగర్, ఎల్‌బీ నగర్, ఆల్వాల్,

2లో..

## చీటింగ్ కేసులో మాజీ సిపి ఏకే ఖాన్ కుమారుడు...!

- సినిమా దర్శకుడికి రూ. 50 లక్షల నామం!
- సినిమా పెట్టుబడుల పేరుతో మోసం.. బెదిరింపులు, దాడికి పాల్పడినట్లు ఫిర్యాదు



**హైదరాబాద్ జూన్ 2 భారత శక్తి:** సినిమా ఇండస్ట్రీలో పెట్టుబడులు పెట్టిస్తామంటూ ఓ నూతన దర్శకుడిని నమ్మించి, అక్షరాలా రూ. 50 లక్షలు వసూలు చేసి మోసానికి పాల్పడిన ఘటన నగరంలో సంచలనం సృష్టిస్తోంది. ఈ వ్యవహారంలో హైదరాబాద్ మాజీ పోలీస్ కమిషనర్ కుమారుడు, అతని అనుచరుడిపై జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. డబ్బులు తిరిగి అడిగినందుకు సదరు దర్శకుడిపై దాడికి సైతం తెగబడినట్లు పోలీసులు గురువారం వెల్లడించారు.

### 'మహారాజ్ఞి'కి మాయమాటలు.. రూ. 50 లక్షలు స్వాహా!

పోలీసుల కథనం ప్రకారం... చలనచిత్ర దర్శకుడు వెంకట అనీష్ రెడ్డి తన "మహారాజ్ఞి" అనే సినిమా నిర్మాణానికి పెట్టుబడిదారుల కోసం అన్వేషిస్తున్నాడు. ఈ క్రమంలో జూబ్లీహిల్స్‌లోని సన్‌లిట్ గ్రూప్ కార్యాలయంలో నిందితులైన మొహసిన్ ఖాన్ (మాజీ పోలీస్ కమిషనర్ కుమారుడు), అతని అనుచరుడు తబ్రెజ్‌లను కలిశాడు. సినిమాకు భారీ పెట్టుబడులు సమకూరుస్తామని వారు అనీష్ రెడ్డిని నమ్మించారు.పెట్టుబడిదారులను పరిచయం చేసేందుకు కమీషన్ దారిలో... గత ఏడాది ఆగస్టులో మొహసిన్ ఖాన్‌కు రూ. 25 లక్షలు, అలాగే తబ్రెజ్‌కు మూడు విడతల్లో మరో రూ. 25 లక్షలు కలిపి మొత్తం రూ. 50 లక్షలను అనీష్ రెడ్డి చెల్లించాడు.

### మోసం బయటపడటంతో దాడి, బెదిరింపులు!

డబ్బులు తీసుకుని నెలలు గడుస్తున్నా పెట్టుబడిదారులను పరిచయం చేయకపోవడంతో, మోసపోయానని గ్రహించిన దర్శకుడు తన డబ్బును

2లో..

## ఆంధ్రప్రదేశ్ నుంచి "వికసిత్ భారత్ జీ-రామ్ జీ

- గ్రామీణ్" జాతీయ కార్యక్రమాన్ని ప్రారంభించిన కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్
- పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్



**తిరుపతి, భారత శక్తి ప్రతినిధి, జూలై 2:** ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి జిల్లా ముక్కావారిపల్లి గ్రామం నుంచి "వికసిత్ భారత్-- జీ రామ్ జీ యోజన" ఈ రోజు జాతీయ స్థాయిలో ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, కేంద్ర సహాయ మంత్రులు డాక్టర్ చంద్రశేఖర్ పెమ్మసాని, కమలేష్ పాశ్వాన్, ఎంపీలు, ఎమ్మెల్యేలు మరియు వేలాది సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా ఉన్న పేద కూలీలు, రైతులు, గ్రామాలకు ఉపాధి హామీ, గ్రామీణాభివృద్ధి కోసం భారీ ఆర్థిక కేటాయింపులు, పారదర్శకమైన వ్యవస్థతో కూడిన ఒక కొత్త నమూనాను ఆవిష్కరించారు.

### శ్రీ వెంకటేశ్వర స్వామి పాదాలకు నమస్కరిస్తూ ప్రారంభమైన వీబీ- జీ రామ్ జీ


కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ "నమః వెంకటేశాయః", "గోవిందా, గోవిందా" నినాదాలతో ప్రారంభిస్తూ ఈ పవిత్ర భూమి నుంచి వికసిత్ భారత్ జీ-రామ్ జీ పథకాన్ని అమలు కావడం పేదలు, కార్మికులపై భగవంతుడి ఆశీస్సుల అందినట్లే అన్నారు. దేశంలో ఏ పేద కూలీ కూడా పనిలేకుండా ఉండకూడదని, ప్రతి చేతికి పని, ప్రతి వ్యక్తికి ఆహారం లభించాలని ఆయన ప్రార్థించారు. ఈ సంకల్పాన్ని క్షేత్రస్థాయిలో సాకారం చేస్తున్నందుకు ప్రధాని నరేంద్ర మోదీకి చౌహాన్ ధన్యవాదాలు తెలిపారు.

### ఎంజీ-నరేగా కు మించి వీబీ జీ-రామ్ జీ.. ఉపాధి 100 రోజుల నుంచి 125 రోజులకు పెంపు

యూపీఏ ప్రభుత్వ హయాంలో

2లో..

## చర్చకు పిలిచి మొహం చాటేశారు: మంత్రి జూపల్లిపై హరీశ్ రావు ఫైర్



**హైదరాబాద్, జూన్ 2 భారతశక్తి:** తెలంగాణలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీల మధ్య రాజకీయ పోరు తీవ్రరూపం దాల్చింది. గురుకుల పాఠశాలల టెండర్లు, రాష్ట్ర అప్పులపై బహిరంగ చర్చకు రావాలంటూ సవాల్ విసిరిన మంత్రి జూపల్లి కృష్ణారావు, తీరా సమయం వచ్చేసరికి వెనకడుగు వేశారని మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. ముందుగా నిర్ణయించిన ప్రకారం చర్చ కోసం తాము తెలంగాణ భవన్‌కు చేరుకున్నా, మంత్రి రాకపోవడంపై ఆయన మండిపడ్డారు.గురువారం హరీశ్ రావు, ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ సహా పలువురు బీఆర్ఎస్ నేతలు తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. అదే సమయంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్ గన్ పార్క్ వద్ద ఉన్నారన్న సమాచారంతో వారు అక్కడికి వెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే, పోలీసులు వారిని అడ్డుకుని అరెస్టు చేశారు. ఈ క్రమంలో పోలీసులకు, బీఆర్ఎస్ శ్రేణులకు మధ్య స్వల్ప తోపులాట, వాగ్వాదం చోటుచేసుకుంది."చర్చకు రమ్మని సవాల్ విసిరింది వాళ్లే, తీరా మేము వస్తే పోలీసులను ప్రయోగించి అడ్డుకోవడం చూస్తుంటే, టెండర్లలో జరిగిన అవినీతి బయటపడుతుందనే భయంతోనే వారు పారిపోయారని స్పష్టమవుతోంది" అని

2లో..

## తెలంగాణ నూతన సీఎస్‌గా సంజయ్ జాజు



- ఉప ముఖ్యమంత్రితో మర్యాదపూర్వక భేటీ
- సచివాలయంలో పరిపాలనాంశాలపై ప్రాథమిక చర్చ

**హైదరాబాద్, జూన్ 2 భారతశక్తి:** తెలంగాణ రాష్ట్ర నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా (చీఫ్ సెక్రటరీ) బాధ్యతలు స్వీకరించిన సంజయ్ జాజు అధికారిక కార్యకలాపాలను వేగవంతం చేశారు. ఇందులో భాగంగా సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో ఆయన సమావేశమయ్యారు. నూతన బాధ్యతలు చేపట్టిన అనంతరం డిప్యూటీ సీఎంను కలవడం ఇదే మొదటిసారి.

2లో..

## గురుకులాలపై అసత్య ప్రచారాలు నమ్మొద్దు: మంత్రి పొన్నం

- 'గన్‌పార్క్' వద్దకు చేరిన చర్చా వేదిక.. విపక్ష నేతలకు మంత్రి డెడ్‌లైన్
- టెండర్లలో అవినీతి జరిగిందన్న ఆరోపణలను నిరూపించాలి.
- కేసీఆర్ అసెంబ్లీకి రావాలి.. దేనికైనా సిద్ధమన్న కాంగ్రెస్ నేతలు
- ప్రతిపక్ష నేతలకు సవాల్ విసిరిన మంత్రి పొన్నం ప్రభాకర్..!



**హైదరాబాద్, జూన్ 2 భారత శక్తి :** తెలంగాణలోని ప్రభుత్వ గురుకుల విద్యా సంస్థలపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. గురుకులాల టెండర్లలో అవినీతి జరిగిందంటూ బీఆర్ఎస్, బీఎస్పీ నేతలు చేస్తున్న విమర్శలను ప్రభుత్వం తిప్పికొట్టింది. ఈ అంశంపై బహిరంగ చర్చకు తాము సిద్ధమంటూ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రతిపక్షాలకు సవాల్ విసిరారు.ఈ చర్చా వేదిక కోసం మంత్రులు అడ్లూరి

3లో..

## అయోధ్యపై నబీన్ మాట్లాడరేం

**పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్**



**హైదరాబాద్** అయోధ్య రామ మందిరంలో హుండీ కానుకల దోపిడీ గురించి ఆయన ఎందుకు మాట్లాడలేదుబీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ రాష్ట్ర పర్యటన అట్టర్ ఫ్లాప్ అయిందని టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ ఎద్దేవా చేశారు. అయోధ్య రామ మందిరంలో హుండీ కానుకల దోపిడీ గురించి ఆయన ఎందుకు మాట్లాడలేదు, కాళేశ్వరం అక్రమాలపై

2లో..

# సంపాదకీయం

భారత శక్తి

## అటు మణిపూర్.. ఇటు బెంగాల్

మణిపూర్ సమస్య గత మూడేళ్లుగా జాతీయ చర్చల్లో ముందు వరుసలో ఉంది. మీడియా దానిని విస్తృతంగా కవర్ చేసి, కేంద్ర ప్రభుత్వం మరియు ముఖ్యమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని ప్రభుత్వాన్ని దోషిగా చూపించేందుకు అనేక కోణాల నుంచి ప్రచారం చేసింది. అయితే ఇప్పుడు ఆ ప్రస్తావన దాదాపు మాయమైంది. ఇది యాదృచ్ఛికం కాదు. భద్రతా దళాలు నిరంతరంగా ఉగ్రవాద ఏరివేత కార్యకలాపాలు నిర్వహిస్తుంటే, మీడియా ఆ సాధనలను నిశ్శబ్దంగా వదిలేసింది. ఇది మీడియా కవరేజ్‌లో ఉన్న ఎంపికాత్మక విధానాన్ని స్పష్టం చేస్తుంది.మొదట్లో మణిపూర్‌లో జరిగిన హింసాత్మక సంఘటనలు, జాతి ఉద్రిక్తతలు, స్థానభ్రంశం చెందిన కుటుంబాల కథనాలు రోజూ మీడియాలో నిండి ఉండేవి. కేంద్ర ప్రభుత్వం త్వరగా చర్యలు తీసుకోలేదని, శాంతి ప్రక్రియ విఫలమైందని విమర్శలు వెల్లువెత్తాయి. ఇది రాజకీయ వ్యూహంగా మారి, ప్రభుత్వాన్ని దోషిగా చూపించేందుకు ఉపయోగపడింది. ఇప్పుడు పరిస్థితి మారింది. భద్రతా దళాలు సమర్థవంతంగా పని చేస్తున్నప్పటికీ, ఆ వార్తలు ప్రధాన మీడియాలో కనిపించడం లేదు. ఇది "వార్తలు ఎప్పుడు ముఖ్యం అవుతాయి?" అనే ప్రశ్నను లేవనెత్తుతుంది. హింస తగ్గినప్పుడు లేదా ప్రభుత్వం సానుకూల చర్యలు తీసుకున్నప్పుడు కవరేజ్ తగ్గడం సాధారణం కాదు. ఇది మీడియా యొక్క ఎంపికాత్మక విధానాన్ని, రాజకీయ వ్యూహాలను ప్రతిబింబిస్తుంది.మణిపూర్‌లో ఉగ్రవాద ఏరివేత పూర్తి స్థాయిలో కొనసాగుతోంది. ఇటీవల మణిపూర్ పోలీస్, కేంద్ర సాయుధ బలగాలు (సీఆర్పీఎఫ్, కోబ్రా, ఆర్‌ఏఎఫ్, అస్సాం రైఫిల్స్) కలిసి ఇంఫాల్ ఈస్ట్, ఇంఫాల్ వెస్ట్, కాక్‌చింగ్, బిష్ణుపూర్ తదితర ప్రాంతాల్లో ఉగ్రవాదుల హైడౌట్లపై దాడులు, శోధన కార్యకలాపాలు నిర్వహించాయి. ఈ ఆపరేషన్లలో 86 ఆయుధాలు, భారీ మొత్తంలో పేలుడు పదార్థాలు, యుద్ధ సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. ఇది ఉగ్రవాదుల సామర్థ్యాన్ని గణనీయంగా దెబ్బతీసే చర్య. ఇటువంటి ఆపరేషన్లు కేవలం ఒక్కసారి కాక, నిరంతరంగా జరుగుతున్నాయి. ఇవి రాష్ట్రంలో శాంతి, భద్రతను పునరుద్ధరించేందుకు కీలకం. ఇంతటి సాధనలు ఉన్నప్పటికీ మీడియా దృష్టి మరలలేదు.ఉగ్రవాదులు ఇంకా మణిపూర్ వాసులను భయపెట్టడం, అశాంతి సృష్టించడం కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా కుకీ సముదాయం మీద దాడులు, బెదిరింపులు నివేదించబడుతున్నాయి. ఇది రాష్ట్రంలోని సాధారణ ప్రజల జీవితాలను ప్రభావితం చేస్తోంది. ఉగ్రవాదులు ఆయుధాలు, పేలుడు పదార్థాలు దాచి ఉంచడం, దాడులు చేయడం ద్వారా శాంతి ప్రక్రియకు అడ్డంకి కలిగిస్తున్నారు. భద్రతా దళాలు ఈ ముప్పును తట్టుకోవడానికి, ఉగ్రవాదులను నిర్మూలించడానికి నిరంతరం కృషి చేస్తున్నాయి. కానీ ఇది ఒక్కటే సరిపోదు. రాజకీయ సంవాదం, సమన్వయం కూడా అవసరం.మణిపూర్ సమస్య మూలాలు జాతి ఉద్రిక్తతలు, భూమి, ఎస్టీ హోదా వంటి సమస్యలలో ఉన్నాయి. రెండు వర్గాల మధ్య హింస జరిగింది. దీనిలో ఉగ్రవాద సంస్థలు రెండు వైపుల నుంచి కూడా పాల్గొన్నాయి. కేంద్ర ప్రభుత్వం భద్రతా బలగాలను మోహరించి, ఆపరేషన్లు నిర్వహించడం ద్వారా పరిస్థితిని నియంత్రించేందుకు ప్రయత్నిస్తోంది. ఇటీవలి ఆయుధ స్వాధీనాలు ఈ ప్రయత్నాల సాఫల్యాన్ని చూపుతున్నాయి. మరోవైపు, మీడియా ప్రారంభంలో హింసను, ప్రభుత్వ వైఫల్యాలను హైలైట్ చేసింది. ఇప్పుడు భద్రతా దళాల సాధనలు, ఉగ్రవాదులపై ఏరివేతలు జరుగుతున్నప్పటికీ నిశ్శబ్దం పాటిస్తోంది. నిజమైన శాంతి కోసం భద్రతా చర్యలతో పాటు రాజకీయ పరిష్కారం, ఇరు వర్గాల మధ్య విశ్వాసం పెంపు అవసరం. మణిపూర్‌లో శాంతి సాధించడం సులభం కాదు. కానీ భద్రతా దళాలు నిరంతరం కృషి చేస్తున్నాయి. మరో వైపు శ్చిమ బెంగాల్‌లో మే నెలలో బాధ్యతలు స్వీకరించిన సువేందు అధికారి రెండు నెలల్లోనే సరిహద్దు భద్రత, చొరబాటుదారుల సమస్యపై దృష్టి సారించారు. రాష్ట్రంలో దీర్ఘకాలంగా కొనసాగుతున్న ఒక సంక్లిష్ట సమస్య పరిష్కారానికి కఠిన నిర్ణయాలు తీసుకున్నారు. బంగ్లాదేశ్ నుంచి వచ్చే అక్రమ వలసలను అరికట్టడం, ఇప్పటికే ఉన్నవారిని గుర్తించి తరలించడం ఈ చర్యల్లో ముఖ్యాంశాలు.బంగ్లాదేశ్ సరిహద్దులో బీఎస్ఎఫ్ బలగాలు బలోపేతం చేయడం, 50 కిలోమీటర్ల పరిధిలో వారికి మరిన్ని అధికారాలు ఇవ్వడం, అవసరమైతే కాల్పులకు అనుమతి ఇవ్వడం వంటి నిర్ణయాలు తీసుకున్నారు. దీంతో బంగ్లాదేశ్ బార్డర్ గార్డ్స్ నుంచి వచ్చే ప్రయత్నాలను బీఎస్ఎఫ్ సమర్థవంతంగా అడ్డుకుంటోంది. ప్రభుత్వ వాదన ప్రకారం చొరబాట్లు గణనీయంగా తగ్గాయి. అదనంగా బీఎస్ఎఫ్‌కు 142 ఎకరాల భూమి కేటాయించడం, ఫెన్సింగ్ పనులు ప్రారంభించడం వంటి అంశాలు సరిహద్దు భద్రతను మరింత బలోపేతం చేస్తున్నాయి.

త్రిపురలో ఇప్పటికే ఫెన్సింగ్ జరుగుతుండగా, బెంగాల్‌లో కూడా ఇలాంటి చర్యలు వేగవంతం అవుతున్నాయి. తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం ఓటు బ్యాంకు రాజకీయాల కారణంగా ఈ సమస్యపై సడలింపు చూపిందని, అధికారులు కూడా నిర్లక్ష్యం చేశారని విమర్శలు ఉన్నాయి. ఇప్పుడు ఈ విధానం మారింది. సంక్షేమ పథకాలు నిజమైన పౌరులకు మాత్రమే అందేలా చూస్తున్నారు. నకిలీ పత్రాలు సృష్టించే నెట్‌వర్క్‌లను ఛేదించడం, ఉగ్రవాద సంబంధాలను గుర్తించడం వంటి చర్యలు కూడా భాగం.

ఈ చర్యలు సరిహద్దు రాష్ట్రాలలో భద్రతను మెరుగుపరచడానికి, వనరులను స్థానికులకు మళ్లించడానికి ఉద్దేశించినవి. అస్సాం, త్రిపురలో ఇప్పటికే ఇలాంటి ఏరివేతలు జరుగుతున్న నేపథ్యంలో బెంగాల్‌లో కూడా వేగం పుంజుకుంది. బంగ్లాదేశ్ వైపు నుంచి హెచ్చరికలు కూడా ఉన్నాయి.మొత్తంమీద, భద్రతా దృక్పథం నుంచి ఇది సానుకూల మార్పుగా కనిపిస్తోంది. అయితే విజయం సాధించాలంటే న్యాయబద్ధమైన ధృవీకరణ, దౌత్య సంబంధాలు, స్థానికుల మద్దతు అవసరం. ఇలాంటి విధానాలు ఇతర సరిహద్దు రాష్ట్రాలకు కూడా ఆదర్శంగా మారవచ్చు, కానీ అమలులో సమతుల్యత ముఖ్యం.

# గురుకులాలపై అసత్య ప్రచారాలు నమ్మొద్దు: మంత్రి పొన్నం



లక్ష్మణ్ కుమార్, మహమ్మద్ అజారుద్దీన్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఖైరతాబాద్ శాసనసభ్యుడు దానం నాగేందర్, సోమాజిగూడ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు నార్కెల నరేష్ తదితర ముఖ్య నేతలతో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ గన్‌పార్క్ వద్దకు చేరుకున్నారు.

### ఆధారాలు ఉంటే ప్రెస్ క్లబ్‌కు రండి..

ఈ సందర్భంగా గన్‌పార్క్ అమరవీరుల స్తూపం సాక్షిగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్, మాజీ మంత్రులు తన్నీరు హరీష్ రావు, కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) గురుకులాల నిర్వహణ, భోజన టెండర్లపై నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. "ఆరోపణలు చేసే నాయకులకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే, వాటిని ఆధారాలతో సహా నిరూపించాలి. మేము దేనికైనా సిద్ధంగా ఉన్నాం. గన్‌పార్క్ వద్దకు వచ్చాం.. ఒకవేళ మాజీ మంత్రులు ఆధారాలతో వస్తే సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌కు (పాత్రికేయ భవనానికి) సైతం వచ్చి చర్చించడానికి సిద్ధంగా ఉన్నాం."

### రూ. 1,143 కోట్ల టెండర్లపై అడ్డగోలు విమర్శలా?

మొత్తం టెండర్ల విలువ రూ. 1,143 కోట్లు మాత్రమేనని, అయితే ప్రతిపక్షాలు అవగాహన లేకుండా ఒకసారి రూ. 2 వేల కోట్లు, మరోసారి రూ. 3 వేల కోట్లు అంటూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని మంత్రి స్పష్టం చేశారు. ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ గతంలో కరీంనగర్ జిల్లా ఎస్పీ (పోలీస్ సూపరింటెండెంట్)గా పనిచేసిన కాలంలోనే, తాము విద్యార్థి నాయకులుగా ఉంటూ ప్రజా సమస్యలపై పోరాడామని, తమ నిజాయితీ ఏంటో ఆయనకు బాగా తెలుసని గుర్తు చేశారు.

### వెనక్కి తగ్గే ప్రసక్తే లేదు

రాజకీయ ప్రయోజనాల కోసం ఎవరు పడితే వారు నోటికొచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదని మంత్రి హెచ్చరించారు. గతంలో ప్రభుత్వం తప్పు చేసినప్పుడు, స్వంత అధికార పార్టీపైనే ఎదురుతిరిగి పోరాడిన చరిత్ర తమకుందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. కాబట్టి గురుకులాల అంశంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదన్నారు.

### కేసీఆర్ అసెంబ్లీకి రావాలి

గురుకులాల వ్యవహారంతో పాటు రాష్ట్రంలోని అన్ని ప్రజా సమస్యలపై చర్చించడానికి బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు (కేసీఆర్) శాసనసభ (అసెంబ్లీ)కు రావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. సభలోనే అన్ని విషయాలపై పారదర్శకంగా చర్చించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.

# కాటారం మండలంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ విస్తృత పర్యటన.

**- అంగన్వాడి కేంద్రాలు, పాఠశాలలు, పీఏసీఎస్ కేంద్రం, ఆర్డీఓ కార్యాలయాల తనిఖీ.**

**- గర్భిణులు, చిన్నారుల పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ మవహించాలి: జిల్లా కలెక్టర్**

భూపాలపల్లి ప్రతినిధి, జూలై 2 (భారత శక్తి) జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలో విస్తృతంగా పర్యటించి పలు ప్రభుత్వ కార్యాలయాలను, విద్యా సంస్థలను తనిఖీ చేశారు. ప్రజలకు అందుతున్న సేవల నాణ్యత, సంక్షేమ పథకాల అమలు, రైతులకు అందుతున్న సేవలు, రెవెన్యూ వ్యవహారాలపై క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి సంబంధిత అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు.

### అంగన్వాడి కేంద్రంలో బాలామృతం పంపిణీ.

ముందుగా కాటారం మండలం అంకుశాపూర్ గ్రామంలోని అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ చిన్నారులతో ఆప్యాయంగా మాట్లాడి వారి ఆరోగ్యం, పోషణ, విద్యా పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. బాలింతలకు, చిన్నారులకు బాలామృతం, కోడిగుడ్లను పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారం సక్రమంగా అందేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు.

### - పాఠశాలలో మధ్యాహ్న భోజనం తనిఖీ

అనంతరం స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను పరిశీలించిన కలెక్టర్, మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు ప్రతిరోజూ నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందించాలని స్పష్టం చేశారు. విద్యార్థుల్లో వ్యక్తిగత పరిశుభ్రత అలవాట్లు పెంపొందించేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, పాఠశాల ఆవరణలో గడ్డి, పిచ్చి మొక్కలు లేకుండా పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు సూచించారు.

### పీఏసీఎస్ కేంద్రంలో రైతులతో ముఖాముఖి:

తదుపరి కాటారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్, యూరియా బుకింగ్ వివరాలు, ఎరువుల నిల్వలు, స్టాక్ నిర్వహణపై వ్యవసాయ శాఖ అధికారులు, పీఏసీఎస్ సీఈఓను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులతో నేరుగా మాట్లాడి యూరియా బుకింగ్ ప్రక్రియ సక్రమంగా సాగుతోందా, ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయా అని ఆరా తీశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రైతు వేదికల ద్వారా యూరియా పంపిణీకి అవసరమైన ఏర్పాట్లు చేయాలని, నానో యూరియా వినియోగంపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు.అనంతరం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో సమావేశమైన



కలెక్టర్ కాటారం సబ్ డివిజన్ పరిధిలోని బల్క్ ల్యాండ్ సమస్యలు, సాదా బైనామా, భూ భారతి దరఖాస్తుల పరిష్కారం, చిన్న కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ అంశాలపై సమీక్ష నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను వేగంగా పరిష్కరించి ప్రజలకు పారదర్శకమైన సేవలు అందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ పర్యటనలో స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఆర్డీఓ రవీందర్, వ్యవసాయ అధికారి బాబురావు, మహిళా, శిశు సంక్షేమ అధికారి మల్లేశ్వరి, సీడీపీఓ రాధిక, తహసీల్దార్ నాగరాజ్, ఎంపీడీవో బాబు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన వైద్య సేవలు అందించాలి.

**-విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు**

**-ప్రభుత్వ హస్పటల్ ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ అంకిత్**



భద్రాద్రి జిల్లా బ్యూరో, జూలై 02 (భారతశక్తి): కొత్తగూడెం ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ జిల్లా కలెక్టర్ అంకిత్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని డాక్టర్లు, ఇతర సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించి వారి హాజరు, విధుల నిర్వహణపై ఆరా తీశారు. ఆసుపత్రి సిబ్బంది ఎన్ని షిఫ్టుల్లో విధులు నిర్వహిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రిలోని వివిధ వార్డులను పరిశీలించిన కలెక్టర్, ప్రసూతి వార్డులో చికిత్స పొందుతున్న మహిళల సంఖ్య, వారికి అందుతున్న వైద్య సేవలపై వివరాలు తెలుసుకున్నారు. మూడు షిఫ్టుల్లో రోగులకు సేవలు అందిస్తున్నట్లు వైద్యులు వివరించారు. జనరల్ వార్డులో చికిత్స పొందుతున్న రోగులతో నేరుగా మాట్లాడి వైద్య సేవల నాణ్యత, మందుల లభ్యత, వైద్యులు, సిబ్బంది స్పందనపై ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన, సకాలంలో వైద్య సేవలు అందేలా వైద్యులు, సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని సూచించారు. రోగులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించే అధికారులు, ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట హాస్పటల్ సూపరింటెండెంట్ ఎం రాధా మోహన్, డివైసిఎస్‌ఆర్ఎంఓ సీతారాం, ఆర్ ఎం ఓ చైతన్య, కొత్తగూడెం తహశీల్దార్ పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# నర్సన్న 28 రోజుల ఆదాయం 2.78 కోట్లు

**- బంగారం, వెండితో పాటు విదేశీ కరెన్సీ**

**సమకూరినట్లు వెల్లడించిన ఆలయ అధికారులు**





భారత శక్తి, జూలై 02 (యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి): యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి దేవస్థానానికి 28 రోజుల హుండీ ఆదాయం 2,78,13,079/- (రెండు కోట్ల డెబ్బైఎనిమిది లక్షల పదమూడు వేల డెబ్బై తొమ్మిది రూపాయలు) సమకూరినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. కొండ కింద సత్యనారాయణ వ్రత మండపంలో గురువారం ఉదయం నిర్వహించిన హుండీ లెక్కింపులో ఆలయ అధికారులు, సిబ్బంది, భద్రతా సిబ్బంది పాల్గొన్నారు. నగదుతో పాటు 708 గ్రాముల మిశ్రమ బంగారం, మూడు కిలోల నూట యాభై గ్రాముల మిశ్రమ వెండి మరియు 17 దేశాలకు సంబంధించిన కరెన్సీ వచ్చినట్లు తెలిపారు.

# బాసర ఆలయ దొంగతనం కేసును ఛేదించిన నిర్మల్ పోలీసులు వెండి కిరీటం స్వాధీనం

**వేగవంతమైన దర్యాప్తుతో 10 రోజుల్లోనే**

**కేసు ఛేదించిన నిర్మల్ జిల్లా పోలీసులు**




నిర్మల్ జిల్లా ప్రతినిధి, జులై 02 (భారత శక్తి )బాసర ఆలయంలో జరిగిన దొంగతనం కేసును నిర్మల్ జిల్లా పోలీసులు అత్యంత వేగంగా ఛేదించారు.ఇద్దరు అంతర్‌జిల్లా దొంగలు, దొంగిలించిన సొత్తును స్వీకరించిన మరో వ్యక్తి అరెస్ట్ -- సుమారు 1.48 కిలోల వెండి స్వాధీనం చేసుకున్నారు నేరం జరిగిన వెంటనే ఆరు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నాందేడ్, ధర్మాబాద్, నిజామాబాద్, కామారెడ్డి, ఆదిలాబాద్ తదితర ప్రాంతాల్లో విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. బాసర పోలీస్ స్టేషన్, సీసీఎస్ సిబ్బంది సమన్వయంతో సాంకేతిక ఆధారాలు, విశ్వసనీయ సమాచారం ఆధారంగా చాకచక్యంగా దర్యాప్తు నిర్వహించి, బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని అమ్మవారి వెండి కిరీటం, హుండీని దొంగిలించిన ఇద్దరు అంతర్‌జిల్లా దొంగలను, దొంగిలించిన సొత్తును స్వీకరించిన మరో వ్యక్తిని అరెస్ట్ చేశారు.

### కేసు వివరాలు

గత నెల జూన్ 22వ తేదీన గుంటూరు జిల్లాకు చెందిన పల్లపు ఏడుకొండలు, నిజామాబాద్ జిల్లాకు చెందిన గైని కిరణ్ అలియాస్ రామకృష్ణ గోడదూకి ఆలయంలోకి చొరబడి గేటు తాళాలు పగులగొట్టి అమ్మవారి వెండి కిరీటం, హుండీని దొంగలించరు.

అనంతరం హుండీలోని సుమారు రూ.16,000 నగదును తీసుకొని, వెండి కిరీటాన్ని రెండు భాగాలుగా విడదీసి అమ్మవారి ఆలయశీ వెనకాల వ్యాస గుహ దగ్గర ఉన్న గుట్టల పైనుండి పరారయ్యారు.మామూలు భక్తుల లాగా రైల్వేస్టేషన్ను చేరుకుని అక్కడ నుండి వెళ్లిపోయారు. దొంగిలించిన వెండి కిరీటాన్ని విక్రయించేందుకు నిజామాబాద్‌కు చెందిన కోడామ ఆనంద్ సహకారంతో మహారాష్ట్రలోని నాందేడ్‌కు తీసుకెళ్తుండగా, విశ్వసనీయ సమాచారం మేరకు 02-07-2026న కాచిగూడ--నాగర్సోల్ రైలులో ప్రయాణిస్తున్న ముగ్గురిని బాసర రైల్వే స్టేషన్ వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

వీరు ఎక్కువగా రైల్వే సౌకర్యంగల ప్రాంతాల్లోని ఆలయాలు గుర్తించి దొంగతనాలుచేస్తున్నారు.

### స్వాధీనం చేసుకున్న సొత్తు

- 1 కిలో 220 గ్రాముల వెండి కిరీటం
- 260 గ్రాముల వెండి పట్టీ
- ఒక స్మార్ట్ మొబైల్ ఫోన్

### నిందితులు

పల్లపు ఏడుకొండలు – గుంటూరు జిల్లా (సుమారు 25 దొంగతనం కేసుల్లో నిందితుడు)

గైని కిరణ్ అలియాస్ రామకృష్ణ – నిజామాబాద్ జిల్లా (సుమారు 20 దొంగతనం కేసుల్లో నిందితుడు)

కోడామ ఆనంద్ – సోలాపూర్, మహారాష్ట్ర (దొంగిలించిన సొత్తును స్వీకరించి దాచిపెట్టినందుకు అరెస్ట్)

### పోలీస్ అధికారులకు అభినందనలు

ఈ కేసును అత్యంత వేగంగా ఛేదించి నిందితులను అరెస్ట్ చేసిన ముధోల్ సీఐ రవీందర్ నాయక్, బాసర పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఎస్. దీపక్, నిర్మల్ టౌన్ ఇన్స్పెక్టర్ సమ్మయ్య, హెడ్ కానిస్టేబుల్ ఖాలీద్, పోలీస్ కానిస్టేబుళ్లు భీమేష్, మోహన్, నరేందర్, సీసీఎస్ హెడ్ కానిస్టేబుల్ జగన్ సింగ్, పోలీస్ కానిస్టేబుల్ తిరుపతి, హోంగార్డ్ సతీష్‌లను జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ప్రత్యేకంగా అభినందించి రివార్డులు ప్రకటించారు.

# నిబంధనలు ఉల్లంఘిస్తే స్కూల్ బస్సుల సీజ్!


**- నిత్యం తనిఖీలు ఉంటాయి**

**- మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ వంశీధర్ హెచ్చరిక.**




భారత శక్తి న్యూస్,రాజన్న సిరిసిల్ల, జూలై 2: పాఠశాలలు, కళాశాలల బస్సులు రవాణా శాఖ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఎంవీఐ వంశీధర్ హెచ్చరించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్ ఆదేశాల మేరకు గురువారం వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లి వద్ద వివిధ విద్యాసంస్థల బస్సులను ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న రెండు ఫిట్‌నెస్ లేని వాహనాలపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భద్రతే పరమావధిగా స్కూల్ బస్సులపై నిత్యం తనిఖీలు నిర్వహిస్తామన్నారు. బడి బస్సుల్లో ఫైర్ సేఫ్టీ పరికరాలు, మెడికల్ కిట్, తాగునీటి సదుపాయం, ఎమర్జెన్సీ డోర్ కచ్చితంగా ఉండాలని స్పష్టం చేశారు. డ్రైవర్‌తో పాటు తప్పనిసరిగా అటెండర్ ఉండాలన్నారు. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమైనందున బస్సుల కండిషన్ విషయంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విండ్‌షీల్డ్ వైపర్లు, రివర్స్ హారన్, లైట్లు ఎల్లవేళలా పనిచేసేలా చూసుకోవాలని, కండిషన్ సరిగా లేని వాహనాలను నడిపితే సీజ్ చేస్తామని యాజమాన్యాలను హెచ్చరించారు. విద్యార్థుల ప్రాణాలతో విద్యాసంస్థలు ఆటలాడొద్దని, అన్ని పత్రాలు, భద్రతా ప్రమాణాలు సక్రమంగా ఉంచుకోవాలని ఎంవీఐ వంశీధర్ పేర్కొన్నారు.

# పేద అమ్మాయికి అండగా నిలిచిన ఎమ్మెల్యే



మంచిర్యాల ప్రతినిధి, జూలై 2 (భారత శక్తి): మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నస్పూర్ పట్టణానికి చెందిన లగిశెట్టి స్పందన అమెరికాలో ప్రమాదానికి గురైన నేపథ్యంలో, మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు మానవతా దృక్పథంతో స్పందించి ఆ కుటుంబానికి అండగా నిలిచారు. ఈ విషాదకర సంఘటన నస్పూర్ పట్టణానికి చెందిన లగిశెట్టి శ్రీనివాస్ కుమార్తె లగిశెట్టి స్పందన ఉన్నత చదువుల (మీా) కోసం అమెరికాలోని చికాగో నగరానికి వెళ్లారు. అక్కడ చదువుకుంటున్న క్రమంలో, ఇటీవల ఒక మెట్రో స్టేషన్‌లో స్పందన ప్రమాదవశాత్తు కిందపడిపోయారు. ఈ ప్రమాదంలో ఆమె తలకు, శరీరానికి తీవ్ర గాయాలు కావడంతో కోమాలోకి



వెళ్లడంతో ప్రస్తుతం ఆమె అక్కడి ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో అత్యవసర విభాగంలో చికిత్స పొందుతున్నారు.కూతురి పరిస్థితి తెలిసి దిక్కుతోచని స్థితిలో ఉన్న స్పందన తల్లిదండ్రులు తమ బాధను మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు కు వివరించారు. తమ బిడ్డను చూసుకోవడానికి అమెరికా వెళ్లేందుకు సహాయం చేయాలని వేడుకోగా ఎమ్మెల్యే వెంటనే సానుకూలంగా స్పందించి సీఎంఓ అధికారులతో మాట్లాడి పాస్ పోర్ట్, వీసా మంజూరు చేయించి, టికెట్, ఇతర ఖర్చులకు మూడు లక్షల రూపాయలు (3,00,000) స్పందన తల్లిదండ్రులకు అందజేశారు.ఆ భగవంతుడి ఆశీస్సులతో స్పందన అతి త్వరగా కోలుకోవాలని కోరారు.

# పుస్తక జ్ఞానానికి సామాజిక కోణాన్ని జోడించాలి

**- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**

**- సోన్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఆకస్మిక తనిఖీ**

**- విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించిన కలెక్టర్**



నిర్మల్ జిల్లా ప్రతినిధి, జులై 02 (భారత శక్తి ) కేవలం పుస్తకాల్లోని పాఠాలను నేర్చుకోవడం మాత్రమే కాకుండా, వాటిని సమాజంలో జరుగుతున్న పరిణామాలతో అనుసంధానం చేసుకుంటూ విద్యను అభ్యసించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా విద్యార్థులకు సూచించారు. గురువారం సోన్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యా బోధన, వసతి, ఆహారం, పరిశుభ్రత వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు.ముందుగా పాఠశాలలోని తరగతి గదులను సందర్శించిన కలెక్టర్, విద్యార్థుల అభ్యాస స్థాయిని పరిశీలించారు. అనంతరం వంటశాల, సరుకుల నిల్వ గది, భోజనశాలను తనిఖీ చేసి అక్కడి పరిశుభ్రత, ఆహార నాణ్యతపై అధికారులకు పలు సూచనలు చేశారు. మెస్ కమిటీ సభ్యులు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ నాణ్యమైన కూరగాయలు, ఆహార పదార్థాలను మాత్రమే వినియోగించాలని, వంటశాలలో పరిశుభ్రతను ఎప్పటికప్పుడు పాటించాలని ఆదేశించారు. విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించడంతో పాటు, స్టాక్ రిజిస్టర్‌ను క్రమం తప్పకుండా నవీకరించాలని సూచించారు. అనంతరం పదో తరగతి గదికి వెళ్లిన కలెక్టర్ విద్యార్థులతో ఆత్మీయంగా ముచ్చటించారు. వారి జవాబు పత్రాలను పరిశీలించి, గణితం, భౌతిక శాస్త్రానికి సంబంధించిన ప్రశ్నలు అడిగి వారి అవగాహనను పరీక్షించారు. కొంతమంది విద్యార్థులను బోర్డుపై లెక్కలు చేయించి, సమస్యల పరిష్కార విధానాన్ని వివరింపజేశారు. శాస్త్రవేత్తల కృషి, విజ్ఞాన శాస్త్రం సమాజ అభివృద్ధిలో పోషిస్తున్న పాత్ర గురించి వివరించి, పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా సమకాలీన సామాజిక, శాస్త్రీయ, సాంకేతిక అంశాలపై కూడా అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు.విద్యార్థులు ప్రశ్నలు అడిగే అలవాటు పెంపొందించుకోవాలని, ప్రతిరోజూ వార్తాపత్రికలు చదవడం, పుస్తక పఠనం చేయడం ద్వారా విజ్ఞానాన్ని విస్తరించుకోవాలని కలెక్టర్ సూచించారు. సృజనాత్మకత, ఆలోచన, సమస్యల పరిష్కార నైపుణ్యాలను పెంపొందించుకుంటే ఉన్నత లక్ష్యాలను సులభంగా సాధించవచ్చని తెలిపారు.

పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న విద్య, వసతి, భోజన సదుపాయాలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ కొనసాగించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, ప్రత్యేక అధికారి సుధాకర్, తహసీల్దార్ సంతోష్, అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, పాల్గొన్నారు.

# దస్తూరాబాద్ పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల,

## ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలి - జిల్లా ఎస్పీ




నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూలై 02 (భారత శక్తి): వార్షిక తనిఖీల్లో భాగంగా నిర్మల్ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ డా. జి. జానకి షర్మిల,గురువారం దస్తూరాబాద్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి స్టేషన్ నిర్వహణ, శాంతిభద్రతలు, నేరాల దర్యాప్తు, రికార్డుల నిర్వహణ, పెండింగ్ కేసుల పురోగతి, కమ్యూనిటీ పోలీసింగ్ అమలు తీరు, పోలీసు సిబ్బంది పనితీరును సమగ్రంగా పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీకి పోలీస్ స్టేషన్ అధికారులు పూలమొక్క అందజేసి స్వాగతం పలికారు. అనంతరం పోలీసు సిబ్బంది సమర్పించిన గౌరవ వందనాన్ని స్వీకరించిన ఎస్పీ, స్టేషన్ ఆవరణ, మాల్ఖానా, ఆయుధాగారం, పోలీసు వాహనాలు, సీసీ కెమెరాల పనితీరు, స్టేషన్ రికార్డులు, సర్వీస్ రికార్డులు, బీట్ వ్యవస్థ, రౌడీషీట్లు, సస్పెక్ట్ షీట్లు, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతిని క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రజల విశ్వాసమే పోలీసు శాఖకు బలమైన పునాదని పేర్కొన్నారు. ప్రతి ఫిర్యాదుదారునితో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, వారి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని, పారదర్శకత, నిజాయితీ, జవాబుదారీతనంతో విధులు నిర్వహించి ప్రజల్లో పోలీసులపై నమ్మకాన్ని మరింత పెంపొందించాలని సూచించారు.స్టేషన్ పరిధిలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు తావు లేకుండా నిరంతరం నిఘా కొనసాగించాలని, గంజాయి, గుడుంబా, ఇతర మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. గ్రామాల్లో ప్రజలతో మమేకమై కమ్యూనిటీ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయాలని సూచించారు. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలు, బాల్య వివాహాలు, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ నాణ్యమైన దర్యాప్తు చేపట్టి న్యాయస్థానాల్లో శిక్షల శాతం పెరిగేలా పటిష్టమైన సాక్ష్యాధారాలు సేకరించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పోలీసు సిబ్బంది బాగోగులు, సంక్షేమం, విధి నిర్వహణలో ఎదురవుతున్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. పోలీసు సిబ్బంది ఆరోగ్యం, సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించాలని సూచించారు.

అలాగే గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణలో విలేజ్ పోలీస్ ఆఫీసర్ల (వ్పూలు) పాత్ర అత్యంత కీలకమని పేర్కొంటూ, గ్రామస్థాయిలో సమాచార వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని, గ్రామ ప్రజలతో నిరంతరం సమన్వయం కలిగి పనిచేస్తూ అనుమానాస్పద వ్యక్తులు, అసాంఘిక కార్యకలాపాలపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరించి పోలీసు అధికారులకు అందించాలని ఆదేశించారు. గ్రామస్థాయిలో పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేసి ప్రజల్లో భద్రతాభావాన్ని పెంపొందించేలా విధులు నిర్వహించాలని సూచించారు.

అలాగే పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ 5ఎ విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, పోలీసు సిబ్బంది క్రమశిక్షణ, సమయపాలన, సేవాభావంతో విధులు నిర్వహించి శాఖ ప్రతిష్ఠను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని పేర్కొన్నారు. డయల్-100కు వచ్చే ప్రతి కాల్‌పై తక్షణమే స్పందించి బాధితులకు సత్వర సేవలు అందించాలని, ప్రతి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

ఈ తనిఖీ కార్యక్రమంలో నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్, సంబంధిత సర్కిల్ ఇన్‌స్పెక్టర్, దస్తూరాబాద్ ఎస్సై మరియు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# అన్ని వృత్తుల్లో వైద్య వృత్తి అత్యంత గొప్పది

**- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్**




కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జులై 02: ప్రజల ప్రాణాలను కాపాడుతూ సమాజానికి అమూల్యమైన సేవలు అందిస్తున్న వైద్యుల సేవలు ఎనలేనివని, అన్ని వృత్తుల్లో వైద్య వృత్తి అత్యంత గొప్పదని బుధవారం జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని జిల్లా వైద్యాధికారులను సన్మానించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భారతదేశంలో ప్రతి సంవత్సరం జూలై 1న ప్రముఖ వైద్యుడు, స్వాతంత్ర్య సమరయోధుడు, జయంతి, వర్ధంతి సందర్భంగా జాతీయ వైద్యుల దినోత్సవాన్ని నిర్వహిస్తారని తెలిపారు. వైద్యులు తమ జ్ఞానం, నైపుణ్యం, సేవాభావంతో ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతూ సమాజానికి విశిష్ట సేవలు అందిస్తున్నారని కొనియాడారు.రోగుల పట్ల మానవత్వం, సహానుభూతితో వ్యవహరిస్తూ నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసి ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైద్యులు నిరంతరం కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వెంకటి, డిసీఎచ్ఎస్ఓ గోపాల్,, వైద్యాధికారులు , వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# మాజీ ఎంపీపీ తేజావత్ గోవర్ధన్ తండ్రి హేమ్లా నాయక్ మృతి

**అంతిమయాత్రలో చివరి వరకు నిలిచి ఆత్మీయత చాటిన ఎమ్మెల్యే**

**హేమ్లా నాయక్ పాడెను భుజాన మోసిన రాజేశ్వర్ రెడ్డి.**



జనగామ(భారత శక్తి)జులై 2: నర్మెట్ట మండలం మాజీ ఎంపీపీ తేజావత్ గోవర్ధన్ తండ్రి తేజావత్ హేమ్లా నాయక్ మృతి పట్ల జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజే శ్వర్ రెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. గురువారం హేమ్లా నా యక్ నివాసానికి ఎమ్మెల్యే చేరుకొని వారి భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులతో పాటు మాజీ ఎంపీపీ తేజావత్ గోవర్ధన్ ను పరామర్శించి ప్రగాఢ సాను భూతి తెలిపారు. అంతటితో తన బాధ్యత ముగిసిందని భావించకుండా అంతిమ యాత్ర లో చివరి వరకు కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే కలిసి నడిచారు. హేమ్లా నాయక్ పాడెను స్వయంగా భుజాన మోసి తన ఆత్మీయ తను చాటిచెప్పారు. పదవితో కాదు...బంధంతో ప్రజల మధ్య నిలిచే నాయకుడే నిజమైన ప్రజానేత అనే విషయాన్ని ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి మరోసారి తన ఆచరణతో నిరూపించారు. అనంతరం హేమ్లా నాయక్ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఎమ్మెల్యే ప్రార్థించారు.

# నాలుగేళ్ల చిన్నారిపై వీధి కుక్క దాడి..

## ముఖంపై తీవ్ర గాయాలు.




రాజన్న సిరిసిల్ల, జూలై 2(భారత శక్తి ): ఎల్లారెడ్డిపేట మండలం గుండారం బొంగులకింద గ్రామంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బానోతు మనోజ్ (4) ఇంటి ముందు ఆడుకుంటుండగా స్వైర విహారం చేస్తున్న ఓ వీధి కుక్క ఒక్కసారిగా దాడి చేసింది.

ఈ దాడిలో చిన్నారి ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి. ఘటనను గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే చిన్నారిని 108 అంబులెన్స్‌లో సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.గ్రామంలో వీధి కుక్కల బెడద రోజురోజుకు పెరుగుతోందని, చిన్నారులు మరియు ప్రజల భద్రత కోసం సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# హాజీపూర్ తండాలో నర్సరీ, కంపోస్ట్ షెడ్‌ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**ఆయిల్ పామ్ సాగుతో రైతుల ఆదాయం పెంచాలి**

**- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్**



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జులై 02: ఎల్లారెడ్డి మండలం హాజీపూర్ తండా గ్రామ పంచాయతీని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ గురువారం సందర్శించారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నర్సరీని, కంపోస్ట్ షెడ్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్, గ్రామస్థులతో కలెక్టర్ మాట్లాడి, నర్సరీ నిర్వహణ, కంపోస్ట్ తయారీ విధానాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించి, మొక్కల పెంపకం, సేంద్రీయ ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించాలని సిబ్బందికి సూచించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ, గ్రామ పంచాయతీ నర్సరీల ద్వారా నాణ్యమైన మొక్కలను ఉత్పత్తి చేసి, హరితహారాన్ని విజయవంతం చేయాలి. కంపోస్ట్ షెడ్లను సద్వినియోగం చేసుకుని సేంద్రీయ ఎరువుల తయారీని పెంచాలి. రైతుల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహిస్తోంది. తక్కువ నీటితో, తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం ఇచ్చే ఆయిల్ పామ్ సాగును రైతులు విస్తృతంగా చేపట్టాలి. వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు రైతులకు అవసరమైన సాంకేతిక సలహాలు, సబ్సిడీలపై పూర్తి అవగాహన కల్పించాలి. గ్రామ స్థాయిలో స్వయం సమృద్ధి సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి" అని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ, ఏపీవో, వ్యవసాయ అధికారి, సర్పంచ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

# బస్సు ధ్వంసం కేసును కోర్టు కొట్టివేయడంతో నాయకులకు భారీ ఊరట.




జనగామ(భారత శక్తి)జులై 2: ప్రభుత్వ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కాంగ్రెస్ ప్రతిపక్షాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళనలో నమోదైన బస్సు ధ్వంసం కేసును కోర్టు కొట్టివేసింది.దివంగత మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దుగ్యాల శ్రీనివాసరావు నాయకత్వంలో 2015 అక్టోబర్ 10న పాలకుర్తి గుడివాడ చౌరస్తాలో ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ధర్నా సందర్భంగా ఆర్టీసీ బస్సు పై ఆందోళనకారులు దాడులు చేయడంతో బస్సు ధ్వంసం అయింది.దీంతో బస్సు డ్రైవర్ కొత్తపల్లి రవీందర్ ఫిర్యాదు మేరకు పాలకుర్తి ఎస్ఐ ఉస్మాన్ షరీఫ్ కేసు నమోదు చేశారు.మాజీ ఎమ్మెల్యే దుగ్యాల శ్రీనివాసరావుతో పాటు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ,పాలకుర్తి మండల పార్టీ అధ్యక్షుడు పోగు శ్రీనివాస్,మాజీ మండల పార్టీ అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి గౌడ్,నాయకులు బన్నెపాక గణేష్,చిలువేరు కృష్ణమూర్తి,కోట వెంకటేశ్వర్లు,సలేంద్ర వెంకన్న,బిఆర్ఎస్ పాలకుర్తి మండల అధ్యక్షుడు పసునూరి నవీన్,గుగ్గిళ్ళ ఆదినారాయణ, కారుపోతుల శ్రీనివాస్,ధరావత్ బాలు,ఎండి సలీం,గుగులోతు కిషన్ నాయక్ లపై కేసు నమోదు అయింది.2015 నుంచి ఇప్పటివరకు వివిధ కోర్టులో విచారణ జరగగా ఈ రోజు హనుమకొండ కోర్టులో కేసును కొట్టివేశారు.దీంతో కాంగ్రెస్ పార్టీ నాయకులకు భారీ ఊరట లభించింది.కేసు నమోదైన వారిలో మాజీ ఎమ్మెల్యే దుగ్యాల శ్రీనివాసరావు,కోట వెంకటేశ్వర్లు మృతి చెందారు.

## భైంసా పట్టణంలో ప్రత్యేక ఎన్యుమరేషన్

# ఫారాల పంపిణీ శిబిరాలు

**- ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలి**

**- భైంసా సబ్ కలెక్టర్, సంకేత్ కుమార్.**



నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూలై 02(భారత శక్తి) ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం--2026లో భాగంగా భైంసా పట్టణంలో 03.06.2026న ఉదయం 07 :00 గంటల నుండి ప్రత్యేక ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ శిబిరాలు నిర్వహించనున్నట్లు సబ్ కలెక్టర్, భైంసా తెలిపారు. అర్హులైన ప్రతి ఓటరు ఈ ప్రత్యేక అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమకు సంబంధించిన ఎన్యుమరేషన్ ఫారాలను స్వీకరించాలని, అలాగే అవసరమైన వివరాలను సక్రమంగా నమోదు చేసి ఎన్నికల సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

### ప్రత్యేక శిబిరాలు క్రింది కేంద్రాల్లో నిర్వహించబడనున్నాయి:

1. సిద్ధిక్ ఫంక్షన్ హాల్, మార్కెట్ ఏరియా, భైంసా (ఇండియన్ గ్యాస్ సమీపంలో) మొత్తం 23 పోలింగ్ స్టేషన్లు

**పోలింగ్ స్టేషన్ నంబర్లు:** 117, 118, 119, 120, 121, 122, 123, 124, 125, 126, 127, 128, 129, 139, 140, 141, 142, 143, 144, 145, 146, 147, 148

2. మున్నూరు కాపు ఫంక్షన్ హాల్ (పాతది), బట్టి గల్లి, భైంసా మొత్తం 19 పోలింగ్ స్టేషన్లు

**పోలింగ్ స్టేషన్ నంబర్లు:** 114, 115, 116, 130, 131, 132, 135, 136, 137, 138, 149, 150, 151, 152, 153, 154, 155, 156, 157 ఈ శిబిరాలకు సంబంధిత పోలింగ్ స్టేషన్ల పరిధిలోని ఓటర్లు తప్పనిసరిగా హాజరై ఎన్యుమరేషన్ ఫారాలను పొందాలని, ఎన్నికల ప్రక్రియను విజయవంతం చేయడంలో ప్రజలు తమ వంతు సహకారం అందించాలని సబ్ కలెక్టర్, భైంసా విజ్ఞప్తి చేశారు.

## వధూవరులను ఆశీర్వదించిన

## జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి



జనగామ(భారత శక్తి)జులై 2:జనగామ నియోజకవర్గం పరిధిలోని సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం తాడూరు గ్రామానికి చెందిన నర్రా రాజీ రెడ్డి కుమారుడి వివాహ వేడుక చేర్యాల లోని వరుణ్ వైష్ గార్డెన్స్‌లో జరిగింది. ఈ వివాహ వేడుకకు జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి దాంపత్య జీవితం ఆనందంగా, ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

## వేయించిన పల్లీల్లో పెండల పురుగు.


### తంగళ్లపల్లి పర్మిట్ రూమ్‌లో వినియోగదారుల ఆందోళన



భారత శక్తి న్యూస్, రాజన్న సిరిసిల్ల, జూలై 2: తంగళ్లపల్లి మండల కేంద్రంలోని ఓ పర్మిట్ రూమ్‌లో గురువారం ఆందోళనకర ఘటన చోటుచేసుకుంది. మందు సేవించేందుకు వచ్చిన వినియోగదారులు మంచింగ్‌గా వేయించిన పల్లీలు ఆర్డర్ చేయగా, వాటిలో వేయించిన పురుగు కనిపించడంతో ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. యాజమాన్యం నిర్లక్ష్యంపై అక్కడే ఉన్న వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆహార పదార్థాల తయారీలో కనీస పరిశుభ్రతా ప్రమాణాలు పాటించడం లేదని ఆరోపించారు. ఇలాంటి నిర్లక్ష్యం వల్ల ప్రజల ఆరోగ్యాలు ముప్పులో పడుతున్నాయని వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలో ఆహార పదార్థాల నాణ్యత, పరిశుభ్రతపై వరుసగా ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ఈ ఘటన మరోసారి స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది. నిబంధనలు ఉల్లంఘించి అపరిశుభ్ర వాతావరణంలో ఆహార పదార్థాలు విక్రయిస్తున్న సదరు పర్మిట్ రూమ్ యాజమాన్యంపై ఆహార భద్రత, ఎక్సైజ్ శాఖ అధికారులు విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన

## ఎర్రబెల్లి ఉషా దయాకర్ రావు.



జనగామ(భారత శక్తి)జులై 2:దేవరుప్పుల మండలం చౌడూర్ గ్రామానికి చెందిన దేవర బిక్షపతి కూతురు శ్రావణి వివాహానికి హాజరై వధూవరులను ఎర్రబెల్లి ఉషా దయాకర్ రావు,పల్లా సుందర్ రామ్ రెడ్డి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు తీగల దయాకర్ గౌడ్, మాజీ ఎంపీపీ కొల్లూరు సోమయ్య, జనగామ జిల్లా బి .ఆర్. ఏస్ నాయకులు కోతి ప్రవీణ్ గౌడ్,వంగ అర్జున్ గౌడ్ , కుతాటి నరసింహులు, మండల ఉపాధ్యక్షులు మల్లారెడ్డి, ఎండి కాశీమ్,ఎస్.సి. సెల్ మండల అధ్యక్షులు మాచర్ల బాబు, బీసీ సెల్ మండల అధ్యక్షులు మేకల సంపత్, మండల యూత్ అధ్యక్షులు చౌడూర్, మాజీ సర్పంచ్ ఇనుముల రంగయ్య, చౌడూరు గ్రామ సర్పంచ్ వాసర్ల సంపత్, గంగారపు సత్తయ్య, మాదారం శంకర్, బుసిగంపల భాస్కర్ రాజా, రాములు, మేకల యాదగిరి,బొట్టు ఇంద్ర స్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పథకంలో కొత్త మార్పులు

**- జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి**

**- 125 రోజుల పనిదినాలతో గ్రామాభివృద్ధి, రైతులకు అధిక ప్రోత్సాహం**

**- పెండ్లిమర్రి మండలం తిప్పిరెడ్డిపల్లె లో ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డితో కలిసి »»VB-G RAM (గ్రామీణ్)'' పథకం పనుల ప్రారంభం**

**- ప్రతి పేద కుటుంబానికి మరింత మేలు : ఎమ్మెల్యే**




పెండ్లి మర్రి, జూలై 2(భారత శక్తి ) : గ్రామీణ పేద కుటుంబాల ఆర్థికాభివృద్ధి, గ్రామాల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ఉపాధి హామీ పథకంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన మార్పులు ప్రతి పేద కుటుంబానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు.మహాత్మా గాంధీ



జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి ప్రత్యామ్నాయంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన »»VB-G RAM (గ్రామీణ్) – "వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్" కార్యక్రమాన్ని గురువారం దేశవ్యాప్తంగా ప్రారంభమైంది. రాష్ట్ర స్థాయి కార్యక్రమాన్ని తిరుపతి జిల్లా ఒబులవారిపల్లె మండలం ముక్కావారిపల్లెలో ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రిలు ప్రారంభించగా వై ఎస్ ఆర్ కడప జిల్లాలో కమలాపురం నియోజకవర్గం పెండ్లిమర్రి మండలం తిప్పిరెడ్డిపల్లెలో జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలోని వరద కాలువలో పూడికతీత పనులను పార, పలుగు పట్టి ప్రారంభించారు. అనంతరం ఉపాధిహామీ పనుల ద్వారా తిప్పిరెడ్డిపల్లెలో నిర్మించిన నూతన క్యాటిల్ షెడ్ ను వారు ప్రారంభించి స్థానిక రైతుకు చెందిన ఎద్దులకు అందులో వసతి



కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గత రెండు దశాబ్దాలుగా ఉపాధి హామీ పథకం గ్రామీణ భారత ముఖచిత్రాన్ని మార్చడం లో కీలక పాత్ర పోషించిందన్నారు. ఇప్పుడు తీసుకొచ్చిన నూతన మార్పులతో గ్రామీణ కుటుంబాలకు మరింత ప్రయోజనం చేకూరుతుందన్నారు.

గతంలో 100 రోజులుగా ఉన్న పనిదినాలను 125 రోజులకు పెంచడం ద్వారా ప్రతి కుటుంబానికి అదనంగా సుమారు రూ.10 వేల వరకు ఆదాయం లభించే అవకాశం ఏర్పడిందన్నారు. ఉపాధి కల్పనతో పాటు గ్రామాల్లో రహదారులు,అంగన్‌వాడీ కేంద్రాలు, కమ్యూనిటీ భవనాలు వంటి మౌలిక సదుపాయాల నిర్మాణానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు.

రైతులకు తోటల పెంపకం వంటి వ్యవసాయాభివృద్ధి కార్యక్రమాలకు 100 శాతం సబ్సిడీ అందిస్తామని, మొక్కల నాటకం నుంచి మూడేళ్ల పాటు వాటి సంరక్షణకు అవసరమైన నీరు, ఎరువుల వ్యయాన్ని కూడా ప్రభుత్వం భరిస్తుందని వెల్లడించారు. పథకం అమలులో పారదర్శకత కోసం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నామని, హాజరు నమోదు నుంచి పనుల పర్యవేక్షణ వరకు టెక్నాలజీ ద్వారా నిర్వహించి అక్రమాలకు ఆస్కారం లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.ప్రతి గ్రామంలో అవసరాలకు అనుగుణంగా ముందస్తుగా పనుల ప్రణాళికలు రూపొందించుకుని ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, గ్రామాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.

### ప్రతి పేద కుటుంబానికి మరింత మేలు : ఎమ్మెల్యే

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రాధాన్యతతో అమలు చేస్తున్న ఈ పథకం గ్రామాల్లో ప్రతి పేద కుటుంబానికి ఆర్థికంగా మరింత మేలు చేకూరుస్తోందని కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి అన్నారు. ఉపాధి హామీ పథకాన్ని కమలాపురం నియోజక వర్గంలో సమర్థవంతంగా అమలు చేయడం వల్ల గత రెండేళ్లలో సుమారు రూ.120 కోట్ల మేర పనులు చేపట్టినట్లు తెలిపారు. గతంలో రూ.18 కోట్ల వరకు మాత్రమే నిధులు లభించగా, జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవతో ఈ ఏడాది సుమారు రూ.42 కోట్ల నిధులు నియోజకవర్గానికి కేటాయించగలిగారని తెలిపారు.రైతులు, ఉపాధి కూలీలు ప్రభుత్వ పథకాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని, గోశాలలు,తోటల పెంపకం, సోక్‌పిట్లు, వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లే రహదారులు, నీటి సంరక్షణ పనులు, చిన్న గిడ్డంగులు,గ్రామీణ మార్కెట్లు, నిర్వహణ పనులు వంటి అనేక కొత్త అవకాశాలు ఈ పథకం లో కల్పించ బడినట్లు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి కి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని,ప్రతి గ్రామంలో సీసీ రహదారులు, డ్రైనేజీలు, వ్యవసాయ రహదారులు, ప్రజా సౌకర్యాల కల్పన లక్ష్యంగా పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజల సహకారంతో కమలాపురం నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ అదిశేషారెడ్డి, ఉద్యానశాఖ అధికారి రవిచంద్ర, పశుసంవర్ధక శాఖ, పీఆర్, ఇరిగేషన్, ఏపిఎంఐపి, అనుబంధ శాఖల అధికారులు, మహిళలు, రైతులు ,స్థానిక నాయకులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## నాసిరకం మొక్కజొన్న విత్తనాలు

## అమ్మిన వారిపై చర్యలు తీసుకోవాలి.



మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, జులై 02(భారత శక్తి):మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండల కేంద్రంలో నాసిరకం మొక్కజొన్న విత్తనాలు అమ్మిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మండల వ్యవసాయ అధికారి బి.వెంకన్నకు బాధిత రైతు తేజావత్ అరుణ్ పాండ్యన్ ఫిర్యాదు చేశారు. మండలంలోని నరసింహుల గూడెం వాచ్య తండాకు చెందిన తాను బుధవారం మండల కేంద్రంలోని ఉప్పరపల్లి రోడ్డులో గల రమ్య ఏజెన్సీ నందు మేలు రకం విత్తనాల కొనుగోలు కోసం వెళ్లి షాపు యజమానిని అడుగగా రెండు విత్తన బ్యాగులను తనకు అని చెప్పి ఇచ్చాడని, వాటిని గురువారం విత్తడానికి వెళ్లిన సందర్భంలో ప్యాకెట్ ను పరిశీలించగా దానిపై ఎక్స్పైరీ తేదీ లేదని, ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధర వసూలు చేశాడని, ఈ విషయమై షాపు యజమానిని ఫోన్ ద్వారా అడుగగా మీరే మీ ఇష్టంగా తీసుకెళ్లారంటూ బెదిరిస్తున్నారని, ఇలా రైతులను మోసం చేసే వారిపై చర్యలు తీసుకుని, షాపును సీజ్ చేయాలని మండల వ్యవసాయాధికారిని కోరారు.

## స్వయం సహాయక సంఘాల సభ్యులకు సమగ్ర ఆరోగ్య


## పరీక్షల నిర్వహణపై జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమం



భారత శక్తి, జూలై 02 (యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న స్వయం సహాయక మహిళా సంఘాల (ఎస్‌హెచ్‌జీ) సభ్యుల సమగ్ర ఆరోగ్య పరీక్షల కార్యక్రమాన్ని జిల్లాలో సమర్థవంతంగా అమలు చేసేందుకు జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశాల మేరకు గురువారం కలెక్టరేట్ మినీ మీటింగ్ హాలులో జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లాలో మొత్తం 1,94,493 మంది స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులు ఉన్నారని, వారందరికీ దశలవారీగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, మూడు నెలల వ్యవధిలో పూర్తి చేసేలా సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించి అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు మహిళా సంఘాల సభ్యుల ఆరోగ్య పరీక్షలు, నమూనాల సేకరణ, డేటా నమోదు, ఫాలో అప్ ప్రక్రియలను సమర్థవంతంగా నిర్వహించేందుకు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందితో పాటు డీఆర్‌డీఏ, మెప్మా, మున్సిపల్ శాఖల సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని పోచంపల్లి, షరాజీపేట్, బీబీనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను మాస్టర్ ట్రైనింగ్ కేంద్రాలుగా గుర్తించి, ఒక్కో కేంద్రం నుంచి ల్యాబ్ టెక్నీషియన్లకు శిక్షణ అందించినట్లు తెలిపారు. శిక్షణ పొందిన మాస్టర్ ట్రైనర్ల ద్వారా జిల్లాలోని మిగిలిన ఆరోగ్య సిబ్బందికి దశలవారీగా శిక్షణ అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా టీ–డయాగ్నోస్టిక్స్ రాష్ట్ర సమన్వయకర్త (ర్ఘీవ జశీశీతీఱఅఱఱశీతీ) శ్రీ భరత్ పాల్గొని, సమగ్ర ఆరోగ్య పరీక్షల నిర్వహణ విధానం, నమూనాల సేకరణలో పాటించాల్సిన ప్రమాణాలు, డేటా నమోదు, నాణ్యత నియంత్రణ, నివేదికల నిర్వహణ తదితర అంశాలపై వైద్యులు, ల్యాబ్ టెక్నీషియన్లు మరియు సంబంధిత శాఖల సిబ్బందికి సవివరంగా శిక్షణ అందించారు. ఈ కార్యక్రమం ద్వారా మహిళల ఆరోగ్యంపై సమగ్ర ఆరోగ్య ప్రొఫైల్ రూపొందించడంతో పాటు, వ్యాధులను ముందస్తుగా గుర్తించి సకాలంలో చికిత్స అందించడం ద్వారా మహిళల ఆరోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి (డీఆర్‌డీఓ), జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం. మనోహర్, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ వంశీకృష్ణ, వైద్యులు, ల్యాబ్ టెక్నీషియన్లు, టీ–డయాగ్నోస్టిక్స్ రాష్ట్ర సమన్వయకర్త శ్రీ భరత్, టీ–హబ్, మెప్మా, మున్సిపల్ మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రేగొండ రైతు వేదికలో రేగొండ, గోరుకొత్తపల్లి మండలాల

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ చేసిన భూపాలపల్లి ఎమ్మెల్యే సత్తన్న



రేగొండ, జూలై 2 (భారత శక్తి): భూపాలపల్లి నియోజకవర్గంలోని రేగొండ రైతు వేదికలో గురువారం రేగొండ, గోరుకొత్తపల్లి మండలాలకు చెందిన 57 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ 14,72,000 రూపాయల పంపిణీ చేసినారు ఈ కార్యక్రమానికి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పేద ప్రజలకు వైద్య చికిత్సల కోసం ప్రభుత్వం అందిస్తున్న సీఎం రిలీఫ్ ఫండ్, ఎల్.ఓ.సీ (Letter of Credit) వంటి పథకాల ప్రయోజనాలు ప్రతి అర్హుడికి త్వరితగతిన అందేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అలాగే భూపాలపల్లి జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని రకాల వైద్య సదుపాయాలను దశలవారీగా అందుబాటులోకి తీసుకొస్తున్నామని, చిట్యాల మండల ప్రభుత్వ ఆసుపత్రిలో కూడా ఆధునిక వైద్య సేవలు, అవసరమైన సౌకర్యాలు త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి వస్తాయని వెల్లడించారు. భూపాలపల్లి జిల్లా కేంద్ర ఆసుపత్రి తెలంగాణతో పాటు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల ప్రజలకు, ముఖ్యంగా గర్భిణీ స్త్రీలు మరియు అత్యవసర వైద్య సేవలు అవసరమైన రోగులకు ఎంతో ఉపయోగకరంగా మారింది అని తెలిపారు. భూపాలపల్లి నియోజకవర్గ ప్రజలకు అన్ని రకాల వైద్య సేవలు, అన్ని విభాగాల సౌకర్యాలు స్థానికంగానే అందే విధంగా ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే గారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్, భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గుటోజు కిష్టయ్య, గ్రాజూ చైర్మన్ విజ్ఞాన్ రావు , సంబంధిత తహసీల్దార్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మూడెం ఉమేష్ మైస బిక్షపతి పాడి ప్రతాపరెడ్డి పల్నాటి శ్రీనివాస్ మటిక సంతోష్ వెంకట్రావు పోనుగటి వీరబ్రహ్మం మండల నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు అధికారులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ రహిత సమాజం కోసం రాజీ లేని కృషి చేస్తాం



కూకట్పల్లి, జూలై 2(భారత శక్తి ):ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఉషముళ్ళపూడి కమాన్ నుండి గాజులరామరం వరకు చేపడుతున్న వయా ఎల్లమ్మబండ ప్రధాన రహదారి లో జరుగుతున్న 100 ఫీట్ రోడ్డు విస్తరణ పనులను సిఎంసీ ఇంజనీరింగ్ ,టౌన్ ప్లానింగ్. ఎలక్ట్రికల్ విభాగం అధికారులు తాజా మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ తో పి ఏ సి చైర్మన్ ఆరెకపూడి గాంధీ కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పి ఏ సి చైర్మన్ గాంధీ మాట్లాడుతూ ఉషముళ్ళపూడి కమాన్ నుండి గాజులరామరం వెళ్లే రోడ్డు వయా ఎల్లమ్మబండ రోడ్డు నిత్యం ట్రాఫిక్ సమస్య తో ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు అని ,ట్రాఫిక్ సమస్య పరిష్కారానికై 100 ఫీట్ రోడ్డు విస్తరణ చేపట్టడం జరిగినది అని ,దానిలో భాగంగా తీసుకోవాల్సిన చర్యల పై గతంలో అధికారులతో కలిసి ఉషముళ్ళపూడి కమాన్ నుండి సిక్కుల బస్తీ వరకు పాదయాత్ర గా స్వయంగా నడుచుకుంటూ వెళ్లడం జరిగిన సంగతి విదితమే అని పి ఏ సి చైర్మన్ గాంధీ తెలియచేసారు. 100 ఫీట్ రోడ్డు విస్తరణలో ఉన్న అడ్డంకులను తొలగిస్తూ తీసుకోవాల్సిన చర్యల పై చర్చించి, ప్రణాళిక ను రూపొందించి రోడ్డు విస్తరణ పనులు వెంటనే చేపట్టి త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని, రోడ్డు మధ్యలో వచ్చిన బండ రాళ్ళ ను తొలగించడం జరుగుతుంది అని,రోడ్డు విస్తరణలో అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడం జరిగినది అని పి ఏ సి చైర్మన్ గాంధీ తెలియచేసారు. ఉషముళ్ళపూడి కమాన్ నుండి సిక్కుల బస్తి వరకు ఎల్లమ్మ బండ రోడ్డు విస్తరణలో భాగంగా రోడ్డు పక్కన గల విద్యుత్ స్థంబాలను స్థాన భ్రంశం చేపట్టడం జరిగినది అని అన్నారు. ప్రజలకు ట్రాఫిక్ రహిత ,సుఖవంతమైన ,మెరుగైన రవాణా సౌకర్యం కొరకు శాయ శక్తుల కృషి చేస్తానని, ప్రజలకు రోడ్డు ఎంతగానో ఉపయోగపడుతుంది అని పి ఏ సి చైర్మన్ గాంధీ చెప్పడం జరిగినది. 100 ఫీట్ రోడ్డు విస్తరణ పై అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇవ్వడం జరిగినది అని,ఏ చిన్న సమస్య అయిన తన దృష్టికి తీసుకువస్తే తప్పకుండా పరిష్కరిస్తానని పి ఏ సి చైర్మన్ గాంధీ తెలియచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ,కార్యకర్తలు మరియు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుల నియామకంపై నాయకులకు కృతజ్ఞతలు తెలిపిన తుంగతుర్తి రవి, కర్రె రాజేష్, బండి శ్రీరాములు, అమర్, ప్రభాకర్ రెడ్డి



మేడ్చల్, భారత శక్తి ప్రతినిధి, జూలై 2: మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 9వ డివిజన్ మేడిపల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా తుంగతుర్తి రవి, 8వ డివిజన్ పోచారం అధ్యక్షుడిగా కర్రె రాజేష్, 10వ డివిజన్ పీర్జాదిగూడ అధ్యక్షుడిగా బండి శ్రీరాములు, 7వ డివిజన్ ఎదులాబాద్ అధ్యక్షుడిగా సామల అమర్, 6వ డివిజన్ ఘట్కేసర్ అధ్యక్షుడిగా బొక్క ప్రభాకర్ రెడ్డి నూతనంగా నియమితులైన సందర్భంగా డీసీసీ అధ్యక్షులు, నియోజకవర్గ ఇంచార్జ్ వజ్రేష్ యాదవ్ ని, మాజీ శాసనసభ్యులు మలిపెద్ది సుదీర్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా తుంగతుర్తి రవి మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి పార్టీ బాధ్యతలను అప్పగించిన ఈ నియామకానికి సహకరించిన టీపీసీసీ అధ్యక్షులు మహేష్ గౌడ్ కు , హరివర్ధన్ రెడ్డి కి , నక్క ప్రభాకర్ గౌడ్ కు డివిజన్ లలోని సీనియర్ నాయకులకు కార్యకర్తలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో కూడా వారి మార్గదర్శకత్వం, సహకారం ఇదే విధంగా కొనసాగాలని ఆకాంక్షించారు. పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారం, అలాగే కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు జలెందర్ రెడ్డి, పోచారం మున్సిపల్ మాజీ అధ్యక్షులు సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, జోగు సోమయ్య, శరత్ గౌడ్, కపిల్, శేఖర్, వినోద్, పఠాన్, మహేశ్వరప్ప తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేస్తున్నాం

**- జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి**



కడప, జూలై 2(భారత శక్తి ): వైఎస్ఆర్ కడప జిల్లాలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను వేగవంతం చేసి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేలా ప్రత్యేక దృష్టి సారించామని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు. గురువారం విజయవాడ నుండి SIR నిర్వహణ, సన్నాహక చర్యలపై.. రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి వివేక్ యాదవ్.. అన్ని జిల్లాల కలెక్టర్లతో జూమ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు ప్రొద్దుటూరు తహశీల్దార్ కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి హాజరవ్వగా.. కడప కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుండి డిఆర్వో మల్లికార్జునుడు, ఎస్డీసి వెంకటపతి హాజరయ్యారు. ఈ సందర్భంగా SIR ప్రక్రియ అమలు, SIR నమోదు ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ పురోగతిపై రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి అన్ని జిల్లాల కాలెక్టర్లతో సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలోని 18,96,231 మంది ఓటర్లలో 14,45,697 మంది (76.24 శాతం) మ్యాపింగ్ పూర్తయిందని, ఇంకా 4,50,534 మంది ఓటర్ల మ్యాపింగ్ మిగిలి ఉందని తెలిపారు. మొత్తం 4,62,016 మంది ఓటర్ల వివరాల్లో వ్యత్యాసాలు గుర్తించినట్లు వెల్లడించారు. ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ 99.17 శాతం పూర్తైందని, అయితే ఫారాల డిజిటైజేషన్ కేవలం 30.80 శాతమే పూర్తయిందని చెప్పారు. డిజిటైజేషన్‌లో వెనుకబడిన పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జిల్లాలో 321 పోలింగ్ కేంద్రాల్లో డిజిటైజేషన్ 15 శాతం కంటే తక్కువగా ఉందని తెలిపారు. బుక్-ఏ కాల్స్‌లో వచ్చిన 4,338 ఫిర్యాదుల్లో 4,029కు పరిష్కారం చూపగా, ఇంకా పెండింగ్‌లో ఉన్న కొద్దిపాటి ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. అడ్వర్స్ న్యూస్ పబ్లిష్ కు సంబంధించి మైదుకూరు నియోజకవర్గం నుండి ఒక వార్త వచ్చిందిని విచారిస్తే.. ఎలాంటి తప్పిదం లేదని తెలిసిందన్నారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణలో భాగంగా జిల్లాలో ప్రస్తుతం ఉన్న 2,251 పోలింగ్ కేంద్రాలను 2,444కు పెంచే ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు.

## రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లా పర్యటన ను అధికారులు సమన్వయం తో పని చేసి విజయవంతం చేయండి

**- జిల్లా ఇంచార్జి మంత్రి**




వై ఎస్ ఆర్ కడప,జూలై 02(భారత శక్తి ): ఈ నెల 3న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటనలో భాగంగా పర్యటనకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని కార్యక్రమం ను విజయవంతం చేయాలని జిల్లా ఇన్చార్జి మంత్రి మరియు బీసీ సంక్షేమ చేనేత,జౌళి శాఖ మంత్రి శ్రీమతి ఎస్.సవిత తెలిపారు. గురువారం సాయంత్రం జిల్లా ఇన్చార్జ్ మంత్రి, ప్రభుత్వ విప్ మరియు జమ్మలమడుగు శాసనసభ్యులు సి. ఆదినారాయణ రెడ్డి, ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త పెందుర్తి వెంకటేష్, జిల్లాజేసీ డా. నిధీమీనా, సబ్ కలెక్టర్ భావన, కమలాపురం శాసనసభ్యులు పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి, నాయకులు భూపేష్ రెడ్డి లతో లతో కలిసి.. జమ్మలమడుగు నియోజకవర్గం లోని సున్నపురాళ్లపల్లె వద్ద జేఎస్ డబ్ల్యూ రాయలసీమ స్టీల్ ప్లాంట్ నిర్మాణ ప్రాంతంలో రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలను, ఏర్పాట్లను పరిశీలించారు. కర్మాగార సైట్ లో ముఖ్యమంత్రి రాక కోసం ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ ను, శంకుస్థాపన శిలాఫలకాలు, అనంతరం అక్కడి సమీపంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభావేదిక, ముఖ్యమంత్రి, మంత్రుల తాత్కాలిక రెస్టింగ్ రూమ్స్, కంపెనీ ఎక్స్ పీరియన్స్ జోన్, గ్రీన్ రూమ్ మొదలైన ముఖ్యమంత్రి పాల్గొనే అన్ని ప్రాంతాల్లో ఏర్పాట్లను అధికారులతో కలిసి పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటన కార్యక్రమాల్లో పాల్గొనే అధికారులంతా బాధ్యతగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. రాయలసీమ ప్రాంత ప్రజల చిరకాల స్వప్నం జెఎస్ డబ్ల్యూ స్టీల్ ప్లాంట్ నిర్మాణ పనుల శంకుస్థాపన కార్యక్రమాన్ని ప్రతి అధికారి బాధ్యతగా తీసుకొని ముఖ్యమంత్రి పాల్గొనే అన్ని కార్యక్రమాలను విజయవంతం చేయాలని అధికారులను కోరారు. జే ఎస్ డబ్ల్యూ రాయలసీమ లిమిటెడ్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో జూలై 03 న కడప ఉక్కు పరిశ్రమ ప్రారంభం కానున్నదనీ తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరుకానున్న సియం చంద్రబాబు , డిప్యూటి సియం పవన్ కళ్యాణ్ , కేంద్రమంత్రులు శ్రీనివాస వర్మ , కుమారస్వామి హాజరు కానున్నారని తెలిపారు. రాయలసీమ ప్రాంతం సస్యశ్యామలం కాబోతోందనీ అన్నారు. ప్రజలు ఇచ్చిన నమ్మకంతో సియం చంద్రబాబు రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్ గా మారుస్తున్నారు.

# అటవీ భూముల్లో ఆప్టికల్ ఫైబర్ ఏర్పాటుపై డీఎల్‌సీ సమావేశం

**- డిజిటల్ కనెక్టివిటీ విస్తరణకు శాఖల సమన్వయంతో పనులు వేగవంతం చేయాలి: జిల్లా కలెక్టర్ భావేష్ మిశ్రా.**

నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూలై 02: (భారత శక్తి) జిల్లాలో డిజిటల్ కనెక్టివిటీ విస్తరణకు చేపడుతున్న ఆప్టికల్ ఫైబర్ కేబుల్ (రాఖీజ) పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భావేష్ మిశ్రా సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఆయన అధ్యక్షతన జిల్లా స్థాయి కమిటీ (DLC) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అటవీ హక్కుల చట్టం -2006 (RoFR Act) పరిధిలో టి-ఫైబర్ (T-Fiber), జియో డిజిటల్ ఫైబర్ సంస్థలు అటవీ భూముల గుండా ఆప్టికల్ ఫైబర్ కేబుళ్ల ఏర్పాటుకు సమర్పించిన భూముల మళ్లింపు ప్రతిపాదనలను కమిటీ సమగ్రంగా పరిశీలించింది.




ఎస్‌డీఎల్‌సీ (SDLC) ఆమోదించిన తీర్మానాలు, లీనియర్ ప్రాజెక్టులకు సంబంధించిన ఫారం-1 (Form-I) సర్టిఫికెట్ల జారీ అంశాలపై చర్చించి అవసరమైన నిర్ణయాలు తీసుకుంది. డిజిటల్ మౌలిక వసతుల అభివృద్ధి ద్వారా ప్రభుత్వ సేవలను గ్రామీణ ప్రాంతాలతో పాటు ప్రతి పౌరుడికి మరింత చేరువ చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు. సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి పెండింగ్‌లో ఉన్న ప్రక్రియలను త్వరితగతిన పూర్తి చేసి ప్రాజెక్టుల అమలుకు సహకరించాలని సూచించారు. ఈ సమావేశంలో భైంసా సబ్ కలెక్టర్ ఌ ఎస్‌డీఎం, జిల్లా అటవీ అధికారి, రెవెన్యూ డివిజనల్ అధికారి, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి, అటవీ డివిజనల్ అధికారులు, టి-ఫైబర్, జియో డిజిటల్ ఫైబర్ సంస్థల అధికారులు పాల్గొన్నారు.

## ఉద్యమకారుల ఆశయాల సాధన కోసం నిరంతరం పోరాటం చేస్తూనే ఉంటాం.

**కేసులకు అరెస్టులకు భయపడేది లేదు.**

**ప్రభుత్వం కమిటీల పేరుతో కాలయాపన చేస్తే మరో ఉద్యమం తప్పదు: చైర్మన్ కాచం సత్యనారాయణ.**





ఎల్బీనగర్, జూలై 02 (భారత శక్తి):తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు విషయంలో ప్రభుత్వం జాప్యం చేయొద్దని తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం చైర్మన్ కాచం సత్యనారాయణ డిమాండ్ చేశారు. తెలంగాణ రక్షణ సేన ( టిఆర్ఎస్) చీఫ్ కల్వకుంట్ల కవిత ఉద్యమకారులకు భూ పోరాటం పిలుపుమేరకు కాచం సత్యనారాయణను చైతన్యపురి పోలీసులు ముందస్తు అరెస్టు చేసి స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమకారుల సంక్షేమ సంఘం ఏ పార్టీకి కొమ్ముకాయదని, ఉద్యమకారుల సంక్షేమం కోసం పనిచేసే సంఘాల తోటి కలిసి ప్రయాణం చేస్తూ, ఉద్యమకారుల ఆకాంక్షలు నెరవేర్చే క్రమంలో ఉద్యమకారుల సంఘాలకు పార్టీలతోని పని లేకుండా మద్దతు తెలుపుతామని ఈ సందర్భంగా తెలిపారు. అక్రమ ముందస్తు అరెస్టులకు పోలీస్ నిర్బంధాలకు భయపడేది లేదని అన్నారు. తెలంగాణ రాష్ట్రం కోసం గతంలో 2001 నుండి 2014 వరకు రాష్ట్ర సాధనలో కీలక భూమిక వహించిన శ్రీకాంత్ చారి త్యాగం వృదా పోకుండా తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని అన్నారు. తెలంగాణ ఉద్యమకారుల కోసం వారి ఆకాంక్షల కోసం మరో ఉద్యమాన్ని కూడా ఎల్బీనగర్ నే అడ్డాగా చేసుకుంటామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఉద్యమకారులకు 250 గజాల స్థలము, గుర్తింపు కార్డు, 25000 పెన్షన్ లాంటి హామీలు ఇచ్చిందని ఆ వాగ్దానాల అమలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. గుర్తింపు కమిటీ పేరుతో కాలయాపన చేయకుండా ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆయన కోరారు. ఫ్యూచర్ సిటీలో హైదరాబాద్ పరిధిలో ఉన్నటువంటి 24 నియోజకవర్గాల నుండి ఉద్యమకారులకు కనీసం 1000 ఎకరాల భూమిని కేటాయించాలని అన్నారు. తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ కు తగిన గౌరవం కల్పిస్తూ, ఆగస్టు 1లోపు ట్యాంక్ బండ్ పై ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విగ్రహాన్ని ఏర్పాటు చేయని క్రమంలో ఆగస్టు 6 తారీఖున ట్యాంక్ బండ్ పై తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం నుండి తామే ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రవణ్ కుమార్ గుప్తా, ఇరుగు శ్రీధర్, కొత్త రవి, కూర రమేష్, , శ్యామ్ సుందర్ నేత, కృష్ణ, శ్రీనివాస్, తేలుకుంట్ల కృష్ణ, శివ, సురేందర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## మణికొండలో ఏసీబీ ఉచ్చు

**- మాజీ వైస్ చైర్మన్ నరేందర్ రెడ్డి ఇంట్లో సోదాలు!**

**- డీఎస్పీ భీమ్‌రెడ్డి బినామీగా అనుమానం.. రంగంలోకి దిగిన ఏసీబీ బృందాలు**



మణికొండ, జూలై 2: భారత శక్తి మణికొండ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ కే. నరేందర్ రెడ్డి నివాసంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు గురువారం తెల్లవారుజామున ఆకస్మిక సోదాలు నిర్వహించారు. ఇటీవల ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో చిక్కుకున్న పోలీస్ ఉప సూపరింటెండెంట్ (డీఎస్పీ) భీమ్‌రెడ్డికి నరేందర్ రెడ్డి బినామీగా వ్యవహరించారనే పక్కా సమాచారంతో ఈ తనిఖీలు చేపట్టారు. ఏసీబీ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి నేతృత్వంలోని ప్రత్యేక బృందాలు ఈ సోదాల్లో పాల్గొన్నాయి.

**- ఏకకాలంలో ముమ్మర తనిఖీలు:**

డీఎస్పీ భీమ్‌రెడ్డి అక్రమాస్తుల కేసు దర్యాప్తులో భాగంగా నరేందర్ రెడ్డి పేరు ప్రధానంగా తెరపైకి వచ్చింది. భీమ్‌రెడ్డి సంపాదించిన అక్రమ సొమ్మును నరేందర్ రెడ్డి వ్యాపారాల్లో, రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడిగా పెట్టారనే బలమైన ఆధారాలు లభించడంతో ఏసీబీ వ్యూహాత్మకంగా అడుగులు వేసింది. మణికొండలోని నరేందర్ రెడ్డి నివాసంతో పాటు ఆయనకు సంబంధించిన కార్యాలయాలు, సన్నిహితుల ఇళ్లలోనూ ఏకకాలంలో తనిఖీలు చేపట్టారు.

**- కీలక పత్రాలు, డిజిటల్ ఆధారాల స్వాధీనం,**

సోదాల సందర్భంగా అధికారులు పలు కీలక భూ లావాదేవీల పత్రాలు, బ్యాంకు ఖాతాల వివరాలు, డైరీలను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. నరేందర్ రెడ్డి కి చెందిన ల్యాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్లు, హార్డ్ డిస్క్‌ల వంటి డిజిటల్ ఆధారాలను కూడా సాంకేతిక విశ్లేషణ కోసం ఏసీబీ అదుపులోకి తీసుకుంది.

**- కేసు నేపథ్యం:**

డీఎస్పీ భీమ్‌రెడ్డి అక్రమ సంపాదనకు సంబంధించిన లింకులను ఛేదించే క్రమంలో, ఈ బినామీ వ్యవహారం బయటపడింది. నరేందర్ రెడ్డి మున్సిపల్ వైస్ చైర్మన్‌గా ఉన్న కాలంలో జరిగిన కొన్ని వివాదాస్పద భూ లావాదేవీల్లోనూ భీమ్‌రెడ్డి ప్రమేయం ఉన్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు.

**- రాజకీయ, అధికార వర్గాల్లో కలకలం**

ఒకవైపు మున్సిపాలిటీ మాజీ కీలక ప్రజాప్రతినిధి, మరోవైపు పోలీస్ ఉన్నతాధికారికి సంబంధించిన కేసు కావడంతో ఈ సోదాలు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా రాజకీయ, అధికార వర్గాల్లో తీవ్ర కలకలం రేపాయి. సోదాలు ఇంకా కొనసాగుతున్నాయని, స్వాధీనం చేసుకున్న పత్రాల పరిశీలన అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఏసీబీ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. నరేందర్ రెడ్డిని ఏసీబీ కార్యాలయంలో విచారించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# ఓటర్ల నమోదు ప్రక్రియలో కాంగ్రెస్ బూత్ స్థాయి ఏజెంట్లు క్రియాశీలకంగా వ్యవహరించాలి

**- ఎల్బీనగర్ నియోజకవర్గ కోఆర్డినేటర్ నాగరాజు గౌడ్**

**- సమర్థవంతంగా పని చేసేలా డివిజన్ అధ్యక్షులు బాధ్యత తీసుకోవాలి**

**- బీఎల్ఓల గైర్హాజరు, ఫారాల కొరతపై ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లాలనిసూచన**

వనస్థలిపురం, జూలై 2: భారత శక్తి సభ్యత్వ నమోదు మరియు ఓటర్ల జాబితా సవరణ (SIR) ప్రక్రియలో కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయి ఏజెంట్లు (BLA) అత్యంత క్రియాశీలకంగా భాగస్వామ్యం కావాలని, ఇందుకు డివిజన్ అధ్యక్షులు పూర్తి బాధ్యత వహించాలని ఎల్బీనగర్ నియోజకవర్గ కోఆర్డినేటర్, కల్లుగీత పారిశ్రామిక సహకార సంస్థ వైస్ చైర్మన్ కేశం నాగరాజు గౌడ్ స్పష్టం చేశారు. వనస్థలిపురంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు.

**- క్షేత్రస్థాయిలో పెరగాల్సిన నిఘా**

సమావేశం సందర్భంగా నాగరాజు గౌడ్ మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదయ్యేలా కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయి ఏజెంట్లు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించాలని సూచించారు. »»SIR ప్రక్రియ ప్రారంభమై అప్పుడే వారం రోజులు గడిచిపోయింది. అందువల్ల డివిజన్ అధ్యక్షులు, ఏజెంట్లు తక్షణమే బూత్ స్థాయి అధికారులతో (BLO) సమన్వయం చేసుకోవాలి. కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి" అని ఆయన పిలుపునిచ్చారు.

**- అధికారుల దృష్టికి సమస్యలు**

క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న పలు సమస్యలను డివిజన్ అధ్యక్షులు ఈ సమావేశంలో నాగరాజు గౌడ్ దృష్టికి తీసుకువచ్చారు. కొన్ని పోలింగ్ బూత్‌లకు బూత్ స్థాయి అధికారులు (BLO) సక్రమంగా రావడం లేదని వారు ఫిర్యాదు చేశారు. దీనిపై నాగరాజు గౌడ్ స్పందిస్తూ.. ఈ నిర్లక్ష్యాన్ని వెంటనే ఎన్నికల సంఘం (EC) అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.



అదేవిధంగా.. కొత్త ఓటర్ల నమోదుకు సంబంధించిన ఫారమ్-6, తప్పుల సవరణకు సంబంధించిన ఫారమ్-7 వంటి దరఖాస్తులను బూత్ స్థాయి అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంచడం లేదని నియోజకవర్గ ప్రజల నుండి ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. ఈ అంశాన్ని కూడా ఎన్నికల నమోదు అధికారి (ERO), సహాయ ఎన్నికల నమోదు అధికారుల (AERO) వద్దకు తీసుకెళ్లి తక్షణమే పరిష్కరించుకోవాలని దిశానిర్దేశం చేశారు.

**- సమావేశంలో పాల్గొన్న ప్రముఖులు**

ఈ విస్తృత స్థాయి సమావేశంలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు మకుటం సదశివుడు, కుట్ల నర్సింహా యాదవ్, లింగాల కిషోర్ గౌడ్, వేణుగోపాల్ యాదవ్, శశిధర్ రెడ్డి, మంజుల రెడ్డి, బుడ్డా సత్యనారాయణ, చెన్నగోని రవీందర్ గౌడ్ సహా పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భారత శక్తి
VOICE OF INDIAN
శుక్రవారం, జులై 3, 2026

# జడ శ్రావణ్‌తో జాగ్రత్త పడుతున్న జగన్!

**విజయవాడ(భారత శక్తి),** ఏపీ రాజకీయాల్లో కుల ప్రభావం అధికంగా ఉంటుంది. కులాల వారీగా ఓట్లు చీలిపోతాయి కూడా. అలా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి రెడ్డి సామాజిక వర్గం అండ ఉంటుంది. మరోవైపు దళిత క్రైస్తవ ఓటర్లు కూడా అటువైపే మొగ్గు చూపుతారు. మొన్నటి ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ దారుణ పరాజయం చవిచూసింది. కానీ దళిత క్రైస్తవులు మాత్రం ఆ పార్టీని ఆదరించారు. అయితే ఆ ఓటు బ్యాంకు పై తాజాగా గురి పెట్టారు జడ శ్రవణ్ కుమార్. గోదావరి జిల్లాలో దళిత క్రైస్తవ సభ పెట్టి.. మీరంతా జడ శ్రావణ్ తాలూకా అని చెప్పే రోజు వస్తుందని వ్యాఖ్యానించారు. పవన్ కళ్యాణ్ మాదిరిగా ఈ రాష్ట్రానికి డిప్యూటీ సీఎం అవుతానని కూడా తేల్చి చెప్పారు. పనిలో పనిగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీపై కూడా సున్నిత విమర్శలు చేశారు. దీంతో ఆ పార్టీలో అంతర్మధనం ప్రారంభం అయ్యింది.కూటమి ప్రభుత్వంపై బురదజల్లేందుకు జడ శ్రావణ్ కుమార్ సేవలను వాడుకోవాలని చూసింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ.. సాక్షి మీడియాలో ఆయన ప్రెస్మీట్లకు ఎనలేని ప్రాధాన్యం దక్కుతూ వస్తోంది. డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు తో పాటు ప్రభుత్వాన్ని ఇరుకున్న పెట్టేలా జడ శ్రావణ్ కుమార్ వ్యాఖ్యలు నడిచేవి. ఒక్క మాటలో చెప్పాలంటే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జడ శ్రావణ్ కుమార్ ను ఒక అస్త్రంగా మార్చుకోవాలని చూసింది. కానీ ఇప్పుడు అదే జడ శ్రవణ్ నేరుగా జగన్మోహన్ రెడ్డికి అత్యంత కీలకమైన దళిత క్రైస్తవ ఓటు బ్యాంకుకే ఎసరు పెట్టేలా ఉన్నారు. ఏలూరులో దళిత క్రైస్తవ సమర శంఖారావం బహిరంగ సభ నిర్వహించారు. అయితే ఇది కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏర్పాటు చేసిన సభ. కానీ వైసీపీని ఉలిక్కిపడేలా చేసేసారు శ్రావణ్ కుమార్.ఆకివీడు ఘటన నేపథ్యంలో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు క్రైస్తవ మతాన్ని కించపరిచారని ప్రధాన అజెండాతో ఈ సభ నడిచింది. రఘురామకృష్ణం రాజును తీవ్రస్థాయిలో టార్గెట్ చేసిన జడ శ్రావణ్ కుమార్ ఈ సభ ద్వారా దళిత క్రైస్తవులను ఒక తాటిపైకి తెచ్చే ప్రయత్నం చేశారు. తనను తాను అభినవ అంబేద్కర్ గా చూపించే ప్రయత్నం చేశారు. కేవలం వేదికలపై ఉపన్యాసాలకే పరిమితం కాకుండా.. ఇకపై రాష్ట్రంలోని దళిత క్రైస్తవులంతా పాము జడ శ్రావణ్ తాలూకా అని గర్వంగా చెప్పుకోవాలి అంటూ ఇచ్చిన పిలుపు వైసిపిలో సంచలనంగా మారుతుంది. ఆ పార్టీ నేతలు ఇప్పుడు శ్రావణ్ కుమార్ పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ పార్టీ ఓటు బ్యాంకు పైనే గురి పెడతారా అని ప్రశ్నిస్తున్నారు. తాము మీడియా మైలేజ్ ఇస్తూ.. పరోక్షంగా పాలు పోసి పెంచిన జడ శ్రావణ్.. ఇప్పుడు సొంత సామాజిక వర్గాలను చీల్చే ప్రయత్నం చేస్తుండడం పై వైసీపీ నేతలు తలలు పట్టుకుంటున్నారు. జడ శ్రావణ్ కుమార్ నేరుగా ఈసారి తాను ఉప ముఖ్యమంత్రిని అవుతానని చెబుతున్నారు. అయితే అది ఎలా సాధ్యమో తెలియడం లేదు. కానీ అనవసరంగా జడ శ్రవణ్ కుమార్ ను హైలెట్ చేశామని వైసిపి నేతలు బాధపడుతున్నారు. ఇప్పుడు ఈ అంశంతో కూటమికి ప్రయోజనం చేకూర్చేలా ఉంది పరిస్థితి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకులో చీలిక వస్తే ఆ పార్టీకి దారుణ పరాజయం తప్పదు.. జడ శ్రావణ్ నిజంగా దళిత క్రైస్తవ ఓట్లను టార్గెట్ చేసుకుంటే ప్రతి నియోజకవర్గంలో వేలాది ఓట్లకు గండి పడవచ్చు వైసీపీకి. కూటమిని దెబ్బతీయడానికి వాడిన అస్త్రం ఇప్పుడు రివర్స్ తిరిగి జగన్ సొంత సామ్రాజ్యాన్ని దెబ్బతీసేలా ఉంది.

## ఆ 10 మంది ఎమ్మెల్యేలపై
# టీడీపీ సైలెంట్ యాక్షన్

**విజయవాడ(భారత శక్తి),** ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటింది. అధికార తెలుగుదేశం పార్టీ లో అంతర్గత క్రమశిక్షణపై ఆ పార్టీ హైకమాండ్ అత్యంత కఠినమైన వైఖరిని అవలంబిస్తోంది. ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిచిన ఉత్సాహంలో కొందరు ఎమ్మెల్యేలు రూట్ మారుస్తూ, పార్టీ గీసిన లక్ష్మణ రేఖను దాటుతుండటంపై అధినేత నారా చంద్రబాబు నాయుడు సీరియస్ యాక్షన్‌కు దిగినట్లు స్పష్టమవుతోంది. ముఖ్యంగా వివాదాస్పద వ్యాఖ్యలు, సొంత క్యాడర్‌తో విభేదాలు, పార్టీ లైన్ దాటి వ్యవహరిస్తున్న కొందరు శాసనసభ్యులను హెచ్చరించడం మానేసి.. నేరుగా దూరం పెట్టే వ్యూహాన్ని టీడీపీ అమలు చేస్తోంది. తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు మొదటి నుండి తనకంటూ ఒక ప్రత్యేక శైలని ప్రదర్శిస్తూ వచ్చారు. అయితే, ఇటీవల కాలంలో ఆయన పార్టీ హైకమాండ్ నిర్ణయాలను బహిరంగంగానే ధిక్కరిస్తూ, ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సోషల్ మీడియా వేదికగా అసంతృప్తి వెళ్లగక్కుతున్నారు. పార్టీ అధిష్ఠానం పలుమార్లు అంతర్గతంగా హెచ్చరించినప్పటికీ ఆయన తన వైఖరిని మార్చుకోలేదు. దీంతో టీడీపీ అగ్రనాయకత్వం ఆయనను పూర్తిగా పక్కనపెట్టేసింది. ప్రభుత్వ కార్యక్రమాల పర్యవేక్షణను ఇప్పటికే ఇతర నేతలు చూస్తున్నారు. ఆయనను కేవలం పేరుకే ఎమ్మెల్యే అన్నట్లుగా మార్చేసింది. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘిస్తే ఎంతటి వారికైనా ఇదే గతి పడుతుందనేందుకు కొలికపూడి ఎపిసోడ్ ఒక ఉదాహరణగా నిలిచింది.మరోవైపు సత్యవేడు ఎమ్మెల్యే కోనేరు ఆదిమూలం ప్రవర్తన కూడా పార్టీకి పెద్ద తలనొప్పిగా మారింది. మహిళతో వివాదాస్పదంగా ప్రవర్తించిన వార్తల్లోకెక్కిన ఆయనపై సస్పెన్షన్ వేటు వేశారు. ఆ వివాదం సెటిల్ చేసుకున్నా ఆయనను పార్టీలో కలుపుకోలేదు. అందుకే ఆయన కుమారుడు ఇటీవల ప్రెస్మీట్ పెట్టి ఆగ్రహం వ్యక్తం చేశారు.అయినా టీడీపీ హైకమాండ్ పట్టించుకోవడం లేదు. సత్యవేడులో క్షేత్రస్థాయిలో తెలుగుదేశం పార్టీని నమ్ముకున్న పాత కార్యకర్తలు సైతం ఆయనను ఓన్ చేసుకోవడం లేదు. ఈ విషయాన్ని ఇంటెలిజెన్స్ నివేదికల ద్వారా, సోషల్ మీడియా ఫీడ్‌బ్యాక్ ద్వారా గ్రహించిన చంద్రబాబు.. సత్యవేడులో ఎమ్మెల్యే ప్రమేయం లేకుండానే పనులు జరిగేలా ఒక ప్రత్యేక యంత్రాంగాన్ని రంగంలోకి దించారు. తద్వారా క్యాడర్‌ను కాపాడుకుంటూనే, ఎమ్మెల్యేకు గట్టి షాక్ ఇచ్చారు. వలం ఈ ఇద్దరే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు పది మందికి పైగా ఎమ్మెల్యేల జాబితాను పార్టీ ఇంటెలిజెన్స్ వింగ్ సిద్ధం చేసింది. అధికారం అండతో గ్రూపు రాజకీయాలను ప్రోత్సహించడం, ఇసుక, భూ దందాల్లో తలదూర్చడం, కూటమిలోని భాగస్వామ్య పక్షాలైన జనసేన, బీజేపీ నేతలతో సత్సంబంధాలు కొనసాగించకుండా వివాదాలు కొనితెచ్చుకోవడం వంటి నెగెటివ్ రిపోర్ట్స్ ఉన్న నేతలందరినీ ఈ లిస్టులో చేర్చారు. వీరిలో కొందరు ఉత్తరాంధ్ర, మరికొందరు రాయలసీమ ప్రాంతాలకు చెందిన వారు కూడా ఉన్నట్లుగా చెబుతున్నారు. గతంలో 2014-19 మధ్య కాలంలో కొందరు ఎమ్మెల్యేల మితిమీరిన ప్రవర్తన వల్లే పార్టీ 23 సీట్లకు పడిపోయిందనే చేదు నిజాన్ని చంద్రబాబు నాయుడు ఎప్పటికీ మర్చిపోలేదు. అందుకే, ఈసారి 135 కి పైగా సీట్ల భారీ మెజారిటీ ఉండటంతో.. ఒకరిద్దరు లేదా పది మంది ఎమ్మెల్యేలు దూరమైనా ప్రభుత్వానికి వచ్చే ముప్పేమీ లేదనే ధీమాతో హైకమాండ్ ఉంది. వ్యవస్థ ముఖ్యం, ప్రజల్లో పార్టీ ఇమేజ్ ముఖ్యం.. అంతేకానీ దారి తప్పిన ఎమ్మెల్యేల కోసం పార్టీ ప్రతిష్టను పణంగా పెట్టలేం అని లోకేష్, చంద్రబాబు ఇద్దరూ అంతర్గత సమావేశాల్లో తేల్చి చెప్పారు. మారమని హెచ్చరించడం కంటే, వారిని పక్కనపెట్టి ప్రత్యామ్నాయ నేతలను తయారు చేయడం ద్వారా సదరు ఎమ్మెల్యేల పొగరు దించే వ్యూహాన్ని అమలు చేస్తున్నారు.టీడీపీ హైకమాండ్ తీసుకుంటున్న ఈ నిశ్శబ్ద అడుగులు.. సదరు వివాదాస్పద ఎమ్మెల్యేలకు భవిష్యత్తుపై పెద్ద హెచ్చరికగా మారాయి. ప్రస్తుతం వీరిని దూరం పెట్టడం అంటే.. వచ్చే ఎన్నికల్లో వీరికి టికెట్లు దక్కే ప్రసక్తే లేదనే సంకేతాన్ని క్యాడర్‌కు బలంగా పంపడమే. సోషల్ మీడియాలో కూడా ఈ ఐసోలేషన్ స్ట్రాటజీపై సామాన్య కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నాయకులు తప్పు చేస్తే వెనకేసుకొచ్చే పాత రోజులు పోయాయని, పద్ధతి మార్చుకోకపోతే ఎంతటి సీనియర్ అయినా మాజీ అవ్వక తప్పదని టీడీపీ పంపుతున్న ఈ స్ట్రాంగ్ మెసేజ్.. మిగిలిన ఎమ్మెల్యేలను కూడా దారిలోకి తెస్తుందని భావిస్తున్నారు.

## బోథ్‌లో ఘనంగా రైతు భరోసా సంబరాలు



**(భారత శక్తి)**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ అమలు చేస్తున్న రైతు సంక్షేమ కార్యక్రమాల సందర్భంగా బోథ్ పట్టణంలో రైతు భరోసా సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆడె గజేందర్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి సంబరాలు జరుపుకున్నారుఈ సందర్భంగా ఆడే గజేందర్ గారు మాట్లాడుతూ, రైతుల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని అన్నారు. రైతులకు సబ్సిడీపై పత్తి విత్తనాలు, కందుల విత్తనాలు, సోయాబీన్ విత్తనాలు అందించడంతో పాటు స్ప్రింక్లర్లు, డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు, స్ప్రేయర్లు, ఉద్యానవన పథకాల ద్వారా అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్న ప్రభుత్వం రైతు పక్షపాత ప్రభుత్వమని పేర్కొన్నారు అంతేకాకుండా రైతులు పండించే ప్రతి గింజకు గిట్టుబాటు ధర కల్పిస్తూ కొనుగోలు చేయడం, రైతు రుణమాఫీ అమలు చేయడం, రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేయడం వంటి చారిత్రాత్మక నిర్ణయాలతో రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోందని తెలిపారు ఈ కార్యక్రమంలో బోథ్ బ్లాక్ అధ్య చైర్పన్ గొర్ల రాజు యాదవ్,బోథ్ మండల అధ్యక్షుడు మెరుగు భోజన్న, రాష్ట్ర టీపీసీసీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు కుర్మే మహేందర్,బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బొడ్డు గంగా రెడ్డి,ఆదిలాబాద్ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి,మాజీ బోథ్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నర్సింహా దాస్ మాజీ ఎంపీటీసీ చట్ల ఉమేష్,బోథ్ వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ రాజు రెడ్డి,మాజీ డైరెక్టర్ అబ్రార్,అత్మ డైరెక్టర్ అబ్బిద్, రహీమొద్దీన్, కుచ్చులూర్ ఉప సర్పంచ్ అరుణ్ రెడ్డి,సీనియర్ నాయకులు మొహమ్మద్,హాసీబ్,ఎస్సీ సెల్ రాష్ట్ర మాజీ కన్వీనర్ అనుపట్ల సంజీవ్, అచ్చుతానంద రెడ్డి, వీరం రవి,గడ్డల నారాయణ,భీమా భూమన్న,బోథ్ నియోజకవర్గ మాజీ అధికార ప్రతినిధి యండి సద్దాం,జగన్,షేక్ షకీర్,మారుతి తదితరులు ఉన్నారు

# నవంబర్‌లో సీఐఐ సదస్సు

**విశాఖపట్టణం(భారత శక్తి),** ఆంధ్రప్రదేశ్‌కు భారీగా పెట్టుబడులను ఆకర్షించడమే కాకుండా, నాలెడ్జ్ హబ్‌గా మార్చేందుకు కూటమి ప్రభుత్వం సరికొత్త పంథాను ఎంచుకుంది. వచ్చే నవంబర్ 12, 13 తేదీల్లో విశాఖపట్నం వేదికగా ప్రతిష్టాత్మక 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సు-2026 నిర్వహించనున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. సచివాలయంలో జరిగిన ఉన్నత స్థాయి సన్నాహక సమీక్షా సమావేశంలో సీఎం మాట్లాడుతూ.. ఈ సదస్సును గతానికి భిన్నంగా, వినూత్నంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈసారి భాగస్వామ్య సదస్సు కేవలం విశాఖపట్నానికే పరిమితం కాకుండా.. రాష్ట్రంలోని ఐదు ప్రధాన నగరాలైన విశాఖ, రాజమండ్రి లేదా కాకినాడ, అమరావతి, అనంతపురం, తిరుపతిలలో ప్రాంతీయ భాగస్వామ్య సదస్సులు నిర్వహించాలని సీఎం చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. కేవలం ఎంఓయూలు , పెట్టుబడుల సంతకాలే ధ్యేయం కాకుండా.. అంతర్జాతీయ స్థాయి జ్ఞానాన్ని పంచుకోవడం మీద ఎక్కువ దృష్టి పెట్టాలన్నారు. ఈ సదస్సుల ద్వారా యువతలో సరికొత్త ఆలోచనలను రేకెత్తించాలని, టెక్నాలజీ రంగంలో గ్లోబల్ ఛాంపియన్లుగా ఎదిగేలా గైడెన్స్ ఇవ్వాలని సూచించారు. విదేశీ ప్రతినిధులతో పాటు వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులను కూడా ఈ సదస్సుకు ఆహ్వానించనున్నట్లు తెలిపారు. ప్రాంతీయ స్థాయిలో నిర్వహించే ఈ సదస్సులలో స్టార్టప్ కంపెనీలకు, సరికొత్త ఆవిష్కరణలకు అగ్రతాంబూలం ఇవ్వాలని సీఎం స్పష్టం చేశారు. 'రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్' ఆలోచనలకు ఈ వేదికలు ఊతమివ్వాలని.. నేటి తరం యువత భాగస్వామ్యాన్ని ఇందులో భారీగా పెంచాలని సూచించారు.ఈ ప్రతిష్టాత్మక సమ్మిట్‌ను ప్రపంచవ్యాప్తంగా ప్రమోట్ చేసేందుకు జూలై నుంచి సెప్టెంబర్ వరకు దేశ, విదేశాల్లో భారీగా రోడ్ షోలు నిర్వహించనున్నారు. దేశీయంగా ఢిల్లీ, బెంగళూరు, చెన్నై, ముంబై, కోయంబత్తూర్, అహ్మదాబాద్, హైదరాబాద్ వంటి నగరాల్లో రోడ్ షోలు నిర్వహించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఏయే ప్రాంతాల్లో ఏయే రంగాల పరిశ్రమలకు అనుకూలమైన అవకాశాలు ఉన్నాయో ముందే బేరీజు వేసుకుని.. ఆయా ప్రాంతీయ సదస్సులలోనే నిర్దిష్టమైన ఎంఓయూలు కుదుర్చుకునేలా ఏర్పాట్లు చేయాలని సీఎం దిశా నిర్దేశం చేశారు. అలాగే, అమరావతిలో 'సీఐఐ గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్'ను కూడా ఏర్పాటు చేయబోతున్నట్లు సీఎం ఈ సందర్భంగా వెల్లడించారు.పారిశ్రామిక ప్రగతితో పాటు పబ్లిక్ పాలసీలు, భవిష్యత్ ఫ్యూచరిస్టిక్ రంగాలపై ఈ సదస్సులో కీలక చర్చలు జరగాలని చంద్రబాబు ఆకాంక్షించారు. కేవలం పరిశ్రమలే కాకుండా వ్యవసాయం, ఉద్యానవన రంగం, ప్రకృతి వ్యవసాయం, సర్క్యులర్ ఎకానమీ మరియు నేటి కార్పొరేట్ ప్రపంచానికి అవసరమైన 'స్ట్రెస్ ఫ్రీ వర్క్' వంటి వినూత్న అంశాలపై గ్లోబల్ నిపుణులు, ప్రముఖ యూనివర్సిటీల ప్రొఫెసర్లు చర్చించేలా ప్లాన్ చేయాలన్నారు.

## శంకుస్థాపనలతో సరా 19 ఏళ్లలో మూడోసారి

**కడప,(భారత శక్తి)** వైఎస్సార్ కడప జిల్లా ప్రజల దశాబ్దాల కల అయిన కడప స్టీల్ ప్లాంట్ మరోసారి వార్తల్లోకి వచ్చింది. జూలై 3న ఈ ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ శంకుస్థాపన చేసేందుకు సిద్ధమవుతోంది. అయితే, 2007 నుంచి ఇప్పటివరకు వరుసగా వచ్చిన ముఖ్యమంత్రులంతా శంకుస్థాపనల మీద శంకుస్థాపనలు చేస్తూనే ఉన్నా.. క్షేత్రస్థాయిలో ఒక్క ఇటుక కూడా పడకపోవడంపై రాయలసీమ వాసుల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ సారి వేయబోయే పునాది రాయి అయినా ప్రాజెక్టు పూర్తికి దారితీస్తుందా.. లేక గత చరిత్ర పునరావృతమవుతుందా? అన్న సంశయాలు వ్యక్తమవుతున్నాయి.ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం కడపలో స్టీల్ ప్లాంట్ నిర్మించాల్సిన పూర్తి బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదే. కానీ, విభజన జరిగి పన్నెండేళ్లు గడుస్తున్నా.. ప్రత్యేక హోదా, ఇతర విభజన హామీలతో పాటు కడప స్టీల్ ప్లాంట్‌పై కేంద్రం ఇచ్చిన మాటను పూర్తిగా విస్మరించిందనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయంలో కేంద్రంపై ఒత్తిడి తెచ్చి నిధులు రాబట్టడంలో రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలు విఫలమయ్యాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కేంద్రం చేతులెత్తేయడంతో, రాష్ట్ర ప్రభుత్వమే ఈ భారీ ప్రాజెక్టును మోయాల్సి వస్తోంది. దీంతో రాష్ట్ర ఖజానాపై వేల కోట్ల రూపాయల అదనపు భారం పడుతోంది.కడప స్టీల్ ప్లాంట్ చరిత్రను గమనిస్తే.. ఇదొక శంకుస్థాపనల రికార్డుగా నిలిచిపోతుంది. 2007లో వైఎస్ రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు బ్రాహ్మణి స్టీల్స్ పేరుతో జమ్మలమడుగు వద్ద మొదటిసారి శంకుస్థాపన చేశారు. అది ముందుకు సాగలేదు. విభజన తర్వాత 2018లో అప్పటి సీఎం చంద్రబాబు నాయుడు సున్నిపెంట వద్ద శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత ప్రభుత్వం మారిన వెంటనే 2019 డిసెంబర్‌లో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కడప స్టీల్ ప్లాంట్‌కు మూడోసారి పునాది రాయి వేశారు.ఆయా కంపెనీల బోర్డులు మారడం, శంకుస్థాపనల శిలాఫలకాలు పడటమే తప్ప ప్రాజెక్టు మాత్రం అంగుళం కూడా ముందుకు కదల్లేదు. కడప స్టీల్ ప్లాంట్ విషయంలో ప్రభుత్వాల చిత్తశుద్ధిపై ప్రతిపక్షాలు మరియు ప్రజాసంఘాలు తీవ్రంగా మండిపడుతున్నాయి. రాష్ట్రంలోకి వచ్చే ప్రైవేట్ స్టీల్ ప్రాజెక్టులకు మరియు ఇతర పారిశ్రామిక దిగ్గజాలకు వేల కోట్ల రూపాయల విలువైన భూములు, విద్యుత్, నీటి రాయితీలను గుమ్మరిస్తున్న పాలకులు.. ప్రభుత్వ ఆధ్వర్యంలో జరగాల్సిన కడప స్టీల్ ప్లాంట్‌కు మాత్రం నిధులు కేటాయించడంలో వెనుకాడుతున్నారనే చర్చ నడుస్తోంది. ఇప్పుడు జూలై 3న జరగబోయే శంకుస్థాపన అయినా రాయలసీమ నిరుద్యోగుల ఆశలను నిజం చేస్తుందో, లేక కేవలం ఎన్నికల, రాజకీయ ప్రచార అస్త్రంగానే మిగిలిపోతుందో కాలమే సమాధానం చెప్పాలి.

# వైసీపీ బలమైన స్థానాలే టార్గెట్...

**విశాఖపట్టణం(భారత శక్తి),** అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య రాజకీయ పోటీ రోజురోజుకు మరింత ఆసక్తికరంగా మారుతోంది. ముఖ్యంగా వచ్చే ఆంధ్రప్రదేశ్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రతి పార్టీ తమ బలహీన, బలమైన ప్రాంతాలపై ప్రత్యేకంగా దృష్టి పెడుతోంది. ఈ క్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలమైన నియోజకవర్గంగా భావించే అరకు ఇప్పుడు జనసేన పార్టీ వ్యూహాల్లో కీలక స్థానం సంపాదించిందనే చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది.అరకు ప్రాంతంలో గత కొన్నేళ్లుగా వైసీపీకి బలమైన మద్దతు ఉంది. గిరిజన ఓటర్లలో ఆ పార్టీకి మంచి పట్టుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

అయితే ఇప్పుడు అదే ప్రాంతంలో తన బలాన్ని పెంచుకోవాలని జనసేన భావిస్తున్నట్లు సమాచారం. గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయడం, కొత్త నాయకత్వాన్ని ప్రోత్సహించడం, స్థానిక సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లడం వంటి అంశాలపై ఆ పార్టీ దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది.జనసేన అధినేత పవన్ కళ్యాణ్ రాష్ట్రవ్యాప్తంగా పార్టీ విస్తరణకు ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో అరకు కూడా ప్రత్యేక ప్రాధాన్యం పొందుతోంది. కూటమి రాజకీయాలను దృష్టిలో పెట్టుకుని ప్రతి నియోజకవర్గంలో బలమైన నిర్మాణం అవసరమని పార్టీ నాయకత్వం భావిస్తున్నట్లు సమాచారం. అందుకే స్థానిక కార్యకర్తలను మరింత చురుకుగా పనిచేయాలని సూచనలు ఇస్తున్నారని చెబుతున్నారుఅరకు పార్లమెంట్ పరిధిలో గిరిజన సమస్యలు, రహదారులు, విద్య, వైద్యం, ఉపాధి వంటి అంశాలు ఎప్పుడూ ప్రధాన చర్చగా ఉంటాయి. ఈ సమస్యల పరిష్కారంపై ప్రజల్లో విశ్వాసం కల్పించగలిగితే రాజకీయంగా ప్రయోజనం ఉంటుందని జనసేన అంచనా వేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రజలతో నిరంతర సంబంధాలు కొనసాగించడం ద్వారా తమ ప్రభావాన్ని పెంచుకోవాలని పార్టీ ప్రయత్నాలు చేస్తోందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

ఇక వైసీపీ కూడా తన బలమైన ఓటు బ్యాంకును నిలబెట్టుకోవడానికి కసరత్తు ప్రారంభించినట్లు తెలుస్తోంది. గత ఎన్నికల్లో లభించిన మద్దతును కొనసాగించేందుకు స్థానిక నాయకులు ప్రజలతో మరింత మమేకం అవుతున్నారని సమాచారం. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా తమ ఆధిక్యాన్ని కొనసాగించాలని ఆ పార్టీ ప్రయత్నిస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.రానున్న ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ అరకు రాజకీయాలు మరింత వేడెక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రధాన పార్టీలతో పాటు కూటమి వ్యూహాలు కూడా ఈ ప్రాంత ఎన్నికలపై ప్రభావం చూపే అవకాశం ఉందని భావిస్తున్నారు. ప్రస్తుతం జరుగుతున్న రాజకీయ పరిణామాలు చూస్తే అరకు నియోజకవర్గంలో పోటీ గతంతో పోలిస్తే మరింత ఉత్కంఠభరితంగా మారే సూచనలు కనిపిస్తున్నాయి.అయితే అభ్యర్థుల ఎంపిక, స్థానిక సమీకరణాలు, ఎన్నికల నాటికి మారే రాజకీయ పరిస్థితులు కూడా ఫలితాలపై ప్రభావం చూపే అంశాలుగా ఉంటాయి. అందుకే ఇప్పటి నుంచే అన్ని పార్టీలు తమ తమ వ్యూహాలను అమలు చేస్తూ ప్రజల్లో పట్టు సాధించేందుకు ప్రయత్నిస్తున్నాయి. అరకు వంటి కీలక ప్రాంతాల్లో రాజకీయ పోటీ మరింత ఆసక్తికరంగా మారుతుండటంతో రానున్న రోజుల్లో అక్కడి పరిణామాలు రాష్ట్ర రాజకీయాల్లో కూడా ప్రాధాన్యం సంతరించుకునే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# శ్రీకాళహస్తీశ్వర ఆలయాన్ని సందర్శించిన మంత్రి లోకేష్

**శ్రీకాళహస్తి(భారత శక్తి)** ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీకాళహస్తీశ్వర ఆలయాన్ని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ దర్శించుకున్నారు. ముందుగా ఆలయానికి చేరుకున్న మంత్రి లోకేష్ కు ఆలయ అర్చకులు, ఈవో వెంకటేశ్వర్లు స్వాగతం పలికారు. అనంతరం శ్రీ జ్ఞాన ప్రసూనాంభిక సమేత శ్రీ వాయులింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు మంత్రి నారా లోకేష్ కు ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, ఆలయ ఛైర్మన్ సాయి ప్రసాద్, పలువురు టీడీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా సవరణ ప్రక్రియ ముమ్మరం.

## - హయత్ నగర్ డివిజన్ బూత్ నెం. 287ను సందర్శించిన మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి.



హయత్ నగర్, జూన్ 2 భారత శక్తి: భారత ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి హయత్ నగర్ డివిజన్ పరిధిలోని పోలింగ్ కేంద్రం (బూత్) నెం. 287ను స్థానిక మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి సందర్శించి పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో ప్రస్తుతం కొనసాగుతున్న ఓటర్ల వివరాల నమోదు, మార్పులు మరియు చేర్పుల ప్రక్రియను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ విధుల్లో ఉన్న బూత్ స్థాయి అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదయ్యేలా చొరవ చూపాలని, ప్రజల్లో ఈ ప్రక్రియపై విస్తృత అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.

- "ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఓటూ ఎంతో విలువైనది. అర్హులైన ప్రతి పౌరుడు ఓటరు జాబితాలో తమ పేరును నమోదు చేసుకోవడం ద్వారానే ప్రజాస్వామ్యం బలోపేతమవుతుంది."

కళ్లెం నవజీవన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్

**- కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య నేతలు:**

ఓటరు జాబితా సవరణ పరిశీలన కార్యక్రమంలో నవజీవన్ రెడ్డితో పాటు పలువురు రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు.

- బండారి భాస్కర్ (బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి, ఎల్బీనగర్ నియోజకవర్గ బూత్ స్థాయి ఏజెంట్-1)
- గంగాని శ్రీనివాస్‌లి (డివిజన్ అధ్యక్షుడు)
- సైదమ్మాలి (బీజేపీ బూత్ స్థాయి ఏజెంట్)
- ప్రేమ్‌లి (బీజేపీ యువ మోర్చా నాయకుడు)

ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు మరియు ఓటర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పెద్దిరెడ్డి, చెవిరెడ్డిలతో నెగ్గేదెలా

**తిరుపతి(భారత శక్తి)** వైసీపీ అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో ఉంది. ఆ పార్టీ బలం పుంజుకుంటున్నట్లు చెబుతున్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో పరిస్థితులు మాత్రం అందుకు విరుద్ధంగా ఉన్నాయి. ముఖ్యంగా సీనియర్ల మధ్య పెద్ద వైరం నడుస్తున్నట్లు పొలిటికల్ వర్గాల్లో ప్రచారం ఉంది. ముఖ్యంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన ఇద్దరు నేతల మధ్య ఇప్పుడు విభేదాలు పతాక స్థాయికి చేరినట్లు టాక్ నడుస్తోంది. జగన్మోహన్ రెడ్డి ఆ ఇద్దరు నేతల విషయంలో ఎటు తేల్చుకోలేకపోతున్నట్లు తాడేపల్లి వర్గాలు చెబుతున్నాయి. ఉమ్మడి చిత్తూరు అంటేనే ముందుగా గుర్తొచ్చేది పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి. మొన్నటి ఎన్నికల్లో ఆ జిల్లా నుంచి పెద్దిరెడ్డి కుటుంబ సభ్యులు గెలిచారు. అదే సమయంలో రోజాతో పాటు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి లాంటి వారు ఓడిపోయారు. అయితే అధికారంలో ఉన్నప్పుడు పెద్దిరెడ్డి మాట నడిచేది చిత్తూరు జిల్లాలో. రాయలసీమలో సైతం ఆయన హవా ఉండేది. అటువంటిది ఇప్పుడు ప్రతిపక్షంలోకి వచ్చిన తర్వాత.. పెద్దిరెడ్డి కి వ్యతిరేకంగా చెవిరెడ్డి పావులు కదుపుతున్నట్లు ప్రచారంలో ఉంది.వైయస్సార్ కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు పెద్దిరెడ్డి హవా అంతా ఇంతా కాదు. ఏకంగా కుప్పంలో చంద్రబాబును, హిందూపురంలో బాలకృష్ణను ఓడించేందుకు ఆయన చేయని ప్రయత్నం అంటూ లేదు. అదే సమయంలో సొంత పార్టీ వారు సైతం ఆయన కనుసన్నల్లో ఉండాల్సిందే. లేకుంటే ఇబ్బందికర పరిస్థితులు తప్పేవి కావు. అందుకే అప్పట్లో ఆర్కే రోజాతో పాటు చెవిరెడ్డి లాంటివారు పెద్దిరెడ్డి విషయంలో చాలా గౌరవభావంతో ఉండేవారు. దానికి ప్రధాన కారణం భయం. అయితే ఇప్పుడు వైసీపీ ఓడిపోయిన తర్వాత పెద్దిరెడ్డి విషయంలో వైసీపీ నేతల తీరు మారింది.ప్రధానంగా ఇప్పుడు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తీవ్రంగా విభేదిస్తున్నట్లు తెలుస్తోంది. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు పెద్దిరెడ్డి రాయలసీమను చూసేవారు. ఆయన కుమారుడు మిథున్ రెడ్డి జగన్మోహన్ రెడ్డి వెంట నిత్యం తాడేపల్లి కార్యాలయంలోనే ఉండేవారు. కానీ ఇప్పుడు మద్యం కుంభకోణం కేసు పుణ్యమా అని జగన్మోహన్ రెడ్డి విషయంలో పెద్దిరెడ్డి వైఖరి మారినట్లు ప్రచారంలో ఉంది. అదే సమయంలో తాడేపల్లి లో చేరారు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి. పెద్దిరెడ్డి ఫ్యామిలీ విషయంలో జగన్ చెవిరెడ్డి ఇస్తున్న సమాచారాన్ని నమ్ముతున్నారని పొలిటికల్ వర్గాల్లో ఒక ప్రచారం సాగుతోంది. దీంతో ఆ ఇద్దరు నేతల మధ్య విభేదాలు పతాక స్థాయికి చేరాయని.. ఆ ఇద్దరు నేతలను సర్ది చెప్పలేక జగన్మోహన్ రెడ్డి బాధపడుతున్నట్లు ప్రచారంలో ఉంది. మరి ఇందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి.

# బీజేపీలో నెక్స్ జన్ లీడర్ షిప్...

**న్యూఢిల్లీ,(భారత శక్తి)** భారతీయ జనతా పార్టీ లో ఊహించని రీతిలో సమూల ప్రక్షాళనకు తెరలేచింది. కేవలం కేంద్ర మంత్రివర్గంలోనే కాదు.. అటు పార్టీ సంస్థాగత నిర్మాణంలోనూ పెను మార్పులు తీసుకురావాలని ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాల ద్వయం గట్టి పట్టుదలతో ఉన్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా ప్రధాని మోదీ, అమిత్ షాల తర్వాత ఢిల్లీ బీజేపీలో అత్యంత శక్తివంతమైన చక్రం తిప్పుతున్న జాతీయ సంస్థాగత ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్ ను ప్రస్తుత బాధ్యతల నుంచి పక్కన పెట్టే ఆలోచనలో అధిష్ఠానం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. సుదీర్ఘ కాలంగా పార్టీ అంతర్గత వ్యవహారాలను, టికెట్ల కేటాయింపులను, ఎన్నికల వ్యూహాలను శాసిస్తున్న ఆయనను తిరిగి రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ మాతృ సంస్థకు పంపేందుకు తెరవెనుక ముమ్మర కసరత్తు జరుగుతోందని ఢిల్లీ రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది.బీఎల్ సంతోష్ ను మార్చడం కేవలం ఒక వ్యక్తిని మార్చడం కాదు, ఇది రాబోయే 15-20 ఏళ్ల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని బీజేపీ వేస్తున్న ఒక చారిత్రాత్మక అడుగు. ప్రస్తుతం 70 ఏళ్ల వయస్సుకు చేరువవుతున్న సీనియర్ నేతల స్థానంలో, సాంకేతికతపై పట్టు ఉండి, మారుతున్న యువ భారతదేశ ఓటర్ల నాడిని పట్టుకోగల నెక్స్ట్ జనరేషన్ లీడర్లను కీలక స్థానాల్లో కూర్చోబెట్టాలని మోదీ-షా భావిస్తున్నారు. పార్టీని తదుపరి తరానికి సజావుగా పాస్ చేసే ప్రక్రియలో భాగంగానే ఈ సంస్థాగత శస్త్రచికిత్సకు శ్రీకారం చుట్టారని ఎక్స్‌పర్ట్స్ అభిప్రాయపడుతున్నారు. ఆర్ఎస్ఎస్ ప్రచారక్ కోటా నుండి వచ్చి బీజేపీ జాతీయ సంఘటనా కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన బీఎల్ సంతోష్.. పార్టీలో అత్యంత కఠినమైన నిర్ణయాలు తీసుకునే వ్యక్తిగా పేరు తెచ్చుకున్నారు. అయితే, గత కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో యడియూరప్ప లాంటి మాస్ లీడర్లను కాదని ఆయన అనుసరించిన కొన్ని క్షేత్రస్థాయి వ్యూహాలు పార్టీని ఘోరంగా దెబ్బతీశాయనే అసంతృప్తి అధిష్ఠానంలో బలంగా నాటుకుపోయింది. సౌత్ ఇండియాలో బిగ్గెస్ట్ గేట్‌వే అయిన కర్ణాటకను చేజార్చుకోవడం, అలాగే కొన్ని ఉత్తరాది రాష్ట్రాలలో టికెట్ల పంపిణీలో లోపాలు ఉండటం వల్లే పార్టీ ఆశించిన మెజారిటీని సొంతంగా సాధించలేకపోయిందనే ఇంటెలిజెన్స్ నివేదికలు మోదీ-షాలకు చేరినట్లు తెలుస్తోంది. దీంతో ఆర్గనైజేషనల్ స్ట్రక్చర్‌లో సరికొత్త రక్తాన్ని ఎక్కించక తప్పదని ఢిల్లీ పెద్దలు డిసైడ్ అయ్యారు. బీజేపీ లేదా సంఘ్ పరివార్ వ్యూహాల్లో జాతీయ సంస్థాగత ప్రధాన కార్యదర్శి పదవి అత్యంత శక్తివంతమైనది. ఈ స్థానంలో ఉన్న వ్యక్తి నేరుగా ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయానికి, బీజేపీ అధినాయకత్వానికి మధ్య ఒక బలమైన వంతెనలా పనిచేస్తారు. పార్టీ జాతీయ అధ్యక్షుడి కంటే కూడా అంతర్గత నియామకాలు, క్రమశిక్షణ చర్యలు, రాష్ట్రాల ఇన్‌ఛార్జ్‌ల నివేదికలపై ఈ పదవిలో ఉన్న వ్యక్తికే ఎక్కువ పట్టు ఉంటుంది. గతంలో కుశభావ్ ఠాక్రే, ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా, ఆ తర్వాత సంజయ్ జోషి, రామ్ లాల్ వంటి దిగ్గజాలు పనిచేసిన ఈ స్థానంలో మార్పు జరుగుతోందంటే.. పార్టీ సిద్ధాంత పరంగా, శైలి పరంగా చాలా పెద్ద మలుపు తిరగబోతోందని అర్థం. ఇటీవలి కాలంలో ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ తదితర ప్రముఖులు చేసిన కొన్ని వ్యాఖ్యలు, బీజేపీ అంతర్గత అంశాలపై విమర్శలు చేశారు. క్షేత్రస్థాయిలో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు , బీజేపీ నేతల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపించింది. బీఎల్ సంతోష్ హయాంలో సంఘ్‌కు, పార్టీకి మధ్య ఒక విధమైన కోల్డ్ వార్ నడిచిందనే ప్రచారం కూడా ఉంది. ఇప్పుడు సంతోష్‌ను తిరిగి ఆర్ఎస్ఎస్‌కు పంపి, ఇరు వర్గాలకు ఆమోదయోగ్యుడైన సరికొత్త, సౌమ్యుడైన వ్యూహకర్తను ఆ స్థానంలో పెట్టడం ద్వారా ఆర్ఎస్ఎస్ కార్యకర్తలను మళ్లీ ఎన్నికల పోరాటాల్లో యాక్టివ్ చేయాలని మోదీ భావిస్తున్నారు. మొత్తానికి మోదీ 3.0 ప్రభుత్వ హయాంలో అటు కేబినెట్, ఇటు పార్టీ ఐడెంటిటీని పూర్తిగా మార్చేసే లాంగ్ టర్మ్ ప్లాన్ అమలవుతోంది కీలకమైన ప్రధాన కార్యదర్శుల మార్పుల ద్వారా సరికొత్త టీమ్ మోదీ రూపుదిద్దుకోనుంది. పాత సంకెళ్లను తెంచుకుని, కేవలం పనితీరు, గెలుపు గుర్రాలకే ప్రాధాన్యత ఇస్తూ బీజేపీ చేయబోతున్న ఈ మహా ప్రక్షాళన.. మిగిలిన రాజకీయ పార్టీలకు కూడా ఒక పెద్ద సంకేతాన్ని పంపుతోంది.

# ఈ టీ తాగితే పీరియడ్స్

## - నొప్పి మాయం అవుతుంది..!



హార్మోన్లు శరీరంలో సమతుల్యతలో ఉండాలి. ఇవి అసమతుల్యతగా మారితే మానసిక ఒత్తిడి, పీరియడ్స్ సమయంలో సమస్యలు, శరీరంలో వాపు వంటి సమస్యలు వస్తాయి. అయితే మన వంటింట్లో ఉండే కొన్ని సహజ పదార్థాలు ఈ హార్మోన్లను సమతుల్యంలో ఉంచడంలో చాలా ఉపయోగపడతాయి. పసుపులో మంట తగ్గించే గుణాలు ఎక్కువగా ఉంటాయి. ఈ గుణాలు శరీరంలోని హార్మోన్ల స్థాయిని నియంత్రించడంలో సహాయపడతాయి. పీరియడ్స్ సమయంలో వచ్చే తిమ్మిరి వంటి సమస్యలు తగ్గుతాయి. రోజువారీ ఆహారంలో పసుపు వేసి తింటే మంచి ఫలితం కనిపిస్తుంది. అల్లం కూడా మంట తగ్గించే గుణాలను కలిగి ఉంటుంది. శరీరంలో ఉన్న మంటను తక్కువ చేస్తుంది. పీరియడ్స్ సమయంలో వచ్చే తిమ్మిరిని తగ్గించడంలో అల్లం మంచి పాత్ర పోషిస్తుంది. రోజూ అల్పాహారంలో లేదా టీగా తీసుకుంటే హార్మోన్లు సమతుల్యంలో ఉంటాయి. దాల్చిన చెక్క రక్తంలో చక్కెర స్థాయిని కంట్రోల్ చేస్తుంది. దీని వల్ల హార్మోన్ల స్థాయి కూడా సమంగా ఉంటుంది. దీనిలో కూడా మంట తగ్గించే గుణాలు ఉంటాయి. దీనిని టీలో వేసి తీసుకోవచ్చు లేదా ఇతర వంటకాలలో ఉపయోగించవచ్చు. అవిసె గింజల్లో ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్, ఫైటో ఈస్ట్రోజెన్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి హార్మోన్ల సమతుల్యతకు చాలా అవసరం. ఓట్స్ లేదా మజ్జిగలో కలిపి తీసుకుంటే ఆరోగ్యానికి మంచిది.వెల్లుల్లిలో అల్లిసిన్ అనే సహజ సమ్మేళనం ఉంటుంది. ఇది శరీరంలో వాపును తగ్గిస్తుంది. వెల్లుల్లి తినడం ద్వారా హార్మోన్లు స్థిరంగా ఉంటాయి. దీనితో పాటు రోగనిరోధక శక్తిని కూడా పెంచుతుంది. పీరియడ్స్ సమయంలో వచ్చే నొప్పిని తగ్గించాలంటే మెంతులు చాలా ఉపయోగపడతాయి. మెంతి గింజలు, మెంతి టీ రూపంలో తీసుకుంటే హార్మోన్లు సమతుల్యంలో ఉంటాయి. ఉదయం ఖాళీ పొట్ట మీద మెంతి టీ తాగితే మంచి ఫలితం ఉంటుంది.ఒత్తిడిని తగ్గించడంలో అశ్వగంధ సహకరిస్తుంది. ఇది శరీరంలో అడ్రినల్ గ్రంథి పనితీరును మెరుగుపరుస్తుంది. దీనివల్ల హార్మోన్లు సమతుల్యంలోకి వస్తాయి. అశ్వగంధను పౌడర్ లేదా క్యాప్సూల్ రూపంలో తీసుకోవచ్చు.జీలకర్రలో పోషకాలు ఎక్కువగా ఉంటాయి. ఇందులో ఉన్న లక్షణాలు మంట తగ్గించి జీర్ణవ్యవస్థకు ఉపయోగపడుతుంది. జీలకర్ర టీ తాగడం వల్ల హార్మోన్ల సమతుల్యతకు సహాయమవుతుంది. తేనెలో ఎన్నో రకాల పోషకాలు ఉంటాయి. తేనె మంటను తగ్గించడంలో సహాయపడుతుంది.

# పొద్దున్నే బాదం తింటే

## బ్రెయిన్ షార్ప్ అవుతుందట..?




ప్రతి రోజు ఉదయం ఖాళీ కడుపు తో నానబెట్టిన బాదం పప్పులు తినడం వల్ల చాలా ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఇంటి పెద్దలు తరచుగా పిల్లలకి ఉదయం ఖాళీ కడుపుతో నానబెట్టిన బాదం పప్పులు తినమని చెప్తారు. దీనిలో విటమిన్ ఇ, ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలు, యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి మెదడును బలపరిచే పనిలో ఉంటాయి. జ్ఞాపకశక్తి పెరిగేలా సహాయం చేస్తాయి. జీర్ణక్రియ కూడా మెరుగుపడుతుంది. అంతే కాదు బాదం పప్పులు తినడం వల్ల శరీర బరువు నియంత్రణలో కూడా సహాయం లభిస్తుంది.

నానబెట్టిన బాదం పప్పుల్లో ఉండే ఎంజైమ్ లు జీర్ణక్రియను సులభతరం చేస్తాయి. ఈ పప్పులు తినడం వల్ల చర్మం సాఫీగా, మృదువుగా మారుతుంది. అందువల్ల శరీరంలో పోషకాలు బాగా శోషించబడతాయి. బాదం పప్పులో ఉండే మోనోషాచురేటెడ్ కొవ్వులు, విటమిన్ ఇ చెడు కొలెస్ట్రాల్ తగ్గించే పనిలో ఉంటాయి. దీని వల్ల గుండె జబ్బులు వచ్చే ప్రమాదం తగ్గుతుంది. గుండె కూడా బలంగా తయారవుతుంది. బాదంలో రిబోఫ్లేవిన్, ఎల్ కార్నిటైన్ ఉండటం వల్ల మెదడు శక్తి పెరుగుతుంది. జ్ఞాపకశక్తి మెరుగవుతుంది. పక్కా శక్తితో మెదడు పనిచేస్తుంది.నానబెట్టిన బాదం పప్పుల్లో ఫైబర్, ప్రోటీన్ ఎక్కువగా ఉంటాయి. ఇవి ఆకలిని తగ్గించే పనిలో ఉంటాయి. అందువల్ల ఎక్కువ తినకుండా బరువు తగ్గడంలో ఇది సహాయకరంగా ఉంటుంది. బాదంలో విటమిన్ ఇ , యాంటీఆక్సిడెంట్లు చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. చర్మం ప్రకాశవంతంగా మారుతుంది. ముడతలు తగ్గే అవకాశం ఉంది.నానబెట్టిన బాదం పప్పుల్లో మాంగనీస్, రాగి ఎక్కువగా ఉంటాయి.


ఇవి శరీరంలో శక్తిని నిలుపుకోవడంలో సహాయం చేస్తాయి. రోజువారీ కష్టపడి పనిచేయడానికి శక్తి అవసరం. బాదం తినడం వల్ల శరీరానికి కావాల్సిన శక్తి వస్తుంది.బాదంలో కాల్షియం, మెగ్నీషియం కూడా ఉంటాయి. ఇవి ఎముకలను బలపరిచే పనిలో ఉంటాయి. అస్టియో ఆర్థరైటిస్ వంటి ఎముకల వ్యాధులను దూరంగా ఉంచుతాయి. ఎముకలు బలంగా ఉంటే కదలిక సులభం అవుతుంది. ఈ విధంగా ప్రతిరోజు ఉదయం ఖాళీ కడుపుతో నానబెట్టిన బాదం పప్పులు తినడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. మెదడు, గుండె, చర్మం, ఎముకలు బలపడతాయి. బరువు కూడా అదుపులో ఉంటుంది.

# యాపిల్ కన్నా 10 రెట్లు

## ఎక్కువ ప్రయోజనాలు..



మనం ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతిరోజూ మంచి పోషకాహారాన్ని తీసుకోవాలి. చాలా మంది ఆరోగ్యానికి మంచిదని యాపిల్ వంటి పండ్లను తింటారు. అయితే కొందరికి ప్రత్యేక ఔషధ గుణాలున్న ఆకుల గురించి పెద్దగా తెలియకపోవచ్చు. అలాంటి అద్భుతమైన మొక్కల్లో కర్పూరవల్లి (పనికూర/వాము ఆకు) ఒకటి. ఇది సాధారణంగా కనిపించేదే అయినా.. దీనిలోని ఆరోగ్య ప్రయోజనాలు మాత్రం చాలా గొప్పవి. కర్పూరవల్లి ఆకు మన ఆరోగ్యాన్ని మెరుగుపరిచే అనేక గుణాలు కలిగి ఉంటుంది. ఈ ఆకులను ప్రతిరోజూ తీసుకోవడం ద్వారా శరీరానికి అద్భుతమైన లాభాలు పొందవచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఈ ఆకుల్లో ఉండే యాంటీఆక్సిడెంట్ల మోతాదు యాపిల్ కంటే 10 రెట్లు ఎక్కువగా ఉంటుంది. అంటే రోజుకు నాలుగు కర్పూరవల్లి ఆకులు తినడం ఒక యాపిల్ తినడంతో సమానమైన ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. ఈ ఆకులు శరీరంలోని జీవక్రియను ప్రేరేపించి.. శక్తిని పెంచుతాయి. దీని వల్ల జీర్ణవ్యవస్థ సరిగ్గా పనిచేస్తుంది. నాలుగు కర్పూరవల్లి ఆకులను కొంచెం వేడి చేసి వాటి రసం తీసి తేనె కలిపి తీసుకోవడం వల్ల పొడి దగ్గుకు ఉపశమనం లభిస్తుంది. ఈ మిశ్రమాన్ని ఖాళీ కడుపుతో 48 రోజులు తీసుకుంటే మంచి ఫలితం కనిపిస్తుంది. మధుమేహంతో బాధపడేవారు తేనె మినహాయించాలి. రాత్రి పడుకునే ముందు రెండు ఆకులను నమలడం.. తర్వాత వేడి నీరు త్రాగడం వల్ల గ్యాస్ సమస్య తగ్గుతుంది. పీరియడ్స్ నొప్పితో బాధపడే మహిళలు ఉదయం 6 గంటలకు ఈ ఆకులను నమలితే నొప్పి తగ్గుతుంది.ఊబకాయం సమస్య ఉన్నవారు రోజుకు మూడు సార్లు ఈ ఆకులను తింటే శరీరంలోని.. ముఖ్యంగా బొడ్డులో ఉండే కొవ్వు కరుగుతుంది. కర్పూరవల్లి ఆకులు సాధారణంగా ఆకుపచ్చ రంగులో, ప్రత్యేకమైన వాసనతో ఉంటాయి. ఇవి రుచికరమైనవి కాకపోయినా.. ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఈ ఆకులను నేరుగా నమలవచ్చు లేదా కొంచెం వేడి చేసి ఉపయోగించవచ్చు. సువాసనతో కూడిన ఈ ఆకులు జలుబు, దగ్గు వంటి శ్వాస సంబంధిత ఇన్ఫెక్షన్లకు కూడా సహాయపడతాయి. ఈ ఆకులను రోజూ తీసుకోవడం వల్ల సాధారణంగా ఎటువంటి తీవ్రమైన సైడ్ ఎఫెక్ట్స్ కనిపించవు. అయినప్పటికీ.. మీరు ఏవైనా ప్రస్తుత ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లయితే, వైద్యుడి సలహాతోనే వాడటం ఉత్తమం. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ముందుగా వైద్య సలహా తీసుకోవాలి.



# ఆ సమస్యలకు రామబాణం

శొంఠి పొడి (ఎండిన అల్లం పొడి) భారతీయ వంటకాల్లో, ఆయుర్వేదంలో చాలా కాలం నుండి ఉపయోగిస్తున్న ఒక ముఖ్యమైన మసాలా దినుసు. దీనిని ఆహారానికి రుచి, సువాసన ఇవ్వడానికి ఉపయోగిస్తారు. అంతేకాకుండా, దీనికి అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉండటం వల్ల ఆయుర్వేద వైద్యంలో దీన్ని విస్తృతంగా వాడతారు. ఆయుర్వేదంలో ఈ పొడిని అనేక రోగాల చికిత్సకు, నివారణకు ఉపయోగిస్తారు. కూరలు, పచ్చళ్లు, టీ, సూప్‌లు, స్వీట్లు, బేకరీ వస్తువులలో సుగంధ ద్రవ్యంగా వాడతారు. ఇది ఆహారానికి ఘాటైన రుచిని ఇస్తుంది. జలుబు, దగ్గు, జీర్ణ సమస్యలు వంటి వాటికి ఇంటి చిట్కాగా వాడతారు. శొంఠి టీ, మజ్జిగలో కలిపి తాగడం వంటివి సాధారణం. శొంఠి పొడిలో ఉండే జింజెరోల్స్, షాగోల్స్ వంటి క్రియాశీలక సమ్మేళనాలు దీనికి అనేక ఔషధ గుణాలను అందిస్తాయి. శొంఠి వల్ల కలిగే ప్రధాన ఆరోగ్య ప్రయోజనాలు ఇక్కడ ఉన్నాయి: జీర్ణక్రియ మెరుగుపరుస్తుంది: శొంఠి జీర్ణ ఎంజైమ్‌ల ఉత్పత్తిని పెంచి, ఆహారం త్వరగా జీర్ణం అయ్యేలా చేస్తుంది. అజీర్ణం, కడుపు ఉబ్బరం, గ్యాస్, మలబద్ధకం వంటి సమస్యల నుండి ఉపశమనం కలిగిస్తుంది. పరగడుపున గోరువెచ్చని నీటిలో శొంఠి పొడి, తేనె కలిపి తీసుకుంటే ఈ సమస్యలు తగ్గుతాయి. జలుబు, దగ్గు, గొంతు నొప్పి నివారిణి: శొంఠిలో ఉండే యాంటీ వైరల్, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు జలుబు, దగ్గు, గొంతు నొప్పి, ఆయాసం వంటి శ్వాసకోశ సమస్యలను తగ్గించడంలో సహాయపడతాయి. ముఖ్యంగా వర్షాకాలంలో దీని వాడకం చాలా మంచిది. రోగనిరోధక శక్తిని పెంచుతుంది: ఇందులో ఉండే యాంటీఆక్సిడెంట్లు శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచి, ఇన్ఫెక్షన్ల నుండి రక్షిస్తాయి. వేడి పాలల్లో శొంఠి పొడి కలిపి తాగడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. నొప్పులు, వాపులు తగ్గిస్తుంది (యాంటీ ఇన్ఫ్లమేటరీ): శొంఠికి సహజసిద్ధమైన యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు ఉన్నాయి. ఇది కీళ్ల నొప్పులు, కండరాల నొప్పులు, వాపులు తగ్గించడంలో సహాయపడుతుంది. ఆర్థరైటిస్ వంటి సమస్యలకు కూడా ఉపశమనం ఇస్తుంది. వికారం, వాంతులు తగ్గిస్తుంది: మార్నింగ్ సిక్‌నెస్, మోషన్ సిక్‌నెస్, లేదా కీమోథెరపీ కారణంగా వచ్చే వికారం, వాంతులను తగ్గించడంలో శొంఠి చాలా ప్రభావవంతంగా పనిచేస్తుంది. బరువు తగ్గడంలో సహాయపడుతుంది: శొంఠి జీవక్రియ రేటును (మెటబాలిజం) పెంచి, శరీరంలోని కొవ్వును కరిగించడానికి సహాయపడుతుంది. ఇది ఆకలిని నియంత్రించి, బరువు తగ్గడంలో దోహదపడుతుంది. గోరువెచ్చని నీటిలో శొంఠి పొడి కలిపి తాగడం వల్ల ఈ ప్రయోజనం కలుగుతుంది. కొలెస్ట్రాల్ నియంత్రణ: రక్తంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో శొంఠి సహాయపడుతుంది, తద్వారా గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది.

రక్తంలో చక్కెర స్థాయిల నియంత్రణ: కొన్ని అధ్యయనాల ప్రకారం, శొంఠి రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది, ఇది డయాబెటిస్ ఉన్నవారికి లేదా ప్రీడయాబెటిస్ ఉన్నవారికి ప్రయోజనకరంగా ఉంటుంది.

శరీరానికి వేడిని ఇస్తుంది: శొంఠి స్వభావరీత్యా వేడిని పుట్టిస్తుంది, కాబట్టి చలికాలంలో లేదా శరీరంలో చల్లదనం ఎక్కువగా ఉన్నప్పుడు ఇది చాలా ఉపయోగపడుతుంది. ఈ ప్రయోజనాలను పొందడానికి శొంఠి పొడిని వివిధ మార్గాల్లో (టీ, నీళ్లు, తేనెతో కలిపి లేదా వంటకాల్లో) వాడవచ్చు. అయితే, ఏదైనా ఆరోగ్య సమస్యలకు చికిత్సగా దీన్ని

# యూరిక్ యాసిడ్

## ఎక్కువై ఇబ్బంది పడుతున్నారా..?



ప్రస్తుత రోజుల్లో చాలా మందిని వేధించే ఆరోగ్య సమస్యలలో యూరిక్ యాసిడ్ పెరగడం ఒకటి. ఇది చిన్న సమస్యలా అనిపించినా.. దీర్ఘకాలంలో తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీయగలదు. ముఖ్యంగా కీళ్ల నొప్పులు, వాపులు, కాళ్ళు చేతులు నొప్పించడం వంటి సమస్యలు ఈ స్థితికి సంబంధించినవే. శరీరంలో ప్యూరిన్ అనే పదార్థం విచ్ఛిన్నమైనప్పుడు యూరిక్ యాసిడ్ అనే వ్యర్థ పదార్థం ఏర్పడుతుంది. ఇది సాధారణంగా మూత్రం ద్వారా బయటకు వెళుతుంది. కానీ శరీరం సరిగా దీన్ని బయటకు పంపకపోతే అది రక్తంలో చేరి కీళ్లలో చేరుతుంది. దీనితో కీళ్లలో వాపు, నొప్పి, నడవలేకపోవడం వంటి ఇబ్బందులు వస్తాయి. ఈ పరిస్థితిని సహజంగా నియంత్రించాలంటే కొన్ని రకాల ఆహార పదార్థాలు ఎంతో ఉపయోగపడతాయి. వాటిలో ముఖ్యంగా పచ్చి బొప్పాయి ముందు వరుసలో ఉంటుంది. ఇందులో విటమిన్ ఎ, సి, మెగ్నీషియం, కాల్షియం, ఫైబర్ వంటి ఎన్నో పోషకాలున్నాయి. ఇవి శరీరాన్ని శుద్ధి చేయడంలో, అంతర్గతంగా వ్యర్థాలను తొలగించడంలో మెరుగైన పనితీరును చూపిస్తాయి.యూరిక్ యాసిడ్ స్థాయిని తగ్గించేందుకు బొప్పాయిని కషాయంగా తయారు చేసి తీసుకోవడం చాలా మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. ఇది శరీరానికి తేలికగా జీర్ణమై, రక్తాన్ని శుద్ధి చేసే ప్రక్రియను వేగవంతం చేస్తుంది. బొప్పాయి కషాయాన్ని తయారు చేయడం చాలా సులువు. తాజా పచ్చి బొప్పాయిని చిన్న ముక్కలుగా కట్ చేసి ఒక గిన్నెలో ఒక గ్లాసు నీరు వేసి.. అందులో ఈ ముక్కలను సుమారు 5 నిమిషాలు మరిగించాలి. మరిగిన తర్వాత వాటిని మిక్సీలో వేసి మెత్తగా రుబ్బాలి. ఆ రసాన్ని వడగట్టి ఒక కప్పులోకి పోసి చిటికెడు రాతి ఉప్పు కలిపి ఉదయం ఖాళీ కడుపుతో తాగితే మంచిది. ఇది యూరిక్ యాసిడ్ ను సహజంగా నియంత్రించడంలో సహాయపడుతుంది.ఈ ప్రక్రియను వారంలో మూడుసార్లు అనుసరిస్తే మంచి ఫలితాలు కనిపిస్తాయి. అయితే దీన్ని వైద్యుల సలహా మేరకు తీసుకోవడం ఉత్తమం. ఎప్పటికప్పుడు యూరిక్ యాసిడ్ స్థాయిలను పరీక్షించుకుంటూ.. ఆహారం జీవనశైలి మార్పులు చేసుకుంటే ఈ సమస్యను అదుపులో ఉంచవచ్చు.పచ్చి బొప్పాయితో తయారైన ఈ కషాయం ఆరోగ్యానికి మేలు చేయడమే కాకుండా వ్యర్థ పదార్థాల తొలగింపులో సహాయపడుతుంది.

# బ్లాక్ కాఫీలో నిమ్మరసం

## కలిపి తాగితే..?



బ్లాక్ కాఫీ తో నిమ్మరసం కలిపి తాగడం వల్ల బరువు తగ్గడానికి సహాయపడుతుందా.. అనే ప్రశ్న కు సమాధానాన్ని ఇప్పుడు తెలుసుకుందాం. ఇలా చేయడం వల్ల శరీరంలో కొవ్వును తగ్గించే ప్రక్రియ వేగవంతం అవడమే కాకుండా.. జీర్ణ వ్యవస్థ కూడా మెరుగుపడుతుంది. బ్లాక్ కాఫీలో ఉండే కెఫిన్, నిమ్మరసంలో ఉన్న విటమిన్ సి రెండూ కలిసి శరీరంలో కొవ్వు కరిగించే ప్రక్రియను వేగవంతం చేస్తాయి. ఇది బరువు తగ్గడంలో సహాయకారి అవుతుంది. శరీరం వేగంగా పని చేస్తే కేలరీలు త్వరగా ఖర్చయ్యే అవకాశం ఎక్కువ ఉంటుంది. కాఫీకి ఆస్ట్రిజెంట్ అనే లక్షణం ఉంటుంది. ఇది జీర్ణక్రియను సక్రియం చేయడంలో సహాయపడుతుంది. నిమ్మరసం కడుపులో పుల్లని రుచి కలిగి ఉండి, మలబద్ధకం, ఉబ్బరం, గ్యాస్ వంటి సమస్యలు తట్టుకోవడంలో సహకరిస్తుంది. కాబట్టి బ్లాక్ కాఫీతో నిమ్మరసం తాగితే కడుపు శుభ్రంగా, నిదానంగా ఉంటుంది.ప్రతి ఉదయం బ్లాక్ కాఫీకి నిమ్మరసం కలిపి తాగడం వల్ల శరీరం చురుకుగా మారుతుంది. ఇది మనోస్థితిని మెరుగుపరచడమే కాకుండా.. ఆలోచనలు కూడా తేలికగా ఉంటాయి. అలసట, నిరాశ వంటి భావాలు తగ్గిపోతాయి. అందువల్ల రోజంతా ఉత్సాహంగా ఉండటానికి ఇది ఉపయోగపడుతుంది.నిమ్మరసంలో యాంటీఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. అవి చర్మంలోని దూషిత పదార్థాలను తొలగించి చర్మాన్ని సున్నితంగా, ప్రకాశవంతంగా చేస్తాయి. బ్లాక్ కాఫీ కూడా శుభ్రపరిచే లక్షణం కలిగి ఉండటంతో చర్మం బాగుంటుంది. కాఫీతో నిమ్మరసం కలిసి చర్మానికి ఆరోగ్యం ఇస్తాయి. నిమ్మరసంలోని విటమిన్ సి శరీర రోగ నిరోధక వ్యవస్థను బలపరుస్తుంది. కాఫీలో ఉండే యాంటీఆక్సిడెంట్లు శరీరానికి ఇన్ఫెక్షన్లు తట్టుకునే శక్తిని కలిగిస్తాయి. ఈ రెండు కలిపితే మీరు జ్వరాలు, జలుబులు వంటి వ్యాధులు ఎదుర్కోవడంలో బలం పొందగలుగుతారు. కొన్ని సందర్భాలలో నిమ్మరసం కలిపిన బ్లాక్ కాఫీ తాగడం వల్ల మైగ్రేన్ వేదనకు ఉపశమనం లభిస్తుంది. తలనొప్పులు తక్కువగా వచ్చేవిధంగా ఇది సహాయం చేస్తుంది. వ్యాయామానికి ముందు బ్లాక్ కాఫీకి నిమ్మరసం కలిపి తాగితే శక్తి ఎక్కువగా ఉంటుంది. దీని వల్ల మీరు ఎక్కువ సమయం చురుకుగా ఉండవచ్చు. శరీరం ఎక్కువ కేలరీలను దహనం చేయడంలో సహాయపడుతుంది.

# సినీ నటుడు ఘట్టమనేని జయకృష్ణ ను కలిసిన నరసరావుపేట సూపర్ స్టార్ కృష్ణ అభిమానులు



**నరసరావుపేట** సూపర్ స్టార్ కృష్ణ మనవడు రమేష్ బాబు కుమారుడు ఘట్టమనేని జయకృష్ణ హీరో గా నటిస్తున్న మొదటి చిత్రం " శ్రీనివాస మంగాపురం" జూలై 30 వ తేదీన విడుదల సందర్భంగా "హైదరాబాద్" లోని సారథి స్టూడియోస్ లో ఘట్టమనేని అభిమానుల ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హీరో జయకృష్ణ పాల్గొని తను నటించిన" శ్రీనివాస మంగాపురం" చిత్రాన్ని ఆదరించి, విజయవంతం చేయాలని అభిమానులను కోరారు. అలాగే మును ముందు మరిన్ని మంచి చిత్రాలలో నటించుటకు అవకాశం మరియు మీ సహాయ సహకారాలు అవసరమని తెలియజేశారు. ఈ సందర్భంగా తన తాతయ్య సూపర్ స్టార్ కృష్ణ ను, తన తండ్రి రమేష్ బాబు ను గుర్తు చేసుకున్నారు. తన బాబాయ్ యూనివర్సల్ సూపర్ స్టార్ మహేష్ బాబు ప్రోత్సహం, ఆశీస్సులు తనకు ఎల్లప్పుడూ ఉంటాయని తెలియజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన" ఘట్టమనేని అభిమానుల ఆత్మీయ సమావేశం" లో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ , తెలంగాణ రాష్ట్ర హీరో కృష్ణ సీనియర్ అభిమాన సంఘనీ నాయకులు జి. జితేంద్రకుమార్, డి. రాంబాబు, ఎండీ. ఖాదర్ గోరి మరియు నరసరావుపేట కృష్ణ మహేష్ బాబు అభిమానుల సంఘం పట్టణ అధ్యక్షులు ఎండీ . ఫారూఖ్ బాబు, ఎస్ కె.అబ్దుల్ సలాం, ఎండీ. పర్వేజ్ చిష్తి, బి. కొండలరావు, పి.వెంకటరావు, జి.కోటేశ్వరరావు, ఫోటో గ్రాఫర్


# ఓటీటీలోకి హాలీవుడ్ బ్లాక్‌బస్టర్...

## 'ప్రాజెక్ట్ హెయిల్ మేరీ' స్ట్రీమింగ్ ఎప్పుడంటే..!



ఈ ఏడాది బాక్సాఫీస్ వద్ద సంచలన విజయం సాధించిన హాలీవుడ్ సైన్స్ ఫిక్షన్ కామెడీ చిత్రం 'ప్రాజెక్ట్ హెయిల్ మేరీ' ఇప్పుడు డిజిటల్ ప్రీమియర్‌కు సిద్ధమైంది. ప్రముఖ హాలీవుడ్ నటుడు ర్యాన్ గోస్లింగ్ ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రం, జులై 3 నుంచి అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ కానుంది. ఈ మేరకు ప్రైమ్ వీడియో అధికారికంగా ఒక ప్రమోషనల్ వీడియోను కూడా విడుదల చేసింది. ఫిల్ లార్డ్, క్రిస్టోఫర్ మిల్లర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఈ ఏడాది మార్చిలో విడుదలైంది. ప్రపంచవ్యాప్తంగా బాక్సాఫీస్ వద్ద రూ. 6,000 కోట్లకు పైగా వసూళ్లు సాధించి ఈ సినిమా ట్రేడ్ వర్గాలను సైతం విస్మయానికి గురిచేసింది. భారత్‌లో వసూళ్ల పరంగా 'ఇంటర్‌స్టెల్లార్', 'డూన్ 2' వంటి భారీ చిత్రాలను అధిగమించడం విశేషం. గతేడాది విడుదలైన 'అవతార్: ఫైర్ అండ్ యాష్' తర్వాత మన దేశంలో అత్యధిక వసూళ్లు రాబట్టిన అంతర్జాతీయ చిత్రంగా ఇది రికార్డు సృష్టించింది. మానవాళిని కాపాడే క్రమంలో ఒక వ్యోమగామి ఒంటరిగా అంతరిక్షంలో చేసే సాహస యాత్రే ఈ చిత్ర కథాంశం. థియేటర్లలో భారీ విజయం సాధించడంతో, ఈ సినిమా ఓటీటీ విడుదల కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# 'కాగితం పడవలు' చిత్రం జూలై 24న రిలీజ్



వర్ధన్, కృష్ణప్రియ హీరో హీరోయిన్స్ గా ఎంజీఆర్ తుకారాం దర్శకత్వంలో తెరకెక్కుతున్న బ్యూటిఫుల్ లవ్ స్టోరీ కాగితం పడవలు'. ఎస్ఎల్ఎన్ సినీ క్రియేషన్స్, ప్రణధి క్రియేషన్స్, నవ నారాయణ సినీ క్రియేషన్స్ బ్యానర్స్ పై కీర్తన నరేష్ ం. ఖీ. ప్రసాద్ రెడ్డి వెంకట్రాజుల, గాయిత్రమ్మ అంజనప్ప నిర్మిస్తున్నారు.ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, ట్రైలర్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది.తాజాగా చిత్ర బృందం విడుదల తేదీని అధికారికంగా ప్రకటించింది. జూలై 24న ఈ చిత్రం ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్ ద్వారా గ్రాండ్‌గా ప్రేక్షకుల ముందుకు రానుంది.తెలుగు చిత్ర పరిశ్రమలో ప్రతిష్టాత్మకమైన పంపిణీ సంస్థల్లో ఒకటైన ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్ ఈ చిత్రాన్ని విడుదల చేస్తుండటం విశేషం.ఒక సినిమా కంటెంట్‌పై బలమైన నమ్మకం ఉన్నప్పుడే ఇలాంటి ప్రముఖ సంస్థలు ముందుకు వస్తాయి. దీంతో 'కాగితం పడవలు' పై పరిశ్రమ వర్గాల్లోనూ, ప్రేక్షకుల్లోనూ మరింత ఆసక్తి నెలకొంది.ఈ చిత్రానికి ంమో.నౌఫల్ రాజామ్యూజిక్ అందిస్తున్నారు. రుద్రసాయి డీవోపీగా పని చేస్తున్నారు, జెస్విన్ ప్రభు ఎడిటర్. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ఎం.హిమ బిందు. త్వరలోనే ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.నటీనటులు: వర్ధన్, కృష్ణప్రియ

# 'ఇసకపట్నం' సిరీస్ రివ్యూ!



సముద్రఖని - ఐశ్వర్య రాజేశ్ ప్రధానమైన పాత్రలను పోషించిన తెలుగు సిరీస్ 'ఇసకపట్నం'. గ్యారీ బీహెచ్ దర్శకత్వం వహించిన ఈ సిరీస్, 7 ఎపిసోడ్స్ గా రూపొందింది. ప్రవీణ్ లక్కరాజు సంగీతాన్ని సమకూర్చిన ఈ సిరీస్, ఈ రోజు (జులై 2)వ తేదీ నుంచి అమెజాన్ ప్రైమ్ లో స్ట్రీమింగ్ అవుతోంది. సునీల్ .. నరేశ్ అగస్త్య .. రాజీవ్ కనకాల .. బెనర్జీ కీలకమైన పాత్రలను పోషించిన ఈ క్రైమ్ థ్రిల్లర్ విశేషాలు ఏమిటనేది ఇప్పుడు చూద్దాం. నాయుడు (సముద్రఖని) తన భార్యాబిడ్డలతో కలిసి, ఒక సాధారణ వ్యక్తిలా 'ఇసకపట్నం'లో అడుగుపెడతాడు. సముద్రంపై ఆధారపడి మత్స్యకారులు జీవించే ప్రాంతం అది. అక్కడి మత్స్య కారులంతా చిన్నారావు (రాజీవ్ కనకాల) చెప్పినట్టుగా నడుచుకుంటూ ఉంటారు. అది 'పోతన' (జ్వాలా కోటి)కి ఎంతమాత్రం ఇష్టం ఉండదు. అది గ్రహించిన నాయుడు, అతని సపోర్టుతో చిన్నరావును హత్య చేసి తాను నాయకుడు అవుతాడు. నాయుడు ఆ పోర్టు ఏరియాలో తిరుగులేని నాయకుడిగా ఎదుగుతాడు. అతని కూతురు భారతి (ఐశ్వర్య రాజేశ్) వయసుకి వస్తుంది. తండ్రి దుర్మార్గాలను ప్రత్యక్షంగా చూస్తూ పెరిగిన ఆమె, సమాజానికి మేలు చేసే పనులను చేస్తూ వెళుతుంటుంది. తమ కారు డ్రైవర్ గా పనిచేస్తున్న సూరి (సుధాకర్ కోమకుల)తో ప్రేమలో ఉంటుంది. నాయుడు ఆధిపత్యం అంతకంతకూ పెరుగుతూ వెళ్లడాన్ని పోతన తట్టుకోలేకపోతాడు. నాయుడికి శత్రువైన జమిందార్ ప్రతాప్ వర్మ ( రవి వర్మ) సపోర్టు తీసుకుంటాడు. అదే ఊళ్లో ఆటో నడుపుకుని జీవిస్తున్న పెద్దన్న (నరేశ్ అగస్త్య)కి కార్పొరేటర్ కావాలని ఉంటుంది. రాజకీయాలకు .. ముఠా తగాదాలకు దూరంగా అతను తన జీవితాన్ని కొనసాగిస్తుంటాడు. ఇక నాయుడు కూడానే ఉండే శేఖరం (రాజా) అతని కుర్చీలో కూర్చునే అవకాశం కోసం వెయిట్ చేస్తుంటాడు. ఈ నేపథ్యంలోనే పోతన - ప్రతాప్ వర్మ చేతులు కలిపినట్టుగా నాయుడికి తెలుస్తుంది. ప్రతాప్ వర్మకి గల ఆర్థికబలం గురించి తెలిసిన నాయుడు, అతనికి తన కూతురు భారతినిచ్చి పెళ్లి చేయాలనుకుంటాడు. అప్పుడు భారతి ఎలా స్పందిస్తుంది? ఆమె ప్రేమకథ ఎలాంటి మలుపు తిరుగుతుంది? ప్రతాప్ వర్మను తనవైపుకు తిప్పుకోవడానికి నాయుడు వేసిన ప్లాన్ ఫలిస్తుందా? అతని వారసుడిగా పెత్తనం చెలాయించాలని ఆశపడుతున్న శేఖరం పరిస్థితి ఏమిటి? పోతనకి దక్కే ఫలితం ఎలాంటిది? పెద్దన్న కార్పొరేటర్ అవుతాడా? చివరికి గెలుపెవరిది? అనేది మిగతా కథ. కుటుంబం పట్ల ప్రేమ .. ఇతరుల పట్ల జాలి .. సమాజం పట్ల బాధ్యత లేని వారు ఎంతకైనా తెగిస్తారు. డబ్బు .. అధికారం గురించి మాత్రమే ఆలోచించే అలాంటివారిలో రాక్షసత్వం మాత్రమే కనిపిస్తూ ఉంటుంది. అలాంటి ఒక మనిషిలాంటి మృగం చుట్టూ తిరిగే కథ ఇది. అతని ప్రయాణం .. ఆ దారిలో అతనికి సహకరించే పాత్రలను కలుపుకుంటూ ఈ కథ ముందుకు వెళుతుంది. తన ముఠా రాజకీయాలకు కూతురు జీవితాన్ని బలి చేయడానికి కూడా వెనుకాడని ఒక కఠినాత్ముడి కథ ఇది. ఈ సిరీస్ ను చూస్తున్నప్పుడు మనకి అర్థమయ్యేది ఏమిటంటే, ఇది ప్రధానంగా తండ్రీకూతుళ్ల మధ్య జరిగే పోరాటం అనిపిస్తుంది. అందువలన సముద్రఖనితో సమానమైన పవర్ తో ఐశ్వర్య రాజేశ్ పాత్ర ఉంటుందని ఆడియన్స్ భావిస్తారు .. కానీ అలా జరగలేదు. ఐశ్వర్య రాజేశ్ పాత్రను గాడిలో పెట్టడానికి దర్శకుడు చాలా సమయం తీసుకున్నాడు. ఈ లోగా ఆమెపై ఆవిష్కరించిన సన్నివేశాలలోను అంతగా దమ్ము కనిపించదు. ఫస్టు ఎపిసోడ్ లోనే చాలా కథ చెప్పారు. అదంతా కూడా చాలా ఇంట్రెస్టింగ్ గా అనిపిస్తుంది. అయితే ఆ స్థాయి స్పీడ్ లో మిగతా ఎపిసోడ్స్ పరిగెత్తలేకపోయాయి. కథ ఒక దశకి చేరుకున్న తరువాత అక్కడక్కడే తిరుగుతూ ఉంటుంది. పెద్దగా ట్విస్టులు లేకపోవడం .. నెక్స్ట్ ఏం జరుగుతుందో అనే ఒక ఉత్కంఠ రేకెత్తించక పోవడం అసంతృప్తిని కలిగిస్తుంది. చూస్తున్నంత సేపు బాగానే అనిపిస్తుంది .. కానీ ఎక్కడా కొత్త మలుపు అనేది మాత్రం కనిపించదు. కథా పరంగా చూసుకుంటే ముఖ్యమైనవిగా చాలా పాత్రలు కనిపిస్తాయి. కానీ ఆ పాత్రలకు తగిన పవర్ ను జోడించలేకపోయారు. ఆయా పాత్రల మధ్య ఎత్తులు పయ్యెత్తులను ఆసక్తికరంగా ఆవిష్కరించలేకపోయారు. చుట్టూ ఎన్ని పాత్రలు ఉన్నప్పటికీ సముద్రఖని పాత్ర మాత్రమే హైలైట్ అవుతూ ఉంటుంది .. ఆయన పాత్ర మాత్రమే కనిపిస్తూ ఉంటుంది. ఆయన స్థాయికి తగిన పాత్రలు చుట్టూ లేకపోవడం వలన, ఆడియన్స్ లో ఎలాంటి అటెన్షన్ లేకుండా పోతుంది. నరేశ్ అగస్త్య పాత్రను కూడా చాలా వరకూ వదిలేశారు. అప్పుడప్పుడు మాత్రమే కనిపించే ఆ పాత్ర కనెక్ట్ కాలేకపోయింది. ఇక చాలా తెలివైనది .. ధైర్యవంతురాలైన భారతి, తన పెళ్లి విషయంలో తీసుకున్న నిర్ణయం తప్పకుండా మనలను అయోమయంలో పడేస్తుంది. ఆమె ఉద్దేశం ఏమిటనేది చెప్పే విషయంలో కూడా క్లారిటీ లోపించిందేమో అనే భావన కలుగుతుంది. నిర్మాణ పరమైన నాణ్యత విషయంలో ఎక్కడా వంక బెట్టవలసిన పనిలేదు. ఒక సినిమాను చూస్తున్నట్టుగానే అనిపిస్తుంది. పాత్రలు .. ఆ పాత్రలకు తగిన నటీనటుల ఎంపిక కరెక్టుగా ఉంది. వంశీ పచ్చి పులుసు ఫొటోగ్రఫీ .. ప్రవీణ్ లక్కరాజు సంగీతం బాగున్నాయి. బలమైన కథను రాసుకున్నారు .. సన్నివేశాలను అంతే బలంగా ఆవిష్కరించారు. అయితే ఆయా పాత్రలను డిజైన్ చేసిన తీరులోనే కొంత లోపం కనిపిస్తూ ఉంటుంది. సముద్రఖని నటనను ఇష్టపడేవారికి ఈ సిరీస్ ఇంట్రెస్టింగ్ గానే అనిపిస్తుంది.

# మైత్రీ మూవీ మేకర్స్ 4వ తమిళ చిత్రం ప్రారంభం




ప్రముఖ పాన్-ఇండియా నిర్మాణ సంస్థ 'మైత్రీ మూవీ మేకర్స్' కేవలం తెలుగు పరిశ్రమకే పరిమితం కాకుండా ఇతర భాషల్లోనూ భారీ చిత్రాలను నిర్మిస్తోంది. ఈ క్రమంలో వారి నాలుగవ తమిళ చిత్రాన్ని ప్రకటించారు. ధృవ్ విక్రమ్ హీరోగా నటిస్తున్న నాలుగవ చిత్రం కావడం విశేషం. పూర్తి స్థాయి కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందనున్న ఈ చిత్రానికి కరణ్ అరవింద్ కుమార్ దర్శకత్వం వహించనున్నారు.చెన్నైలోని ఓఖీఅ నగర్ మైత్రీ ఆఫీస్ లో జరిగిన పూజా కార్యక్రమంతో చఓఎబిష్త్రతీతిజీఎతిశ్రీ04 చఆఎ4 ప్రాజెక్ట్ అధికారికంగా ప్రారంభమైంది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి చిత్ర బృందం, పలువురు ప్రముఖ అతిథులు హాజరయ్యారు.ధృవ్ విక్రమ్, దర్శకుడు కరణ్ అరవింద్ కుమార్, చిత్ర బృందంతో కలిసి ఈ శుభకార్యంలో పాల్గొన్నారు.ముహూర్తం షాట్ కు దర్శకుడు కీర్తిశ్వరన్ క్లాప్‌బోర్డ్ కొట్టారు. దర్శకులు అధిక్ రవిచంద్రన్, రవికుమార్, కీర్తిశ్వరన్, ఆంటోనీ భాగ్యరాజ్, రాజా, శశి, 'హాయ్ నాన్న' ఫేమ్ శౌర్యువ్ ఈ ప్రారంభోత్సవ వేడుకకు హాజరయ్యారు.నవీన్ యెర్నేని, వై. రవి శంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రం (ఆఎ4), ధృవ్ విక్రమ్‌ను పూర్తిగా మాస్-ఓరియెంటెడ్ అవతార్‌లో కనిపించనున్నారు. నటనకు ప్రాధాన్యతనిచ్చే పాత్రలతో ప్రయోగాలు చేయడానికి పేరుపొందిన ధృవ్ , ఇప్పుడు మాస్ ప్రేక్షకులను ఆకట్టుకునేలా రూపొందుతున్న ఒక కమర్షియల్ ఎంటర్‌టైనర్ కోసం సిద్ధమయ్యారు.కరణ్ అరవింద్ కుమార్, సబీతో కలిసి ఈ చిత్రానికి స్క్రీన్‌ప్లేను కూడా అందించారు. ఈ చిత్రానికి అద్భుతమైన సాంకేతిక బృందం పని చేస్తోంది. సినిమాటోగ్రఫీని వికీ నిర్వహించనుండగా, జయసూర్య ఎడిటర్. కాస్ట్యూమ్ డిజైనర్ ప్రవీణ్ రాజా, ప్రొడక్షన్ డిజైనర్ జి.ఎం. శేఖర్, యాక్షన్ కొరియోగ్రాఫర్ విక్రమ్ మోర్. త్వరలో ఇతర వివరాలు తెలియజేయనున్నారు

# రేపే 'నాగబంధం' రిలీజ్...

## బుక్‌మైషో పోర్టల్ లో సూపర్ రెస్పాన్స్!



ద్వారకా క్రియేషన్స్ బ్యానర్‌పై రూపొందిన 'నాగబంధం: ది సీక్రెట్ ట్రెజర్' చిత్రం రేపు (జులై 3) ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. మైథలాజికల్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కిన ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. విడుదల సందర్భంగా చిత్ర యూనిట్ కొత్త పోస్టర్‌ను విడుదల చేసి ప్రచారాన్ని వేగవంతం చేసింది.అభిషేక్ నామా దర్శకత్వంలో వస్తున్న ఈ చిత్రంలో విరాట్ కర్ణ ప్రధాన పాత్రలో నటించగా.. నభా నటేశ్, ఐశ్వర్య మీనన్ కథానాయికలు. జగపతిబాబు, మహేశ్ మంజ్రేకర్, రిషబ్ సాహ్నీ తదితరులు కీలకపాత్రలు పోషించారు.ఈ సినిమాపై 'బుక్‌మైషో'లో ఇప్పటికే లక్షకు పైగా ఆసక్తులు నమోదయ్యాయని, "రేపటి నుంచి తాండవం మొదలవుతుంది" అని చిత్ర నిర్మాతలు సోషల్ మీడియా ద్వారా ప్రకటించారు. పురాతన నిధి, నాగసర్పాల నేపథ్యంలో సాగే కథగా పోస్టర్‌ను బట్టి అర్థమవుతోంది. ప్రధాన పాత్రధారి భారీ దేహంతో, చుట్టూ నాగసర్పాలతో ఉన్న లుక్ సినిమాపై అంచనాలను పెంచుతోంది. విజువల్ ఎఫెక్ట్స్‌కు పెద్దపీట వేస్తూ సినిమాను భారీ స్థాయిలో తెరకెక్కించినట్లు తెలుస్తోంది.ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన అడ్వాన్స్ టికెట్ బుకింగ్స్ బుక్‌మైషో, డిస్ట్రిక్ట్ యాప్‌తో పాటు ఇతర ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లలో ప్రారంభమయ్యాయి.

# రాముడి సొమ్మునే దొంగిలించిన లవకుష్

**లక్నో,(భారత శక్తి)** అయోధ్య రామ మందిరం విరాళాల దారిమళ్లింపు (నిధుల దుర్వినియోగం) కేసులో అరెస్టయిన ప్రధాన నిందితుల్లో ఒకరైన లవకుష్ మిశ్రాకు సంబంధించిన ఆస్తిపై ఇప్పుడు బుల్డోజర్ నీడ పరుచుకుంది. అయోధ్యలోని సోహావల తహసీల్ పరిధిలోని మాంగ్సీ పరగణాలో నిర్మాణంలో ఉన్న అతని రెండంతస్తుల ఇంటిని కూల్చివేసేందుకు అయోధ్య డెవలప్‌మెంట్ అథారిటీ (ఏడీఏ) ప్రాథమిక చర్యలు ప్రారంభించింది. 1,000 చదరపు అడుగుల స్థలంలో నిర్మిస్తున్న ఈ ఇల్లు లవకుష్ మిశ్రా భార్య సుప్రియ మిశ్రా పేరిట నమోదై ఉంది. భవన నిర్మాణ నిబంధనలను ఉల్లంఘించి, ఎలాంటి ముందస్తు అనుమతులు లేదా ఆమోదించిన మ్యాప్ లేకుండానే ఈ నిర్మాణాన్ని చేపట్టినట్లు ఏడీఏ అధికారులు తమ తనిఖీల్లో గుర్తించారు. ఈ మేరకు నిందితుడి కుటుంబానికి నోటీసులు జారీ చేసిన అధికారులు.. అవసరమైన పత్రాలను సమర్పించి వివరణ ఇవ్వడానికి వారం రోజుల గడువు విధించారు. నిర్ణీత గడువులోగా సరైన ఆధారాలు చూపించకపోతే చట్టప్రకారం కూల్చివేత ప్రక్రియ చేపడతామని అధికారులు హెచ్చరించారు. 27 ఏళ్ల లవకుష్ మిశ్రా గతంలో రామాలయ ట్రస్ట్ ఆఫీసులో విరాళాల లెక్కింపు విభాగంలో నెలకు కేవలం రూ. 12,000 నుండి రూ. 15,000 జీతానికి పనిచేసేవాడు. అయితే, అతను ట్రస్ట్‌లో పనిచేస్తున్న కాలంలోనే అంటే అక్టోబర్ 2025లో ఈ భూమిని రూ. 8.8 లక్షలకు కొనుగోలు చేసినట్లు పత్రాల ద్వారా తెలిసింది. ప్రస్తుతం ఈ ఆస్తి విలువ దాదాపు రూ. 25 లక్షల వరకు ఉంటుందని అంచనా. ఫిబ్రవరి 2026 నుండి ఇక్కడ భవన నిర్మాణం శరవేగంగా ప్రారంభమైంది. రామాలయానికి భక్తులు సమర్పించిన విరాళాలను దొంగిలించి, ఆ సొమ్ముతోనే ఈ ఆస్తులు కొనుగోలు చేశాడనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ కేసులో ఇప్పటికే పోలీసులు లవకుష్ మిశ్రాను అరెస్ట్ చేసి, అతడి నుండి పెద్ద మొత్తంలో నగదును రికవరీ చేశారు. తాజాగా అతని నివాసంలో సోదాలు నిర్వహించి, తండ్రిని కూడా విచారించిన పోలీసులు.. ఆస్తి కొనుగోలు వివరాలపై దర్యాప్తును మరింత వేగవంతం చేశారు.

# అమరావతిపై జగన్ మరో డ్రామా..

## – రాష్ట్ర భవిష్యత్తుతో చెలగాటం ఆడొద్దు: సోమిరెడ్డి

**విజయవాడ,(భారత శక్తి)** అమరావతిపై వైసీపీ అధినేత జగన్ చేస్తున్న వ్యాఖ్యలు పూర్తిగా గందరగోళంగా ఉన్నాయని మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. ఒకప్పుడు అమరావతికి మద్దతు తెలిపిన జగన్, తర్వాత మూడు రాజధానుల ప్రతిపాదన తీసుకొచ్చారని గుర్తుచేశారు. ఇప్పుడు 'మావిగన్' పేరుతో మరో కొత్త నినాదం తీసుకురావడం ప్రజలను అయోమయంలోకి నెట్టే ప్రయత్నమేనని ఆరోపించారు. అభివృద్ధికి, విధ్వంస రాజకీయాలకు మధ్యే అసలు పోటీ జరుగుతోందన్నారు. అమరావతిలో ఇప్పటికే వేల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయని సోమిరెడ్డి తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలతో పాటు జాతీయ బ్యాంకులు, విద్యాసంస్థలు, ప్రైవేట్ కంపెనీలు అక్కడ ఏర్పాటవుతున్నాయని చెప్పారు. క్వాంటమ్ వ్యాలీ, ఏఐ యూనివర్సిటీ, ఎన్ఐడీ, ఎయిమ్స్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలు అమరావతికి వస్తున్నాయని పేర్కొన్నారు. ఇలాంటి సమయంలో రాజధానిపై అనిశ్చితి సృష్టించడం రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధమన్నారు. అమరావతి కోసం రైతులు స్వచ్ఛందంగా భూములు ఇచ్చి త్యాగాలు చేశారని సోమిరెడ్డి అన్నారు. ప్రస్తుతం రూ.57,821 కోట్ల విలువైన 97 అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. అమరావతి కేవలం నగరం కాదని, ఐదు కోట్ల మంది ఆంధ్రుల ఆకాంక్ష అని చెప్పారు. ప్రజల ఆస్తులు, రైతుల భవిష్యత్తును దెబ్బతీసేలా ఎలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదని జగన్‌ను హెచ్చరించారు. చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధిపైనే దృష్టి పెట్టిందని సోమిరెడ్డి అన్నారు. సీఎం చంద్రబాబు అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని, మంత్రి లోకేశ్ పెట్టుబడులు తీసుకురావడానికి ప్రపంచవ్యాప్తంగా పర్యటిస్తున్నారని చెప్పారు. గతంలో మూడు రాజధానుల ప్రతిపాదనను ప్రజలు తిరస్కరించారని, ఇప్పుడు కొత్త నినాదాలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు ఫలించవని వ్యాఖ్యానించారు. రాష్ట్ర భవిష్యత్తుతో రాజకీయాలు చేయకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని హితవు పలికారు.

# అనుచిత వ్యాఖ్యలు చేసిన యూట్యూబర్ ప్రశ్న రావణ్ మళ్లీ అరెస్టు!

## – 2025 నాటి కేసులో చర్యలు!

**విజయవాడ,(భారత శక్తి)** ఈ మధ్య కాలంలో జరిగిన దళిత క్రైస్తవ సభలో అనుచిత వ్యాఖ్యలు చేసిన యూట్యూబర్ ప్రశ్న రావణ్‌ను పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఆయనకు అర్ధరాత్రి బెయిల్ మంజూరు అయ్యింది. అయితే ఆయన్ని అరెస్టు చేసినప్పటి నుంచి మెజిస్ట్రేట్ వద్దకు తీసుకెళ్లే వరకు పిఠాపురంలో హైడ్రామా సాగింది. చివరకు అర్ధరాత్రి బెయిల్ వచ్చింది. అయితే వెంటనే మరో కేసులో అరెస్టు చేస్తున్నట్టు పోలీసులు ఆయనకు, ఆయన తరఫున లాయర్‌కు తెలియజేశారు. రావణ్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు పిఠాపురం జగ్గయ్య చెరువు వద్ద ఉన్న న్యాయమూర్తుల బంగ్లాకు తీసుకువెళ్లి మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచారు. సుమారు రెండు గంటల పాటు బెయిల్‌పై వాదనలు జరిగాయి. నిందితుడు తరఫున జడ శ్రవణ్ వాదనలు వినిపించారు. ఇరువురి వాదనలు విన్న న్యాయమూర్తి నిందితుడికి వ్యక్తిగత పూచిపై బెయిల్ గ్రాంట్ చేశారు. అంతకు ముందు పిఠాపురం పోలీస్ స్టేషన్‌లో హైడ్రామా నడిచింది. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేసిన జోసఫ్ ఎలియాస్ ప్రశ్న రావణ్‌ను అప్పగించాలని పెద్ద ఎత్తున జనసైనికులు స్టేషన్‌ను చుట్టుముట్టారు. అప్పటికే ఆయన అరెస్టు సమాచారం అందుకున్న దళిత క్రైస్తవ సంఘాలు అక్కడకు చేరుకున్నారు. వారు ఆయనకు రక్షణగా నిలిచారు. దీంతో పిఠాపురంలో పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఇరు వర్గాల మధ్య తోపులాట జరిగింది. అయితే పరిస్థితి చేయిదాటిపోకుండా ఉండేందుకు పోలీసులు భారీగా బలగాలను మోహరించారు. పరిస్థితి మరింత హీటెక్కకుండానే నిరసనకారులను అక్కడి నుంచి పోలీసులు తీసుకెళ్లిపోయారు. అయినా కొందరు అక్కడే నినాదాలు చేస్తూ ఉండిపోయారు. ఈ పరిస్థితుల్లో నాటకీయపరిణామాల మధ్య రావణ్‌ను పోలీసులు సైలెంట్‌గా మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. అర్ధరాత్రి వరకు సాగిన వాదనల తర్వాత ఆయనకు న్యాయమూర్తి బెయిల్ మంజూరు చేశారు. అయితే ఇలా బెయిల్ వచ్చిందో లేదో మరో కేసులో రావణ్‌ను పోలీసులు అరెస్టు చేస్తున్నట్టు తెలిపారు. గత ఏడాది సర్పవరం పోలీస్ స్టేషన్‌లో నమోదు అయిన కేసులో పోలీసులు అదుపులోకి తీసుకుని సర్పవరం తరలించారు. దీన్ని ఆయన తరపున వాదిస్తున్న శ్రవణ్ ఖండించారు. ముందస్తు నోటీసులు ఇవ్వకుండా అరెస్టు చేయడం ఏంటని ప్రశ్నించారు. ఉప ముఖ్యమంత్రిపై ఎలాంటి తప్పుడు కామెంట్స్ చేయలేదని, గతంలో పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను మాత్రమే గుర్తు చేశారని అన్నారు. ఈ మధ్య కాలంలో నేతలు చేస్తున్న కామెంట్స్‌పై చర్యలు తీసుకోకుండా ప్రశ్నిస్తున్న గొంతుకలను నొక్కేందుకు మాత్రమే అరెస్టు చేస్తున్నారని మండిపడ్డారు. జూన్ 28న జరిగిన దళిత క్రైస్తవ సమర శంఖారావంలో రావణ్ శృతిమించి మాట్లాడారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, రాధా మనోహర్‌దాస్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలు ఎందుకు చేయాల్సి వచ్చింది, ఎవరైనా చేయిస్తున్నారా అనే కోణంలో పోలీసులు ప్రశ్నించారు. దీనికి సంబంధించిన వివరాలు రాబడుతున్నారు. ఆయనకు వచ్చే ఆదాయ వనరులను పరిశీలిస్తున్నారు.

# 200 కాదు.. ఇక 180 ప్రశ్నలతోనే

## – నీట్ పీజీ అప్ డేట్స్

**హైదరాబాద్,(భారత శక్తి):** ఈ ఏడాది నీట్ పీజీ 2026 పరీక్షను ఆగస్టు 30న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు దేశ వ్యాప్తంగా ఒకే షిఫ్టులో నిర్వహించనున్నట్లు నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ (ఎన్‌బీఈఎంఎస్) ప్రకటించింది. ఈ మేరకు తాజాగా పూర్తి షెడ్యూల్ విడుదల చేసింది. ఇక ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ జులై 21వ తేదీ రాత్రి 11.55 గంటల వరకు కొనసాగనుంది. ఆసక్తి కలిగిన అభ్యర్థులు చివరి తేదీ వరకు వేచి ఉండకుండా త్వరిత గతిన దరఖాస్తు చేసుకోవాలని ఏన్టీయే పేర్కొంది. అంతేకాకుండా ఈసారి దేశవ్యాప్తంగా ఆన్‌లైన్ విధానంలో నీట్ పీజ పరీక్ష నిర్వహించనున్నట్లు స్పష్టం చేసింది. పరీక్ష కేంద్రాల కేటాయింపు సమాచారం ఆగస్టు 11న వెల్లడిస్తామని తెలిపింది. ఇక నీట్ పీజీ 2026 పరీక్ష ఫలితాలు సెప్టెంబరు 30న విడుదల చేయనున్నట్లు పేర్కొంది. ఈ ఏడాది నీట్ పీజీ పరీక్షల విధానంలో పలు కీలక మార్పులు చేసింది. ముఖ్యంగా పరీక్షలో ప్రశ్నల సంఖ్యను గణనీయంగా తగ్గించింది. గతంలో నీట్ పీజీ పరీక్షలో 200 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇచ్చేవారు. ఈ ఏడాది మాత్రం వాటిని 180కి తగ్గించనున్నారు.

అంటే ఇకపై నీట్ పీజీ ప్రవేశ పరీక్ష కేవలం 180 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలకు మాత్రమే జరగనుంది. అయితే మార్కింగ్ విధానంలో ఎలాంటి మార్పు లేదు. ప్రతి సరైన సమాధానానికి అభ్యర్థులకు నాలుగు మార్కులు లభిస్తాయి.

అయితే ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కు చొప్పున కోత విధిస్తారు. సమాధానం ఇవ్వని ప్రశ్నలకు ఎలాంటి మార్కులు ఉండవు. అలాగే తగ్గించరు కూడా. వైద్య పాఠ్యప్రణాళికలోని అంశాలపై అభ్యర్థుల జ్ఞానాన్ని, అవగాహనను అంచనా వేయడానికి రూపొందించిన 180 బహుళైచ్ఛిక ప్రశ్నల ద్వారా అభ్యర్థులను మదింపు చేయనున్నారు. నీట్ పీజీ దరఖాస్తు రుసుములో కూడా మార్పు చేశారు. జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ కేటగిరీలకు చెందిన అభ్యర్థులు రూ.3,500 చొప్పున చెల్లించవల్సి ఉంటుంది. మిగిలిన అన్ని కేటగిరీల అభ్యర్థులు రూ.2,500 చెల్లించాల్సి ఉంటుంది. మరో ముఖ్యమైన మార్పు ఏమంటే.. పరీక్షా కేంద్రాలను ఎంపిక చేసుకునే ప్రక్రియను ఔఇఓూ సవరించింది. అభ్యర్థులు ఇకపై తమకు నచ్చిన పరీక్షా నగరాలను ఎంచుకోవడానికి బదులుగా, దరఖాస్తు ఫారమ్‌ను నింపేటప్పుడు మూడు రాష్ట్రాలను ఎంచుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తు ఫారమ్‌లో అభ్యర్థి అందించిన చిరునామాకు సంబంధించిన రాష్ట్రాన్ని మొదటి ప్రాధాన్యతగా ఎంచుకోవాలి. రెండవ, మూడవ ప్రాధాన్యతలు పొరుగు రాష్ట్రాలుగా ఉండాలి.

# చమురు ధరల ఊరట.. భారీ లాభాల్లో స్టాక్ మార్కెట్లు

**ముంబై, (భారత శక్తి)**దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం భారీ లాభాలతో ముగిశాయి. అమెరికా, ఇరాన్ మధ్య వాణిజ్య చర్చల్లో సానుకూల సంకేతాలు వెలువడటంతో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గడం మన మార్కెట్లకు కలిసొచ్చింది. దీంతో ఇన్వెస్టర్ల సెంటిమెంట్ బలపడి కొనుగోళ్లకు మొగ్గు చూపారు. ఫలితంగా, సెన్సెక్స్ 579.48 పాయింట్లు లాభపడి 77,502.12 వద్ద స్థిరపడగా, నిఫ్టీ 169.85 పాయింట్లు పెరిగి 24,175.70 వద్ద ముగిసింది. ఈనాటి ర్యాలీలో టెక్నాలజీ షేర్లు కీలక పాత్ర పోషించాయి. ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, టీసీఎస్ వంటి షేర్లు నిఫ్టీలో టాప్ గెయినర్లుగా నిలిచాయి. దీంతో నిఫ్టీ ఐటీ ఇండెక్స్ 2025 మే నెల తర్వాత ఒకే రోజులో అతిపెద్ద లాభాన్ని నమోదు చేసింది. బ్రాడర్ మార్కెట్లలోనూ కొనుగోళ్ల జోరు కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 0.48 శాతం, స్మాల్‌క్యాప్ 1.25 శాతం మేర లాభపడ్డాయి. ఐటీతో పాటు ఆటో, కన్స్యూమర్ డ్యూరబుల్స్, రియాల్టీ రంగాల సూచీలు కూడా మంచి లాభాలను నమోదు చేశాయి. టెక్నికల్‌గా చూస్తే, నిఫ్టీ రోజంతా స్థిరమైన కొనుగోళ్లతో 24,200 నిరోధక స్థాయి వైపు కదిలిందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ స్థాయిని దాటితే కొనుగోళ్ల ట్రెండ్ మరింత బలపడి 24,400?24,450 స్థాయిల వరకు వెళ్లే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. అదే సమయంలో, కిందవైపు 24,000 స్థాయి తక్షణ మద్దతుగా పనిచేస్తుందని పేర్కొన్నారు. తగ్గుతున్న ఇంధన ధరలతో పాటు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), రక్షణ సాంకేతికత, ఇంధన భద్రత వంటి కీలక రంగాల్లో భారత్–జపాన్ మధ్య కొత్త ఒప్పందాలు కుదరడం కూడా మార్కెట్ ఆశావాద దృక్పథానికి దోహదపడింది

# బాసర ఆలయంలో చోరీ చేసిన దొంగ పట్టివేత

## – వెండి కిరీటం రికవరీ – పోలీస్ ఆపరేషన్ సాగింది ఇలా

అదిలాబాద్,**(భారత శక్తి)** బాసర జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో జరిగిన సంచలన దొంగతనం కేసును నిర్మల్ జిల్లా పోలీసులు కేవలం 10 రోజుల్లోనే ఛేదించారు. నిందితులను అరెస్ట్ చేసి వెండి కిరీటం స్వాధీనం చేసుకున్నారు. తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన నిర్మల్ జిల్లా బాసర జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో జరిగిన సంచలన దొంగతనం కేసును జిల్లా పోలీసులు అత్యంత చాకచక్యంగా, వేగవంతంగా ఛేదించారు. కేవలం 10 రోజుల్లోనే ఈ కేసును క్లోజ్ చేసి, భక్తులలో ఉన్న ఆందోళనను దూరం చేశారు. ఈ కేసులో ఇద్దరు మోస్ట్ వాంటెడ్ అంతర్‌జిల్లా దొంగలతో పాటు, దొంగిలించిన సొత్తును దాచిపెట్టిన మరో రిసీవర్‌ను పోలీసులు గురువారం నాడు అరెస్ట్ చేశారు. వారి నుంచి దొంగిలించిన అమ్మవారి వెండి కిరీటంతో పాటు సుమారు 1.48 కిలోల వెండి సొత్తును రికవరీ చేసినట్లు నిర్మల్ జిల్లా పోలీస్ యంత్రాంగం అధికారిక పత్రికా ప్రకటనలో వెల్లడించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల జూన్ 22వ తేదీ అర్ధరాత్రి దాటిన తర్వాత గుంటూరు జిల్లాకు చెందిన పల్లపు ఏడుకొండలు, నిజామాబాద్ జిల్లాకు చెందిన గైని కిరణ్ అలియాస్ రామకృష్ణలు ఆలయ గోడదూకి లోపలికి చొరబడ్డారు. గర్భాలయ గేటు తాళాలు పగులగొట్టి అమ్మవారి వెండి కిరీటం, హుండీని దొంగిలించారు. అనంతరం హుండీలోని సుమారు రూ.16,000 నగదును తీసుకుని, వెండి కిరీటాన్ని రెండు భాగాలుగా విడదీశారు. ఎవరికీ అనుమానం రాకుండా ఆలయం వెనుక వైపు ఉన్న వ్యాస గుహ గుట్టల పైనుంచి పరారై, మరుసటి రోజు ఉదయం సామాన్య భక్తుల వలె రైల్వే స్టేషన్‌కు చేరుకుని అక్కడ నుంచి పారిపోయారు. దొంగిలించిన వెండి కిరీటాన్ని విక్రయించేందుకు నిజామాబాద్‌కు చెందిన కోడామ ఆనంద్ అనే వ్యక్తి సహాయంతో మహారాష్ట్రలోని నాందేడ్‌కు తరలిస్తుండగా పోలీసులు పక్కా స్కెచ్ వేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు కాచిగూడ?నాగర్సోల్ రైలులో ప్రయాణిస్తున్న ముగ్గురు నిందితులను బాసర రైల్వే స్టేషన్ వద్ద సీసీఎస్, లోకల్ పోలీసులు ఉమ్మడిగా దాడి చేసి గురువారం అదుపులోకి తీసుకున్నారు. ఈ నిందితుల హిస్టరీని పరిశీలిస్తే వీరు వృత్తిపరమైన ప్రమాదకర దొంగలుగా తేలింది. రైల్వే రవాణా సౌకర్యం సులభంగా ఉన్న ప్రాంతాల్లోని దేవాలయాలనే వీరు టార్గెట్ చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్నారు. వీరిలో ఎ1 నిందితుడు పల్లపు ఏడుకొండలుపై గతంలో వివిధ పోలీస్ స్టేషన్లలో సుమారు 25 దొంగతనం కేసులు ఉండగా, ఎ2 నిందితుడు గైని కిరణ్‌పై 20 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. దొంగిలించిన వెండిని కొనుగోలు చేసేందుకు అంగీకరించి, సహాయం చేసినందుకు మహారాష్ట్ర సోలాపూర్‌కు చెందిన కోడామ ఆనంద్‌ను కూడా పోలీసులు మూడో నిందితుడిగా అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి 1 కిలో 220 గ్రాముల వెండి కిరీటం, 260 గ్రాముల వెండి పట్టీతో పాటు ఒక స్మార్ట్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నేరం జరిగిన వెంటనే అలర్ట్ అయిన నిర్మల్ జిల్లా పోలీసులు.. దర్యాప్తును వేగవంతం చేసేందుకు ఆరు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. నాందేడ్, ధర్మాబాద్, నిజామాబాద్, కామారెడ్డి, ఆదిలాబాద్ తదితర ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. ఆలయాల భద్రత విషయంలో రాజీ పడేది లేదని స్పష్టం చేస్తూ, ప్రతిభ కనబరిచిన అధికారులకు, కానిస్టేబుళ్లకు ఎస్పీ రివార్డులను ప్రకటించారు.

# జడ శ్రవణ్ కుమార్‌పై ఏలూరులో కేసు

**ఏలూరు,(భారత శక్తి)** జై భీమ్ భారత్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది జడ శ్రవణ్ కుమార్‌పై ఏలూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజును లక్ష్యంగా చేసుకుని ఆయన తీవ్రమైన, అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణల నేపథ్యంలో పోలీసులు ఈ చర్యలు చేపట్టారు. ఏలూరులోని గొల్లాయిగూడేనికి చెందిన పెద్దాడ వెంకటరమణ అనే వ్యక్తి ఏలూరు త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఈ మేరకు ఫిర్యాదు చేశారు. జూన్ 28న ఏలూరులో జరిగిన దళిత క్రైస్తవుల నిరసన సభలో శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ.. డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు నాలుక కోసి, దానిని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు పంపిస్తానంటూ రెచ్చగొట్టేలా హెచ్చరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

శ్రవణ్ కుమార్ చేసిన వ్యాఖ్యలు సమాజంలో విద్వేషాలు రగిలించేలా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఉన్నాయని ఫిర్యాదుదారు ఆరోపించారు. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు సంబంధిత బీఎన్ఎస్ (ఃఔొ) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ పరిణామం ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

# జులై 16 నుంచి 18వ తేదీ నుంచి తల్లికి వందనం

**తిరుపతి(భారత శక్తి),** ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ గురువారం తిరుమల, తిరుపతిలో జరిగిన రెండు వివాహ వేడుకల్లో పాల్గొన్నారు. ముందుగా తిరుమలలోని కర్ణాటక భవన్‌లో టీటీడీ బోర్డు సభ్యుడు జి. భానుప్రకాష్‌రెడ్డి కుమార్తె డాక్టర్ వైష్ణవి, డాక్టర్ హర్షవర్ధన్‌రెడ్డిల వివాహానికి హాజరయ్యారు. నూతన దంపతులను ఆశీర్వదించి పుష్పగుచ్ఛం అందజేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తిరుపతిలోని భూపాల్ హౌసింగ్‌లో టీడీపీ సోషల్ మీడియా యాక్టివిస్ట్ కే. గౌతమి శ్వేత నివాసాన్ని మంత్రి లోకేశ్ సందర్శించారు. ఏపీ కమ్మ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ నాదెండ్ల బ్రహ్మం చౌదరి, గౌతమి శ్వేతలను ఆశీర్వదించారు. మంత్రి సమక్షంలో వధూవరులు ఉంగరాలు మార్చుకున్నారు. ఈరోజు రాత్రి తిరుమలలోని శ్రీ శృంగేరి శారద పీఠంలో నాదెండ్ల బ్రహ్మం చౌదరి, గౌతమి శ్వేతల వివాహం జరగనుందితల్లికి వందనం' పథకం రెండో విడత నిధులను జులై 16 నుంచి 18వ తేదీల మధ్య తల్లుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా మెగా పేరెంట్–టీచర్ మీటింగ్‌లు (పీటీఎం) నిర్వహించే సమయంలోనే ఈ నిధులను విడుదల చేయనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. రేణిగుంట మండలంలో శ్రీకాళహస్తి నియోజకవర్గ టీడీపీ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో లోకేశ్ మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 150 రోజుల వ్యవధిలోనే 16,000 ఉపాధ్యాయ, 6,000 కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టిందని తెలిపారు. ఈ ఏడాది మరో 10,000 పోస్టులతో మెగా జాబ్ క్యాలెండర్ విడుదల చేయనున్నట్లు వివరించారు. ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు జులై 15 నుంచి 'ఇంటింటి ప్రచారం' చేపట్టాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. అదేవిధంగా, ప్రతిపక్ష పార్టీల వైఖరిని ప్రస్తావిస్తూ.. కార్యకర్తలు చెడు లక్షణాలను అలవర్చుకోవద్దని సూచించారు. ఈ పర్యటనలో భాగంగా లోకేశ్ పలు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి తనిఖీ చేశారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించడంతో పాటు, పలువురు లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల పట్టాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన శ్రీకాళహస్తీశ్వర ఆలయాన్ని సందర్శించి, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# నేడు మండల కేంద్రంలో పిజిఆర్ఎస్ కార్యక్రమం

## – పిజిఆర్ఎస్ ద్వారా ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరణ.

**తుగ్గలి: (భారత శక్తి)**నేడు మండల కేంద్రమైన తుగ్గలి నందు నిర్వహించు పిజిఆర్ఎస్ కార్యక్రమానికి కర్నూలు జిల్లా కలెక్టర్ సిరి వస్తున్నట్లు తుగ్గలి తహసిల్దార్ రవి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం రోజున ఉదయం 10 గంటలకు మండల కేంద్రమైన తుగ్గలిలోని స్థానిక తహసిల్దార్ కార్యాలయం పక్కన,ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ వెనుక భాగం నందు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలియజేశారు. తుగ్గలి మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల ప్రజలకు సంబంధించిన ప్రజా సమస్యల దరఖాస్తులు స్వీకరిస్తారని వారు తెలియజేశారు. కావున శుక్రవారం రోజున జరిగే ప్రజా సమస్య పరిష్కార వేదిక కార్యక్రమానికి మండల పరిధిలోని గల అన్ని శాఖల అధికారులు తప్పకుండా హాజరుకావాలని ఆయన తెలియజేశారు. కావున ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదికను మండల వ్యాప్తంగా గల ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని తహసిల్దార్ రవి ప్రజలకు తెలియజేశారు.

# ఓటర్లకు ఇబ్బంది లేకుండా చూడాలి

## – ఎమ్మిగనూరు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ కాసిం వలి

**ఎమ్మిగనూరు(భారత శక్తి)** ఎమ్మిగనూరు మండలం దేశవ్యాప్తంగా సార్( ఓటర్ల సర్వే) లో భాగంగా ఎమ్మిగనూరు పట్టణము, గ్రామీణ ప్రాంతాల్లో బిఎల్ వో లు. ప్రతి ఇంటికి ఓటర్ సర్వే చేయకుండా ఉంటున్నారని, సర్వేలో భాగంగా ఏ ప్రతి ఒక్క ఓటు( అర్హులైన) వారి తొలగించకూడదని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఎమ్మిగనూరు కోఆర్డినేటర్ కాసిం వలి ఆధ్వర్యంలో తాహసిల్దార్ శ్రీనివాసులకు గురువారం వినతి పత్రం ఇచ్చారు. సందర్భంగా వీరు మాట్లాడుతూ కొంతమంది బిఎల్ఓ మరియు అధికారులు రాజకీయ పార్టీ నాయకుల దగ్గర ఓటర్ల సర్వే ను నిర్వహిస్తున్నారని ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ భవనాల దగ్గరమరియు గుడి ,మసీదు ,చర్చి, ఓటర్ల సర్వేను చేయాలని కోరారు. ప్రతి వీధి వీధిలో సార్ ఓటర్ల అంశంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ఓటర్లకు, ప్రజలకు తెలియజేయాలని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వీరేష్ యాదవ్,నరసప్ప, అజయ్ పాల్గొన్నారు..

# హాలహర్వి ఎంపీపీఎస్ స్కూల్లో రెగ్యులర్ టీచర్లు నియమించాలి

## - 160 మంది విద్యార్థులకు ముగ్గురు టీచర్లు ఎలా బోధిస్తారు
## - విద్యార్థుల జీవితాలతో చలగాటమాడుతున్న విద్యాశాఖ అధికారులు
## - విద్యార్థి సంఘాలు

**ఎమ్మిగనూరు(భారత శక్తి)** నందవరం మండలం హాలహర్వి గ్రామంలో ఎంపీపీఎస్ స్కూలు ముందు ఆర్ ఏ వి ఎఫ్, పి ఆర్ ఎస్ వై ఎఫ్, పి ఎస్ యు విద్యార్థి సంఘాలు మరియు గ్రామస్తుల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా విద్యార్థి సంఘం నాయకులు కృష్ణ రఘునాథ్ ఖాజా సురేష్ మాట్లాడుతూ ప్రభుత్వం డీఎస్సీ ద్వారా జిల్లాకు 2700 పోస్టులు ఇచ్చామని గొప్పలు చెప్పడం తప్ప జిల్లా మారుమూల గ్రామాలలో చాలా స్కూళ్లలో టీచర్ల కొరతమాత్రం అలాగే ఉందని వారు అన్నారు ముఖ్యంగా హాలహర్వి గ్రామంలో 160 మంది విద్యార్థులకు కేవలం ఒక్క రెగ్యులర్ ఉపాధ్యాయుడే ఉండటం దుర్మార్గమని వారు అన్నారు అధికారులు తూతూమంత్రంగా ఇద్దరూ ఉపాధ్యాయులను డిప్యూటేషన్ వేసి చేతులు దులుపుకోవడం సరైన చర్య కాదని వారు అన్నారు హాలహర్వి గ్రామంలో ఉపాధ్యాయుల కొరత వలన విద్యార్థులు టీసీలు తీసుకొని ప్రైవేట్ స్కూల్లో కి వెళ్లే పరిస్థితి నెలకొని ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు ఇకనైనా అధికారులు నాయకులు స్పందించి విద్యా హక్కు చట్టం ప్రకారం 1:30 రేషియో ప్రకారం ఉపాధ్యాయులను నియమించాలని అలాగే అసంపూర్తిగా ఉన్న తరగతి గదులను పూర్తి చేసి మౌలిక సదుపాయాలు కల్పించకపోతే విద్యార్థులు తల్లిదండ్రులతో కలసి జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయాన్ని ముట్టడిస్తామని వారు హెచ్చరించారు ఈ కార్యక్రమంలో గ్రామస్తులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు

# టీఆర్ఎస్ నేతల అరెస్టు

**మేడ్చల్(భారత శక్తి)** ఉప్పల్ బాగాయత్లో నిర్వహించాలని నిర్ణయించిన భూపోరాట సభకు పోలీసులు అనుమతి లేకపోడంతో పాటు ముందస్తు అరెస్టులు చేపట్టిన నేపథ్యంలో తెలంగాణ రక్షణ సేన నాయకులు సభా వేదికను మేడ్చల్?మల్కాజిగిరి జిల్లా బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని బొల్లిగూడెం ప్రాంతానికి మార్చారు. బొల్లిగూడెంలో సభ నిర్వహణకు తెలంగాణ రక్షణ సేన నాయకులు టెంట్లు ఏర్పాటు చేయగా, సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని అనుమతులు లేవని చెబుతూ టెంట్లను తొలగించారు. ఈ సందర్భంగా పోలీసులు, ఉద్యమకారుల మధ్య స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. భూపోరాటానికి ఉద్యమకారులు తరలివచ్చే అవకాశం ఉండటంతో బొల్లిగూడెం ప్రాంతంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

# గూడూరులో 751 గ్రాముల గంజాయితో ముగ్గురు అరెస్ట్



**గూడూరు, (భారత శక్తి)**గూడూరు పట్టణంలోని పులకుర్తి క్రాస్ రోడ్డులో ఉన్న శ్రీ చింతలముని స్వామి ఆలయం సమీపంలో 751.20 గ్రాముల గంజాయితో ముగ్గురు వ్యక్తులను గూడూరు పోలీసులు అరెస్ట్ చేశారు. కోడుమూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం. తబ్రేజ్ సమాచారం మేరకు, గూడూరు ఎస్ఐ బి. రాజ కుళ్లయప్ప ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా హీరో సీబీ షైన్ మోటార్ సైకిల్ (ఏపీ–39–బీఈ–7555)పై ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, గెజిటెడ్ అధికారి మరియు స్వతంత్ర పంచాయతీదారుల సమక్షంలో సోదా చేపట్టారు. వారి వద్ద ఉన్న మూడు కవర్లలో మొత్తం 751.20 గ్రాముల గంజాయి లభ్యమైంది. ఈ సందర్భంగా గంజాయితో పాటు ఒక వివో మొబైల్ ఫోన్, గంజాయి రవాణాకు ఉపయోగించిన హీరో సీబీ షైన్ మోటార్ సైకిల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసిన వారిలో గూడూరుకు చెందిన భక్త కృష్ణమూర్తి (40), పొన్నకల్ గ్రామానికి చెందిన బోయ వెంకట్రాముడు (58), ప్రస్తుతం గూడూరులో నివాసం ఉంటున్న సి.బెలగల్ మండలం బురందొడ్డి గ్రామానికి చెందిన బెస్త ఉదయ్ కుమార్ (20) ఉన్నారు. నిందితులపై ఎన్‌డీపీఎస్ చట్టం–1985లోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలు లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన ప్రజలు వెంటనే సమీప పోలీసు స్టేషన్‌కు తెలియజేయాలని గూడూరు పోలీసులు విజ్ఞప్తి చేశారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

# సిఐటియు నాయకుల అరెస్టులకు నిరసనగా ధర్నా

**చిట్వేలి(భారత శక్తి)** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంగంపేటలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం విబి జి రాంజీ పథకంగా పేరు మార్చుతూ నేడు ప్రారంభోత్సవం సందర్భంగా రైల్వేకోడూరులో సిఐటియు రాష్ట్ర నాయకులు సిహెచ్ చంద్రశేఖర్ ను, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పందికాళ్ళ మణి ని చిట్వేలి లో పోలీసులు అరెస్ట్ చేయడం అన్యాయం అని సిఐటియు చిట్వేలి మండల కన్వీనర్ వై. సుజాత, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఓబిలి పెంచలయ్య తీవ్రంగా ఖండించారు. చిట్వేలి ఉపాధి హామీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి వారు మాట్లాడుతూ వాస్తవాలను ప్రశ్నిస్తున్నందుకు సమాధానం చెప్పలేక, ఇలా ఉద్యమాలను అడ్డుకోవడం సరికాదన్నారు. ఉపాధి హామీ చట్టం 2006లో వామపక్షాల పోరాటంతో సాధించారని. దాన్ని నిర్వీర్యం చేసేందుకు విబి జి రాంజీ పథకంగా మార్చి ప్రారంభోత్సవం చేస్తున్నారని, ఇది ప్రారంభోత్సవం కాదని ముగింపు అని విమర్శించారు. 90 శాతం కేంద్ర నిధులతో చేపట్టే ఉపాధి చట్టం, పథకం గా మార్చి, 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరించాలని చెప్పడము అన్యాయం అన్నారు. రాష్ట్రం మూడు లక్షల కోట్లు అప్పుల్లో ఉంటే, మేము అంత బడ్జెట్ కేటాయించలేము అని ముఖ్యమంత్రి స్వయంగా చెబితే, ఈ పథకం ఎలా కొనసాగుతుందని ప్రశ్నించారు. పెనగలూరు మండలం వెలకచర్ల లో ఉపాధి కూలీలు ఇద్దరుమృతి చెంది 50 మంది గాయపడి క్షతగ్రాత్రులు అయితే, ఘటన జరిగి రెండు నెలలైనా కనీసం ఒక్క రూపాయి నష్ట పరిహారం చెల్లించలేదన్నారు.

# ఎల్బీనగర్‌లో ఎస్టిఎఫ్ నిల్ అక్రమ నిర్మాణాలు ఫుల్..!

- అనుమతి ఒకదానికి.. నిర్మాణం మరొకదానికి! - రెసిడెన్షియల్ అనుమతులు రెండు అంతస్తుల స్థానంలో కమర్షియల్ కాంప్లెక్స్ ఐదు అంతస్తుల నిర్మాణం
- నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న టౌన్ ప్లానింగ్ విభాగం? - ఎల్బీనగర్ సర్కిల్ 13 టౌన్ ప్లానింగ్ అధికారిని సాయి అర్చన ప్రొఫెషన్ టైం లోనే తన చాకచకాన్ని ప్రదర్శిస్తుంది అనడానికి ఈ కథనం నిదర్శనం.
- ఎం.ఎం.సి ఖజానాకు చిల్లు: సొంత జేబులు ఫుల్లు..! - జోనల్ కమిషనర్ వికాస్ మహతో ఐఏఎస్, ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి ఐఏఎస్ దృష్టి సారించాలి..!






**ఎల్బీనగర్ జూన్ 2 భారత శక్తి:** మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఎల్బీనగర్ జోన్ ఎల్బీనగర్ సర్కిల్ 13 లో నిబంధనల ఉల్లంఘనలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. నివాస ప్రాంతాల అనుమతులతో వాణిజ్య (కమర్షియల్) నిర్మాణాలు చేపట్టడమే కాకుండా, అనుమతించిన అంతస్తుల కంటే అదనపు అంతస్తులను నిర్మిస్తూ కొందరు నిబంధనలను బేఖాతరు చేస్తున్నారు. అగ్నిమాపక భద్రత (ఫైర్ సేఫ్టీ) ప్రమాణాలను పూర్తిగా గాలికొదిలేసి చేపడుతున్న ఈ అక్రమ నిర్మాణాలపై స్థానిక ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**వివాదాస్పద నిర్మాణం వివరాలు:**


మైత్రీపురం, జిల్లెల్‌గూడ గ్రామం (బాలాపూర్ మండలం) పరిధిలోని సర్వే నెంబర్ 27, ప్లాట్ నెంబర్ 143 (ఇంటి నెంబర్: 8-4/1) లో ఒక భవన నిర్మాణానికి మున్సిపల్ కార్పొరేషన్ అనుమతినిచ్చింది.
- దరఖాస్తు/పర్మిట్ నెంబర్: 471095/మీజు-ప్రా/0014/2025 (తేదీ: 11-01-2025)
- అనుమతించిన వైశాల్యం: 188.13 చదరపు మీటర్లు (225.0 చదరపు గజాలు)
- అనుమతించిన నిర్మాణం: స్టిల్ట్ పార్కింగ్ ం 2 పై అంతస్తులు (వ్యక్తిగత నివాస భవనం)

### నిబంధనలు ఉల్లంఘించి ఐదు అంతస్తులు!

పై నిబంధనల ప్రకారం కేవలం రెండు అంతస్తుల నివాస భవనానికి మాత్రమే అనుమతి ఉండగా, సదరు నిర్మాణదారుడు స్టిల్ట్ పార్కింగ్‌తో పాటు ఏకంగా ఐదు అంతస్తుల భవనాన్ని నిర్మిస్తున్నట్లు సమాచారం. అంతేకాకుండా, దీనిని నివాస భవనంగా కాకుండా వాణిజ్య అవసరాల కోసం వినియోగించేలా అక్రమ పద్ధతిలో విస్తరిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. కనీస సెట్ బ్యాక్‌లు వదలకుండా, ఫైర్ సేఫ్టీ నిబంధనలను పూర్తిగా ఉల్లంఘిస్తూ ఈ నిర్మాణం సాగుతోంది.

### అధికారుల అలసత్వంపై స్థానికుల ఆగ్రహం

ఈ అక్రమ నిర్మాణంపై ఎల్బీనగర్ సర్కిల్ 13 కార్యాలయంలో ఫిర్యాదు చేసి నెలలు గడుస్తున్నా స్థానిక అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారిని టి.పి.ఎస్ సాయి అర్చన కేవలం నోటీసుల జారీ వరకే పరిమితమై, వెనుక నుండి నిర్మాణదారునికి సహకరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారులను సైతం తప్పుదోవ పట్టిస్తూ క్షేత్రస్థాయిలో అక్రమాలను ప్రోత్సహిస్తున్నట్లు


OFFICE OF THE MEERPET MUNICIPAL CORPORATION TG-bPASS
RANGAREDDY DISTRICT

TG-bPASS - BUILDING PERMIT ORDER U/S.174(2) OF TELANGANA MUNICIPALITIES ACT 2019
(WITHOUT MORTGAGE)

To,

Smt. 1)SMT.MADHAVI CHAVAN 2) SRI.CHAVAN VINOD
S/o 1) W/O.SRI.CHAVAN VINOD 2) S/O. HANMANTH RAO
HNO.20-110/1 , KODANDARAM NAGAR DILSUKHNAGAR SAROORNAGAR ,RANGA REDDY DISTRICT T.G -50060

| | |
|---|---|
| Application No / Permit No | 471095/MERP/0014/2025 |
| Date | 11-01-2025 |

Sir/Madam,

Sub: Meerpet Municipal Corporation, Rangareddy District - Permission for construction of individual Residential Building in 188.13 Sq.Mtrs (225.0 Sq.Yds) consisting of Stilt for Parking + 2 Upper Floor situated at Plot No: 143 HOUSE NO. 8-4/1, Street/Road: MYTHRIPURAM , Locality: MYTHRIPURAM , Survey No: 27, Jillelguda(V), Balapur(M), Meerpet Municipal Corporation, Rangareddy(Dist). Building Permit Order- Issued - Reg

Ref:
1. Your Application No:471095/MERP/0014/2025 dated: 11-01-2025
2. G.O.Ms.No. 168 MA&UD, Dt.07-04-2012.
3. G.O.Ms.No.7 MA&UD, Dt.05-01-2016.
4. G.O.Ms.No. 62, MA&UD Dt. 21-03-2020.

Your application for individual residential building permission submitted in the reference cited has been sanctioned based on the self-certification given by you as detailed below and subject to conditions mentioned therein

| | | |
|---|---|---|
| A | APPLICANT DETAILS | |
| 1 | Name | Smt 1)SMT.MADHAVI CHAVAN 2) SRI.CHAVAN VINOD |
| B | PLOT DETAILS | |
| 1 | Plot No | 143 HOUSE NO. 8-4/1 |
| 2 | Survey No | 27 |
| 3 | Approved Building Plan | GP/282/13 |

స్థానికులు వాపోతున్నారు.

### ప్రత్యేక టాస్క్ ఫోర్స్ (ఏస్.టి.ఎఫ్) తీరుపై విమర్శలు

నగరంలో అక్రమ నిర్మాణాలను అరికట్టేందుకు ఏర్పాటైన ప్రత్యేక టాస్క్ ఫోర్స్ (ఏస్.టి.ఎఫ్) ఇంచార్జ్‌గా వ్యవహరిస్తున్న టౌన్ ప్లానింగ్ సిపిపై కూడా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిబంధనలు ఉల్లంఘించిన భవనాలపై చర్యలు తీసుకోవడంలో పక్షపాత వైఖరి ప్రదర్శిస్తున్నారని, లబ్ధి చేకూర్చిన వారికి ఒకలా, లేని వారికి మరోలా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి.



### ఉన్నతాధికారులు స్పందించేనా?

ఈ వ్యవహారంపై ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ వికాస్ మహతో (IAS) ఏ విధంగా స్పందిస్తారనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. క్షేత్రస్థాయి అధికారుల నివేదికలపైనే ఆధారపడకుండా, ఉన్నతాధికారులు నేరుగా రంగంలోకి దిగి విచారణ జరపాలని బాధితులు కోరుతున్నారు. అలాగే, మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ చీఫ్ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ ప్రదీప్ కుమార్, కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డిలు కూడా ఈ వ్యవహారంపై దృష్టి సారించి, అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని, బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.ఆధారాలు ఫైల్ నెంబర్ల తో సహా పూసగుచ్చినట్లు పొందుపరిస్తేపొందుపరిస్తే చర్యలు తీసుకోకపోవడం, అధికారులు ఏ విధంగా విఫలమవుతున్నారు ఏ విధంగా లబ్ధిపోతున్నారు అనే పరిశోధనాత్మక కథనాన్ని రేపటి కథనంలో..!

# ఓటర్ల జాబితా ప్రత్యేక ప్రక్షాళన

- రేపు బడంగ్‌పేట్‌లో అవగాహన సమావేశం - కాలనీ ప్రతినిధులు పాల్గొనాలని ఎన్నికల విభాగం పిలుపు




బడంగ్‌పేట్, జూలై 2 (భారత శక్తి ): బడంగ్‌పేట్ పరిధిలో ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు ఎన్నికల విభాగం సిద్ధమైంది. ఈ ప్రక్రియపై స్థానిక ప్రతినిధులకు అవగాహన కల్పించేందుకు శుక్రవారం (జూలై 3) ఉదయం 10:30 గంటలకు బడంగ్‌పేట్ సర్కిల్ కార్యాలయ సమావేశ మందిరంలో ఒక ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి బడంగ్‌పేట్ పరిధిలోని అన్ని కాలనీల అధ్యక్షులు, కార్యదర్శులు తప్పనిసరిగా హాజరుకావాలని బడంగ్‌పేట్ సర్కిల్ ఎన్నికల విభాగం డిప్యూటీ కమిషనర్ ఆదేశించారు.

### - 138 పోలింగ్ కేంద్రాల్లో జాబితా ప్రక్షాళన

బడంగ్‌పేట్ సర్కిల్ పరిధిలోని మొత్తం 138 పోలింగ్ కేంద్రాలలో ఓటర్ల జాబితాను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయడమే ఈ ముమ్మర సవరణ ముఖ్య ఉద్దేశం. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడంతో పాటు, జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా నిష్పాక్షికంగా రూపొందించేందుకు ఈ క్రింది చర్యలు తీసుకోనున్నారు:

**- కొత్త ఓటర్ల నమోదు:** ఓటు హక్కు రాని అర్హులందరినీ ఓటర్లుగా చేర్చడం.

**- తప్పుల సవరణ: పేర్లు, వయస్సు, చిరునామాల్లో దొర్లిన తప్పులను సరిదిద్దడం.**

**జాబితా శుద్ధీకరణ:**

మరణించిన వారి పేర్లు, వేరే ప్రాంతాలకు వలస వెళ్లిన వారి ఓట్లను జాబితా నుండి తొలగించడం.

### - 'వారసుల అనుసంధానం'పై ప్రత్యేక దృష్టి

ఈ సవరణ ప్రక్రియలో భాగంగా కుటుంబంలో కొత్తగా ఓటు హక్కు సాధించిన వారసుల వివరాలను వారి తల్లిదండ్రుల ఓట్లతో అనుసంధానం చేసే (మ్యాపింగ్ ప్రొజని) నూతన విధానంపై ఈ సమావేశంలో ప్రత్యేకంగా అవగాహన కల్పించనున్నారు. దీనివల్ల ఒకే కుటుంబంలోని ఓట్లన్నీ ఒకే పోలింగ్ కేంద్రం పరిధిలోకి వచ్చే అవకాశం ఉంటుంది.

### - జూలై 24 వరకు సహాయ కేంద్రాల సేవలు

ఓటర్ల సవరణ, వారసుల అనుసంధాన ప్రక్రియలో ప్రజలకు, కాలనీ ప్రతినిధులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ప్రత్యేక సహాయ కేంద్రాల ఆపరేటర్లను (హెల్ప్ డెస్క్ ఆపరేటర్లు) నియమించారు.

వీరు ఈ నెల 24 (24.07.2026) వరకు ఆయా కార్యాలయాల్లో అందుబాటులో ఉండి ప్రజలకు సేవలందిస్తారని ఎన్నికల విభాగం తెలిపింది.

### -కాలనీ అసోసియేషన్ల పాత్ర కీలకం:

స్థానిక కాలనీలలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా, ఓటర్ల జాబితా దోషరహితంగా ఉండేలా చూసేందుకు కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు క్రియాశీలక పాత్ర పోషించాలని, రేపు జరిగే అవగాహన సమావేశాన్ని విజయవంతం చేయాలని డిప్యూటీ కమిషనర్ కోరారు.

## లక్ష్యానికి మించి ఆయిల్ పామ్ పంటలను సాగు చేసేలా చర్యలు తీసుకోవాలి

### - జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.



నిర్మల్ జిల్లా ప్రతినిధి, జులై 02 (భారత శక్తి )జిల్లాలో లక్ష్యానికి మించి ఆయిల్ పామ్ పంటలను సాగు చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.గురువారం సాయంత్రం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఆయిల్ పామ్ పంటల విస్తీర్ణం పెంపుదలపై కలెక్టర్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో నిర్దేశించిన 1600 ఎకరాలకు మించి ఆయిల్ పామ్ పంటలను సాగు చేసేలా చొరవ చూపాలన్నారు. ఆ విధంగా రైతులను ప్రోత్సహించాలన్నారు. క్షేత్రస్థాయిలో రైతులకు మిగతా పంటలకు, ఆయిల్ పామ్ పంటలు పండిస్తే కలిగే ప్రయోజనాల మధ్య వ్యత్యాసాలను వివరించాలన్నారు. పెట్టుబడి, శ్రమ, సాగునీరు, రాబడి వంటి లాభాలను రైతులకు తెలియజేయాలన్నారు. హార్టికల్చర్, వ్యవసాయ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి సాగు విస్తీర్ణాన్ని పెంచాలని వివరించారు. ప్రభుత్వం ఆయిల్ పామ్ పంటల సాగును ప్రోత్సహిస్తుందని అన్నారు. మండలాల వారిగా వ్యవసాయ శాఖ అధికారులు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, వ్యవసాయ, హార్టికల్చర్ అధికారులు అంజిప్రసాద్, రమణ, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## దిశ కమిటీ సమావేశానికి సంబంధించి అన్ని నివేదికలు సిద్ధం చేసుకోవాలి

### - జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.



నిర్మల్ జిల్లా ప్రతినిధి, జులై 02 (భారత శక్తి) రేపటి దిశ కమిటీ సమావేశానికి సంబంధించి అన్ని నివేదికలు సిద్ధం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో గురువారం సాయంత్రం కలెక్టర్ దిశ కమిటీ సమావేశ నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంబంధిత ప్రజాప్రతినిధులందరికీ దిశ కమిటీ సమావేశానికి సమాచారం ఇవ్వాలని అన్నారు. ప్రతి అధికారి వారి శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులు, అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలు, ప్రజలు పొందిన లబ్ధి వివరాల నివేదికలను సిద్ధంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. నివేదికలు పారదర్శకంగా ఉండాలన్నారు. ఆయా శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన పనులు, పథకాల వివరాలను సమీక్షించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, డిఆర్డిఓ విజయలక్ష్మి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలకు రూ.5 కోట్ల మంజూరు పట్ల హర్షం

### "థాంక్యూ షబ్బీర్ అలీ సార్. థాంక్యూ రేవంత్ రెడ్డి సార్" అంటూ విద్యార్థుల నినాదాలు




కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జులై 02: కామారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల అభివృద్ధి, ఆధునికీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 5 కోట్ల నిధులు మంజూరు చేయడంపై పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, తెలంగాణ ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ కి కృతజ్ఞతలు తెలియజేశారు.పాఠశాల అభివృద్ధి కోసం ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ నిరంతరం ప్రత్యేక చొరవ తీసుకున్నారని ఉపాధ్యాయులు తెలిపారు. తాను చదువుకున్న ఈ పాఠశాలను రాష్ట్రంలోనే ఆదర్శ విద్యాసంస్థగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లి, రూ. 5 కోట్ల నిధులు మంజూరు చేయించడంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు.ఈ నిధులతో ఆధునిక తరగతి గదులు, మెరుగైన మౌలిక వసతులు, విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే రాష్ట్ర ప్రభుత్వ సంకల్పానికి ఈ నిర్ణయం నిదర్శనమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తూ "థాంక్యూ షబ్బీర్ అలీ సార్... థాంక్యూ రేవంత్ రెడ్డి సార్..." అంటూ నినాదాలు చేశారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను స్వాగతిస్తూ, భవిష్యత్తులో కూడా విద్యార్థుల సంక్షేమానికి ఇలాంటి నిర్ణయాలు కొనసాగాలని ఆకాంక్షించారు.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446,
Cell: 9550336688,94405 08078 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy,Executive Editor: M.Venugopal Reddy